


కృష్ణశాస్త్రి

వ్యాసావళి-3

మహావ్యక్తులు

CT

కృష్ణ శాస్త్రి

వ్యాసావళి-3

మహా వ్యక్తులు

సంపాదకులు :

బాలాంత్రపు నళినీకాంతరావు

బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

సహకారం :

పాలగుమ్మి విశ్వనాథం

బాలాంత్రపు రజనీకాంతరావు

కురుమెళ్ల వేంకటరావు

కె. వి. రమణారెడ్డి

నిడమర్తి నిర్మలా దేవి

పి. బి. శ్రీనివాస్

వెలమకన్ని సుబ్రహ్మణ్య శర్మ

వింజమూరి ప్రభాకరం

అవసరాల అనసూయా గిరి

వింజమూరి సీతాదేవి

బి. గోపాలం

పి. ఎస్. గోపాలకృష్ణ

పర్యవేక్షణ :

పాలగుమ్మి పద్మరాజు

ఎ. ఎస్. రామన్

కృష్ణాస్త్రి

వ్యాసావళి-3

Donated by....
Dr. Sivalenka Prakasarao

– మహా వ్యక్తులు –

రాజహంస ప్రచురణలు

9, జగదాంబాళ్ స్ట్రీట్, మద్రాసు-600017

A11

KRISHNA SASTRI'S ESSAYS - 3

Maha Vyaktulu

© D. S. Sastri (Bujjai)

First Edition:
February 1982

Published by
RAJAHAMSA PRACHURANALU,
9, Jagadambal Street, Madras - 17.

Printed at
FREEDOM PRESS
MADRAS - 600021

Cover Design:
BUJJAI

Cover Printing
VIKRANTH SCREENS

Price :
Rs. 12-50

విషయ క్రమం

కృతజ్ఞత	vii
భూమిక	ix
ఆస్వాదానికి ఆహ్వానం	xiii
మహావ్యక్తులు :	
మానవతామూర్తి పీరేశలింగం	1
ఆంధ్రదేశము : రాజ్యలక్ష్మమ్మగారు	13
చిలకమర్తి లక్ష్మీనరసింహం	26
బ్రహ్మర్షి గురుదేవులు	29
రవీంద్ర స్మృతి	37
బ్రాహ్మ సమాజ జ్యోతులు	45
ఉమర్ ఖయ్యామ్	50
చిత్తరంజన్ దాస్	58
ప్రకాశం	66
కోపల్లె - ముట్నూరి - భోగరాజు	78

★

"రామమోహన రాయలు అంటే 'విలియం బెంటింక్ సాయంతో నహ గమనమును మాన్పించెను' అంటాం, దిక్కు మాలిన textbook లో అంతే ఉంది. అది అప్ప గించేస్తాం. ఆయన సమగ్ర భారతాభ్యున్నతికి ఏ విధంగా మూల పురుషుడో, ఆయన ఏ లాగున నవ యుగానికి ప్రవక్తో, తొలి విశ్వమానవుడో (universal man), ఆయన చూపించిన గమ్యస్థానాన్ని ఇంకా స్పష్టంగా దర్శించలేక, లోకం యావత్తూ అటు కదలి నడవడానికి గిలగిల లాడుతూ, కిందా మీదా పడుతూ ఎలాగ ప్రయత్నం చేస్తూందో తెలుసుకోలేము."

- పుటలు 1/2

★

కృతజ్ఞత

ఇంతవరకూ పుస్తక రూపంలో రాని మా నాన్న గారి రచనలు ఈ నాడు ఈ రూపంలో వస్తున్నా యంటే దానికి ముఖ్య కారకులు శ్రీ బాలాంత్రపు నళినీకాంతరావు గారు. సుమారు సంవత్సరన్నర క్రితం నేను వారి సహాయం అడగగానే సంతోషంగా ఈ పని చేపట్టారు. ఆ రోజు లగాయతూ ఈ రోజు వరకూ నిద్రాహారాలు లేకుండా, అక్కడా ఇక్కడా ఉన్న రచనలు చేర్చి, కూర్చి వాటికి ఈ రూపం ఇచ్చారు. వారికి నా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. వారి ఋణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను.

వారికి చేదోడు వాదోడుగా ఉంటున్న శ్రీ బొమ్మ కంటి శ్రీనివాసాచార్యులుగారికి కూడా నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాలకి తొలిపలుకు వ్రాసి ఇచ్చిన శ్రీశ్రీ గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

ముఖ్యంగా, ఈ పుస్తకాల అచ్చుకు ఆర్థిక సహాయం చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారికి నా కృతజ్ఞతలు.

దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి
(బుజ్జాయి)

★

"బాగా ఆప్తు లుంటారే, బొత్తిగా గుండెలకు పెనవేసుకు పోయిన వాళ్లు, వాళ్లని తప్పిస్తే కనుచూపు దాటిపోయిన వాళ్లందరూ మనస్సులో గూడా మాసిపోతారు...."

- పుట 58

★

భూమిక

ఈ శతాబ్దం పూర్వార్ధంలో "తెలుగులో ప్రథమశ్రేణికి చెందిన కవు లెవరు?" అని ఆంధ్రేతరు లెవరైనా అడిగితే - కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నండూరి, శ్రీ శ్రీ అని చెబుతూ ఉండడం పరిపాటి. గురజాడ, రాయప్రోలు, తిరుపతి వేంకట కవులు లాంటి ఆధుని కాంధ్ర కవితా వైతాళికుల్ని కాదని ఈ నలుగురినే ప్రథమశ్రేణి కవు లనడంలో ఒక సబ బుంది. ఒకటి: తమ తమ కవితా మార్గాల్లో అంతకంటె మెరుగు పెట్టడం అనంభవం అనిపించేటంత ఉజ్జ్వల ప్రతిభ వారు ప్రదర్శించారు. రెండు: పొగడ్తలతోనో, తెగడ్తలతోనో నమకాలీన సమాజం తక్కిన కవులకంటె తమనే ఎక్కువగా పట్టించుకోవడం తప్పనిసరి చేసిన బలమైన కంఠాలు వారివి. మూడు: వేషభాషలతో సహా డజన్లకొద్దీ కవులు తమను అనుకరించేట్టు చేసుకున్న విలక్షణమైన వ్యక్తిత్వాలు నలుగురివీ!

నలుగురిలోనూ కృష్ణశాస్త్రీ, విశ్వనాథా మరింత బహిర్వర్తులు (extroverts); తమ వక్తృత్వ ప్రతిభతో నమకాలీన సమాజానికి మరింత దగ్గిర అయిన వారు; వివిధ సాహిత్య ప్రక్రియలు చేపట్టిన వారు; చేపట్టిన ప్రతి ప్రక్రియమీదా ప్రస్ఫుటమైన తమ ముద్ర నిలిపినవారు!

'కృష్ణశాస్త్రి వ్యాసావళి' తొలి రెండు సంపుటాలూ 'లోచూపు' గల సాహిత్య విమర్శకుడుగా కృష్ణశాస్త్రిని అధ్యయనం చేయడానికి ఉపకరిస్తే, అద్భుత 'పద చిత్ర' కారుడుగా అయన కైవాడాన్ని మదింపు కట్టడానికి తోడ్పడుతుంది - 'మహావ్యక్తులు' అనే ఈ మూడో సంపుటం.

తెలుగులో పద చిత్ర రచనా ప్రక్రియ అంతగా పరిపుష్టం కాలేదు. శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 'ఆంధ్ర రచయితలు',

శ్రీ తిరుమల రామచంద్ర 'మరపురాని మనీషి', శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి 'ఏరిన ముత్యాలు' వంటి పద చిత్ర సంపుటాలు కొన్ని వచ్చినా, వాటిలో జీవిత విశేషాలకు ఉన్నంత ప్రాధాన్యం నజీవ మూర్తి కల్పనకు కన్పించదు. ఒక కార్టూనిస్ట్ ఒక నాయకుడి పోలికలు స్ఫురించేట్టు రేఖా చిత్రం గీయవచ్చు; కాని తపస్వీ, ద్రష్టా అయిన ఉత్తమ కళాకారుడు గీసే రేఖా చిత్రం వేరు. బాహ్యమైన ఆ వ్యక్తి పోలికలు మాత్రమే కాక, అతని ఆంతర వ్యక్తిత్వాన్ని ప్రదర్శించే రేఖల్ని ముఖ్యంగా ఆ కళాకారుడు పట్టుకుంటాడు; మళ్ళీ మళ్ళీ చూడా లనిపించే అద్భుత కళాసృష్టి అతడు. చేస్తాడు. జర్నలిస్టుల పద చిత్రాలకూ, అంతర్దృష్టి గల మహాకవి పద చిత్రాలకూ అలాంటి తేడా ఉంటుంది.

ఉదాహరణకి - వీరేశలింగాన్ని గూర్చిన మొదటి పద చిత్రం*లో ఒక్కతేదీ కూడా మనకి కనిపించదు. తేదీలు అనవసరం. ఆయన ఎప్పుడు పుట్టాడో, ఎప్పుడు చనిపోయాడో తెలియడం వల్ల ఆ మనిషి మనకి తెలియడు.

> "వీరేశలింగం వాసికా త్ర్యంబకం. నవ్యాంధ్ర జీవితం అఖండ గౌతమి. మూరేళ్ల ఈ మధ్య ఉన్న తెలుగు వారందరూ వారికి తెలియ కుండానో తెలిసో వీరేశలింగంలో ఉన్నారు - అందరూ, అందరూను!"
>
> - పుట 2

ఇలా – తెలుగువారిలో ఆధునికత్వాన్ని అవతరింపజేసి, మూరేళ్ల ఈ మధ్య ఉన్న తెలుగు ప్రజ లందరి జీవితాల్లో కలిసిపోయిన ఆ జ్యోతీ రూపాన్ని మన మనోనేత్రం ముందు కట్టడం ఉత్తమ 'పదచిత్ర' లక్షణం!

వీరేశలింగం భౌతికరూపం ఎలా ఉండేదో అయన ఫొటో మనకు చెబుతుంది. పదచిత్ర కారుడు దాన్ని వర్ణించనక్కర లేదు.

---

*122 వ జయంత్యుత్సవ సభ (28-6-1970) లో చదివించిన ప్రసంగం

అయన ఆత్మభవనంలోని మారుమూల గదులలో కూడా టార్చి లైటు వేసి చూపించడం పదచిత్ర కారుడు చేయవలసిన పని.

"ఆయనకు అలవికాని కోపం ఉండే దవిపించేది అందరికీ. రాజు అవనీ, రెడ్డి అవనీ - ఎంత మేటి అయినా ఆయన ఎదుట కుంచుకు పోయి, వెనక్కి తగ్గి విలబడేవాడు - సత్యం సమక్షాన అసత్యపు వీడలాగ; చీకటి మసకలాగ; ఎక్కడో ఏ కొంచెమో మాలిన్యం ఉన్న వ్యక్తి లాగ!

"అయితే - అది కోపం కాదంటాను నేను. ఆయన చేత అంత పని చేయించిందే కరుణ అయెను!

"అది తొందర - impatience!

"ఎంతో పని చేయవలసి ఉంది. ఏమో ఎవ్వేళ్లు జీవిస్తాడో! ఎటు చూసినా సమాజం కుళ్లి ఉంది - Augean stables లాగు."

- పుటలు 5,6

భట్రాజు పొగడ్తలాగ కాకుండా, వ్యక్తిలోని అన్ని లక్షణాలనూ యథాతథంగా ప్రదర్శించి వ్యాఖ్యానించడం ఉత్తమ పదచిత్ర లక్షణం!

మనోహరమైన, కళాత్మకమైన ఇలాంటి ఉజ్జ్వల పద చిత్రాల గ్యాలరీ 'మహావ్యక్తులు' అనే ఈ సంపుటం. వీరేశలింగం, బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు లాంటి మనీషులూ, సంఘ సంస్కర్తలూ, చిలకమర్తి, రవీంద్రుడు, ఉమర్ ఖయ్యామ్ లాంటి కవులూ, ప్రకాశం, చిత్తరంజన్ దాస్ లాంటి రాజకీయ నాయకులూ తేజోరూపాలతో ఈ పద చిత్రాలలో దర్శనం ఇస్తారు. "బ్రాహ్మ సమాజ జ్యోతులు", "కోపల్లె - ముట్నూరి - భోగరాజు" లాంటి సమూహ చిత్రాలు కూడా కొన్ని ఈ సంపుటంలో కనిపిస్తాయి.

ఈ పదచిత్రాలలో 'ప్రకాశం' పదచిత్రం పురీ కొట్టొచ్చినట్టు కనిపించి విశేషంగా ఆకర్షిస్తుంది. సూక్తులుగా జన వ్యవహారంలో కలిసిపోదగిన వాక్యా లెన్నో దీనిలో కనిపిస్తాయి:

"సామాన్యవ కున్న దర్జా సామంతువకే లేదు." - పుట 67
"గదె మీదా, గరికెవేల మీదా ఒకే ఠీవితో కూచో
గలిగివ వాడిదే హుందా !" - పుట 67
"ప్రకాశం మూడుకోట్ల జనం పేరు !" - పుట 68
"ప్రకాశం యాత్రకు గమ్య స్థానం లేదు." - పుట 72
"మెచ్చుకువి వెన్ను చరచ గలడు ; నొచ్చుకువి
వెన్ను చీల్చ గలడు." - పుట 73

తను తెర మరుగున ఉంటూ పురుషుణ్ణి ఆడించే శక్తి స్వరూపిణి స్త్రీ. లోకానికి అంతగా తెలియని కందుకూరి రాజ్యలక్ష్మమ్మగారి విశిష్ట వ్యక్తిత్వాన్ని చిత్రించే పద చిత్రంలో శాస్త్రిగారు ఇలా అంటారు :

"విజావికి ఏ మహాపురుషుడు ఉత్తమ మహిళా ప్రభావ లేకుండా లోకోత్తర కార్యాలు చేశా డయ్యా ?" - పుట 14

అయితే - ఒక్కమాట చెప్పాలి. ఒక సాహిత్య ప్రక్రియగా తాను పదచిత్రాలు రాస్తున్నా నని గాని, ఒక రోజున ఇవన్నీ ఒక సంపుటంగా ఇలా వెలువడుతా యని గాని అనుకుని కృష్ణశాస్త్రి గారు చేసిన రచనలు కావివి. రేడియో వారో, మరొకరో వెంటబడి తరిమి, తరిమి అప్పు డప్పుడు ఆయనచేత వ్రాయించిన వీ రచనలు. పదచిత్ర శిల్పిగా కృష్ణశాస్త్రి ప్రతిభను అధ్యయనం చేయడానికి ఈ సంపుటం ఏ మాత్రం ఉపయోగపడినా సంపాదకుల కృషి చరితార్థం అయినట్టు !

శ్రీ శాస్త్రిగారి అముద్రిత రచనల్ని ప్రచురించడానికి తలపెట్టిన ఈ మహా యజ్ఞంలో అధ్వర్యులుగా ఉండి 'కృష్ణశాస్త్రి సాహితి'కి యథాశక్తి సేవ చేసే అవకాశం మాకు కలిగించిన 'రాజహంస ప్రచురణల' అధిపతి చిరంజీవి దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి (బుజ్జాయి) కి మేము కృతజ్ఞులం !

సంపాదకులు

ఆస్వాదానికి ఆహ్వానం

ఇక్షు సముద్రం ఎక్క డుందో నాకు తెలియదు. కాని, ఆపాత మధుర మయిన కృష్ణశాస్త్రి సాహిత్యం సమ స్తమూ ఇక్షు రసార్ణవమే. కృష్ణశాస్త్రి పలుకుల్లోని చెరుకు తీపి సాహిత్యరస పిపాసువులకు ఎక్కడో ఉందనుకొనే ఇక్షుసముద్రాన్ని వెదుకోవలసిన అగత్యాన్ని తొలగిస్తుంది.

అందుకే పురాణాల్లో పేరొక్కన్న ఇక్షు సముద్రం ఎక్క డుంటుందో దాని జాగ్రఫీ జోలికి వెళ్లదలచుకోను నేను. మన యెదుట నిజంగా కృష్ణశాస్త్రి సాహిత్య సమస్తమూ ఉరకలూ పరుగులుగా ఉప్పొంగుతోంది. ఇదే అసలు సిస లయిన చెరుకు రసాల కడలి. ఆస్వాదించుదాం రండ్రా అని అందర్నీ ఆహ్వానిస్తున్నాను.

ఒకప్పుడు కృష్ణశాస్త్రి కవిత్వం మాత్రమే మాధుర్య 'మా' ధుర్య మనుకున్నాము. ఇప్పుడు మీ చేతిలో ఉన్న పుస్తకాన్ని చూడండి. ఇంకా అచ్చవుతున్న, లేదా అయి, సిద్ధంగా ఉన్న సంపుటాల్ని చూడండి. అప్పుడు మాధుర్యం అంటే ఏమిటో మీకే అర్థం అవుతుంది. అప్పుడు వాస్తవంగానే ఒక ఇక్షుసముద్రంలో మీరు ఓలలాడుతారు.

కాని, ఇక్కడో చిన్న విశేషం ఉంది. తినగ తినగ వేము తియ్యనుండు నేమో కాని అంతా చెరుకు రసమే అయితే మొగం మొత్తేస్తుంది. అందుకే కృష్ణశాస్త్రి చెరుకు

సముద్రంలో అక్క డక్కడ మిరియాల పొడి ఉంది. కరక్కాయల కసటుదనం ఉంది. ఇంకా మీరు కోరుకొనే ఎన్నెన్నో మసాలా లున్నాయి.

ఇప్పుడు నా మనస్సు 50 సంవత్సరాల వెనక్కి పోతోంది. 1920 ల ప్రారంభ దినా లవి. ఆ రోజుల్లోనే జమీందారీ కవిత్వాన్ని తోసి రా జని భావకవిత్వం రంగ ప్రవేశం చేసింది. 1910 - 20 ల మధ్య ఈ ఉద్య మాన్ని ప్రారంభించిన వారు రాయప్రోలు, అబ్బూరి. అయితే దీనికి 20 లలో అఖిలాంధ్ర ప్రాచుర్యం ఇచ్చిన వాడు కృష్ణశాస్త్రి. బరంపురం నుంచి బళ్ళారి దాకా ఈయన తనవీ, ఇతరులవీ భావగీతాల కవితాగానం చేస్తూ యువతరాన్ని ఆకట్టుకున్నాడు.

అయితే కృష్ణశాస్త్రిది ప్రతిఘటన లేని విజయయాత్ర కాదు. మహాపండితు డయిన అక్కిరాజు ఉమాకాన్తమ్ "నేటి కాలపు కవిత్వం" అనే పుస్తకం రాసి, అందులో ఎక్కువ భాగం కృష్ణశాస్త్రినే వెక్కిరించాడు. ఉమా కాన్తమ్ (సంస్కృతపు స్పెల్లింగు చూడండి!) గారికి సంస్కృతంలో తప్ప మరెక్కడా కవిత్వం కనబడదు. నన్నయభట్టును కూడా ఆయన కవిగా ఖాతరు చెయ్య లేదు. నేటి కాలం కవిత్వానికి కాలం కా దనేశా డాయన.

కాని, ప్రపంచం మాత్రం వేరు విధంగా భావించింది. భావకవిత్వాన్ని ఆ నాటి ప్రధాన శాఖగా గుర్తించింది. ఈ శాఖ ఎన్నో కోకిలలకు ఆశ్రయం ఇచ్చింది. (గౌతమీ కోకిలగా పేరు పొందిన వేదుల సత్యనారాయణ శాస్త్రిని

ఇక్క డో చిన్న ఉదాహరణగా ఉటంకించ వచ్చును.) ఈ అన్ని కోయిలల్లో అగ్రస్థానం సాహిత్య విమర్శకు లంకా కృష్ణశాస్త్రిదే అని అంగీకరించారు.

"నేటి కాలపు కవిత్వం" ఇప్పుడు లైబ్రరీలలో బూజు పట్టిపోతోంది. కృష్ణశాస్త్రి కవిత్వం భావకవితకు పరా కాష్ఠగా నిలబడింది.

అనంత పంతుల రామలింగ స్వామి అనే ఆయన "కృష్ణ పక్షం" కావ్య సంపుటిని వేళాకోళం చేస్తున్నా ననుకుంటూ "శుక్లపక్షం" అనే రాతని వెలువరించాడు. దాన్ని కూడా ఇప్పుడు చదివే వా ళ్లెవరూ లేరు. ఆ రోజుల్లోనే దాన్ని వేదుల "ఈ శుక్లపక్షం సారస్వతారిష్టం అనే శుక్లనష్టం" అని చెప్పి సహృదయుల హృదయ ఫలకాల నుంచి తుడిచిపెట్టి పారేశాడు.

1930 లలో భావకవిత్వం మీద తిరుగు బాటుగా అభ్యుదయ కవిత్వం వచ్చింది. కాలంతో పాటు ఎదుగు తున్న కృష్ణశాస్త్రి అభ్యుదయ కవిత్వాన్ని ఆహ్వానించి ఆశీర్వదించాడు. అంతే కాదు. అభ్యుదయ రచయితల సంఘం వార్షికోత్సవాలలో ఒకదానికి అధ్యక్షత వహించాడు.

సినీమా రంగంలో ప్రవేశించి, మళ్లీ ఇలాంటిది రావ డానికి వీల్లే దన్నట్టుగా మల్లీశ్వరి రాశాడు.

ఈ మధ్య కాలంలో ఆయన యెన్నో రేడియో నాట కాలు రాశాడు. రేడియో ప్రసంగాలు చేశాడు.

ఆ తర్వాత ఆయన గొంతుక పోయింది. కాగితాలమీద (చిన్న చిన్న నోటుబుక్కుల మీద) అక్షరాలు రాస్తూనే, తన దగ్గరకు వచ్చిన అందరితోనూ ప్రసంగించాడు. ఎన్నో ట్రంకు పెట్టెల నిండా ఈ నోటుబుక్కులున్నాయని బుజ్జాయి (కృష్ణశాస్త్రిగారబ్బాయి) నాతో చెప్పాడు.

ఒక దానిలో కృష్ణశాస్త్రిగారు నామీద ఇలా రాశారట: "శ్రీ శ్రీ గొప్పకవి. అతని మీద ఈగ వాలినా నేను సహించలేను" అని!

నా మీద వారి కెప్పుడూ సదభిప్రాయమే ఉంది. మరి వారి మీద నాకు వల్లమాలినంత అభిమానం. నా మనస్సు మీద చెరగని ముద్రలు వేసిన ముఖ్యాతి ముఖ్యులలో కృష్ణశాస్త్రిని ప్రముఖంగా పేర్కొంటాను.

వారి మీద నా కున్న అభిమానం, అపేక్ష వారి యీ గ్రంథ సంపుటాలకు గాను ఈ రాత రాయడానికి ప్రేరేపించాయి. మరో మారు చెబుతున్నాను. ఇది ఇక్షు సముద్రం. "అందరం ఆస్వాదించుదాం, రం"డని ఆహ్వానిస్తున్నాను.

మద్రాసు,
29-11-81

శ్రీ శ్రీ

మానవతా మూర్తి

వీరేశలింగం

శ్రీ వీరేశలింగమూ, నా గురుదేవుడు వేంకటరత్నమూ నా మనస్సులో నిలిచినప్పుడు ఎంతో చెప్పాలని ఉంటుంది. ఎంతెంతో!

ప్రతికున్నప్పుడు మహాపురుషులను గొప్పవారు అని స్వీకరించడానికి మనస్సు సహించదు. వారిలో కూడా మనలో లాగే సమానంగా ప్రతి దినమూ, ప్రతి నిమిషమూ రోగాలూ రొష్టులూ, రాగాలూ ద్వేషాలూ అస్మి కనబడి. మనకన్న వారు అధికు లని అనా లని అనిపించదు.

ఇక గతించిన మహాపురుషులను కూడా ఖచ్చితంగా, నరిగ్గా విలువ కట్టలేము.

వారిని దేవపదవి కయినా ఎత్తుతాము. లేదా, "ఔనూ, కాదు" అన్నట్లు వారికి ఒక చిన్న సర్టిఫికెట్టు అయినా యిచ్చి తోసేస్తాము _ "గొప్ప సంఘ సంస్కర్త" అనో, మరేదో అనో!

రామమోహన రాయలు అంటే "విలియం బెంటింక్ సాయంతో సహగమనమును మాన్పించెను" అంటాం. దిక్కుమాలిన textbook లో అంతే ఉంది. అది అప్పగించేస్తాం. ఆయన సమగ్ర భారతాభ్యున్నతికి ఏ విధంగా మూలపురుషుడో, ఆయన ఏలాగున నవయుగానికి ప్రవక్తో, తొలి విశ్వమానవుడో (universal man), ఆయన చూపించిన గమ్యస్థానాన్ని

ఇంకా స్పష్టంగా దర్శించలేక, లోకం యావత్తూ అటు కదలి నడవడానికి గిలగిల లాడుతూ, కిందా మీదా పడుతూ, ఎలాగ ప్రయత్నం చేస్తూందో తెలుసుకోలేము.

అలాగే, వీరేశలింగం అనగానే, "ఆయన విధవా వివాహములు చేయించెను. అనేక గ్రంథములు వ్రాసెను. తెలుగులో మొదటి నవల రచించెను. ఆంధ్ర కవుల చరిత్ర వ్రాసెను. ఆయన ధైర్యశాలి. సంఘాన్ని ఎదిరించెను" అంటూ ఒకటే పాట పాడి ఊరుకుంటాం.

అంతే గాని.

అభిన వాంధ్ర శుభోదయ ప్రాప్తి కెల్ల
మూల పురుషుం డొకండె, విశాల దృష్టి
ఆ మహర్షి నాటిన మహోద్యమ లతికలె
సూన పల్లవతతి మోసె.....

అని గ్రహించము.

సాహిత్య క్షేత్రంలో, సంస్కరణ మార్గంలో, సేవా వీధిలో, రాజకీయ రంగంలో, కృష్ణా గౌతమీ తుంగభద్రా ఘట్టాల్లో, సాగర తీరాల్లో, వనుల్లో, గనుల్లో, కేదారాలలో, కార్ఖానాలలో ప్రబుద్ధమైన చైతన్యంతో దాదాపు నాలుగు కోట్ల ఆంధ్రప్రజ నేడు అవిశ్రాంత కార్యోత్సవంలో మునిగి ఉన్న దంటే, ఆ దుర్వార కర్మధారకు జన్మస్థానం యుగకర్త, ప్రవక్త అయిన వీరేశలింగం.

వీరేశలింగం నాసికాత్ర్యంబకం. నవ్యాంధ్ర జీవితం అఖండగౌతమి. నూడేళ్ల ఈ మధ్య ఉన్న తెలుగువా రందరూ, వారికి తెలియకుండానో, తెలిసో వీరేశలింగంలో ఉన్నారు – అందరూ, అందరూను:

పీరేశలింగం విధవా వివాహోద్యమం, మరో ఉద్యమం లేవదీసి నడిపించా డంటే, దాని అర్థం అంతేనా?

అంతే అయితే, అందరూ ఆ ఉద్యమాన్ని హర్షించే ఈ రోజులలో ఇంకా ఎందుకు ఆముదం లాగున ఆ మాటే అనడం?

ఆయన పని ఏనాడో అయిపోయిం దన్న మాట!

ఊఁహూఁ—అదికా దండి! ఆ ఉద్యమం నడిపిస్తూ ఆయన ఆంధ్రజనాన్ని ఈ విధంగా హెచ్చరించా రన్న మాట;

"ఇదిగో, ఇది మన జాతి. ఇది ప్రస్తుతం తెగ కుళ్ళి ఉంది. దీనిలో మౌఢ్యం, అంధకారం, కల్మషం, కౌటిల్యం, దాస్యం చిక్కగా మూగి పోయి ఉన్నాయి. ఉదాహరణకు చూడండి – ఈ బాల విధవల దుస్థితి, ఈ హరిజనుల దుర్దశ, ఈ కళావంతుల హేయపద్ధతి! వీటి నన్నిటినీ, ఇంకా ఇట్టివాటిని ఎన్నిటినో మనం తొలగించి పారెయ్యక పోతే ఎలాగ? దాస్యా లన్నిటిలోనూ మనోదాస్యం మరీ చెడ్డది. అది వదలించు కోకపోతే ఎలాగ? ముందు నీ మవన్నును కట్టి పెట్టిన సంకెల తెంచేస్తాను. కొన్ని సంస్థలూ, ఆచారాలూ మనకు ప్రియతమ మై పోయాయి. అవి మనకు సంకె ళ్లని అసలే తెలియదు. నీకు భయం లేదు. వానిని బద్దలు కొట్టెయ్! భయ మెందుకు? సత్యానికి భయ మేమిటి? ధర్మం, న్యాయం, కరుణ – వీటికి బెమ రేమిటి? ఇదుగో నా వైపు చూడండి! ఇలాగ! ఇదుగో, ముందు ఈ సంకెల బద్దలు కొట్టి చూపిస్తున్నా నిర్భయంగా! చూసేరా? ఇలాగే ముందు ముందు సంకెళ్ల నన్నిటినీ మీరు తెంచి పారెయ్యాలి!

"బూజు, దుమ్ము, ధూళి
మూసెను తిమిరాళి!
మాసె నీ హవేలీ!

పురాణ మీ దివాణం, చెడి
బూజు పట్టకుండా -
తెరవండీ తలుపులు!''

అటూ కర్కశమైనా కరుణార్ద్రమైన హస్తంతో, కోట్ల జనాన్ని పేళ్ళు మని కొట్టి, లేపి, నిలబెట్టా డన్న మాట!

కనుక వీరేశలింగం విద్యాసాగర్‌లాగ వట్టి సంస్కర్త మాత్రమే కాడు.

రామమోహన రాయలులాగ ప్రవక్త, యుగకర్త.

ఒక గొప్ప విద్వాంసుడూ, విజ్ఞుడూ ఆయన్ని బసవేశ్వరునితోనే పోలు స్తాడు.

వీరేశలింగాన్ని కీర్తిస్తూ, ''ఆయన ఒక మహావ్యక్తి మాత్రమే కాదు _ ఆయన ఒక గొప్ప సంస్థ'' అనీ, ఒక ''మహోద్యమం'' అనీ కొందరు అంటూంటారు. అబ్బే! సంస్థ లన్నీ ఆయనే! ఉద్యమా లన్నీ ఆయనే! జనం అంతా కలిసిన జనశక్తి ఆయనే కనుక.

వీరేశలింగం ప్రజ!

వీరేశలింగం మంచి. కోట్ల మంది.

వ్యక్తికి కులం ఉంది, ప్రజకు లేదు. వ్యక్తికి ఒక మతం ఉంది, జనానికి లేదు. వ్యక్తికి వయస్సు ఉంది, మందికి లేదు. మందికి జనన మరణాలు లేవు. ఉద్యమా లన్నీ కలిసి ప్రజవి.

అది జీవద్వాహిని, అది భాద్రపదంలో గోదావరి. నిత్యమూ జీవనము నింపుకుంటూ సాగిపోవడమే!

వీరేశలింగం కేవలమూ ప్రజ కూడా కాడు.

వీరేశలింగం మానవత.

అప్రతిహత మైన ఆయన బల మంతా ఆ మానవతలోనే ఉంది. ప్రబుద్ధ మైన నవయుగ ప్రజాశక్తి అణువువంటి ఆ అర్భక మూర్తిలో ఇమిడి ఉండి, క్రుద్ధ గౌతమిలాగ, రుద్ర ప్రభంజనంలాగ ఆటంకా లన్ని టినీ తుడిచిపెట్టి సాగిపోయింది.

ఎందరో తెలియక అంటారూ—"వీరేశలింగం ఒక్కడూ నూరేళ్ల క్రితం సంఘ తిరస్కృతికీ, మృతికీ కూడా భయపడకుండా, ఒక్కడూ, ఒక్కడే, ఎలాగ నిలిచి జయించా డండీ? అసలు సంఘాని కంతకీ అడు గున ఉన్నవాడు స్కూలు మేస్టరు. వాళ్లలో ఒట్టడుగున ఉన్నవాడు తెలుగు పండితుడు. వీరేశలింగం అట్టి తెలుగు పండితుడు. అంత కలవాడు కాడు. వట్టి అర్భకుడు. ధనికుల్నీ, అధికారుల్నీ, బలశాలుల్నీ, పండితుల్నీ, అంద రినీ, సంఘా న్నంతనీ ఒక్కడూ ఎదిరించి ఎలాగ జయించా డండీ?" అని.

ఒక విధంగా చూ సే అది నిజం కాదు.

ఆయన్ని చుట్టుముట్టి పీడించిన వాళ్ళకే బలమూ తక్కువ, సంఖ్యాబలమూ తక్కువ అంటాను.

కన్నూ, నోరూ లేని ప్రజ తెలిసో తెలియకో వీరేశలింగం పక్షమే; ప్రజది ఎప్పుడూ భవిష్యత్కాలం. వీరేశలింగంది రాబోయే కాలం; ఆయన ప్రతి కష్టులవి, పాపం, పోయేకాలం; వాళ్ళది శైథిల్యం, ఆయనది చైతన్యం.

చివికి, బీటలువారి, కూలిపోతున్న మందిరాన్ని వాళ్లు "వదలము" అన్నారు. ఆయన వాళ్లనుకూడా పట్టుకుని కొత్త మందిరంలోనికి తీసుకు పోయి తీరతా నన్నాడు. కనుక వాళ్లపక్షమే బలహీన మైనది.

ఇక్కడ ఒక్క మాట:

ఆయనకు అలవి కాని కోపం ఉండే దనిపించేది అందరికీ. రాజు అవనీ, రెడ్డి అవనీ, ఎంత మేటి అయినా, ఆయన ఎదుట కుంచుకుపోయి, వెనక్కి

తగ్గి నిలబడేవాడు – సత్యం సమక్షాన అసత్యపు నీడలాగ, చీకటి మసక లాగ, ఎక్కడో ఏ కొంచెమో మాలిన్యం ఉన్న వ్యక్తిలాగ.

అయితే అది కోపం కాదంటాను నేను. ఆయనచేత అంత పని చేయించిందే కరుణ ఆయెను.

అది తొందర – impatience!

ఎంతో పని చేయవలసి ఉంది. ఏమో ఎన్నేళ్లు జీవిస్తాడో. ఎటు చూసినా సమాజం కుళ్లి ఉంది. Aegean stables లాగు. అంతులేని మాలిన్యం – త్వరగా త్వరగా, త్వరత్వరగా తాను ఎంతో పని చేసి మరీ వెళ్లిపోవాలి. ప్రతీ విషయమూ ప్రతీ ఒక్కనికీ, వాద ప్రతివాదాలు చేస్తూ నచ్చచెప్పుతూ పోతా నంటే ఎప్పటికి తేలడం? ఏం చేయడం? "చెయ్!" అంతే! "ఊఁ! నడు!" అంతే! తొందర! తొందర! తొందర!

భయంకర మైన, తీవ్రాతితీవ్ర మైన ఆ కార్యోత్సవంలో ఆయనకు మరణించడానికి తీరిక లేకపోయింది.

లేకపోతే ఆ దుర్బల శరీరం చిన్నతనంలోనే రాలిపోయి ఉండేది.

ఆయన జీవితానికి స్తిమితం లేదు. ఎప్పుడూ నడకే! వట్టి కదలిక కాదు – అది మనది.

వట్టి నడకకు గమ్యస్థానమూ ఉండదు; తీర్చిదిద్దిన మార్గమూ ఉండదు.

మన మందరమూ సాధారణంగా చూపు ఒకవైపూ, నడక మరియొక వైపూ ఉన్నట్టు ఉంటాం. కొందరం శరీరం గదిలోనూ, తల కిటికీలో నుంచి ముందుకు చాపినట్టూ ఉంటాం.

ఆ ద్రష్టకు, ఆ మహర్షికి లక్ష్యం, గమ్యస్థానం సుస్పష్టం. కనుక ఏ చేయో, కాలో, ముక్కో ముందుకు చాపి ఆ కాస్తా ప్రగతి అనుకోక,

మనిషి మనిషే పూర్తిగా ముందుకు నడవా లన్నాడు; సమాజం కూడా అలాగ నడవా లన్నాడు.

ఒక్కొక్కప్పుడు మాకు అనిపించేది – ఆ ప్రచండునిలో ఎక్కడయినా చల్లదనమూ, తీయదనమూ ఉన్నాయా అని!

అలాగ అనుకోవడం మా దృష్టిలోపం.

ఆయనలో తండ్రితనమూ, తల్లితనమూ రెండూ కూడా ఉండేవి.

అనాథనూ, అభాగినినీ రక్షించింది ఆ రెండో గుణమే!

ఆ రెండో గుణం రాజ్యలక్ష్మమ్మ – ఆయన భార్య. ఆమెకు ఆయనమీద అమోఘమైన ప్రభావ ముండేది. ఆమె కరస్పర్శ, మృదుభాషణ ఆయనను ఎంతగా సాంత్వన పరచేవో ఆయన చరిత్ర ఎరుగున్న వాళ్ళకు తెలుస్తుంది.

ఆమె చనిపోయాక మరీని! ఆయన అంతరంగంలోనే ఆమె నివాస మేర్పరచుకుంది. అప్పుడు స్త్రీ పురుష ప్రకృతులు రెండూ ఆయనలో కలిసిపోయి నిండిపోయాయి. భార్య పోయిన తర్వాత రవీంద్రుడు ఒక గేయంలో అదే అంటాడు.

తుది దినాల్లో ద్విజేంద్రలాల్ రాయ్ వ్రాసిన చంద్రగుప్త నాటకంలోని చాణక్యునివలె వీరేశలింగం కనిపిస్తాడు. ఎన్నడో పరమపదించిన భార్యను పదే పదే ఆహ్వానిస్తూ "నీ వే మంటావు? ఈ పని చెయ్యనా?" అని అడుగుతూ, అడుగడుగూ వేస్తూన్నట్లు!

ఇక్కడ ఒక్క మాట!

వీరేశలింగంగారిని గురించి స్మరించినప్పు డల్లా మా గురుదేవులు శ్రీ వేంకటరత్నం నాయుడుగార్ని గురించి కూడా చెప్పుకోకుండా ఉండలేను.

దాదాపు అరవై అయిదు సంవత్సరాల క్రితం ఒక ప్రముఖ ఉత్తర భారత పత్రిక వీ రిద్దరినీ కీర్తిస్తూ, "దక్షిణ భార తాకాశాన్ని నేడు రెండు

జ్యోతిర్మండలాలు ప్రకాశింపజేస్తూ ఏలుతున్నాయి. వీరు డైన వీరేశలింగం పంతులు, రుషి అయిన వేంకటరత్నం నాయుడు:" అని వ్రాసింది.

వీరేశలింగం వేంకటరత్నం కంటే ఎక్కువ నవ్యు డని అనిపిస్తుంది. వీరేశలింగమే ప్రబుద్ధ ప్రజ.

భవిష్యత్తు ఆయన :

వీరేశలింగ యుగం ఆయన చనిపోయాక ఇప్పు డిప్పుడే ప్రారంభ మయినట్టు తోస్తుంది.

వేంకటరత్నం దూర భవిష్యత్తులోనికి దృష్టి సారించినా, తన శిష్యులకు అంతవరకూ మార్గాన్ని పరచి చూపించినా, తాను మాత్రం యుగ ప్రాంగ ణాన నిలబడ్డ ఉపదేశకుడిలాగ దర్శన మిస్తాడు.

వీరేశలింగం పంచభూతాలకూ ప్రజలాగే సన్నిహితుడు. కోపాలూ, తాపాలూ, తిక్కలూ, అనురాగాలూ, ద్వేషాలూ – వీటితో జనం లాగే నేల పైనా, ధూళిలోనూ నిలిచి, ఒక్క నిమిషం విశ్రాంతి లేక, ఒక్క కనురెప్ప పాటు విశ్రాంతి నియ్యక, పదిమందిని తిడుతూ కొడుతూ, తాను పది పడుతూ, ఆందోళన పరుస్తూ, యుద్ధం చేస్తూ పోతూన్న ట్టుంటాడు.

వేంకటరత్నం ఉదాత్తుడులాగ, లంకే aristocrat లాగ దర్శన మిస్తాడు. ఎప్పుడూ సైనాయ్ పర్వత శిఖరం నుంచి, ఒక విశిష్ట సంస్కార అధిత్యక మీదనుంచి దిగన ట్టుంటాడు.

వీరేశలింగం పీడిత మానవ జగత్తులో నిలబడి, దానికి జరిగే అన్యా యాన్ని కోసి పారేసి, ఎదిరించిన వారిని తుడిచి పారేస్తా నంటాడు.

వేంకటరత్నం అనాథలకోసం, అభాగినులకోసం తల్లిలాగ తండ్రిలాగ అప్యాయంగా చేతులు చాపుతూ, ఓదారుస్తూ వంగుతున్న ట్టుంటాడు.

వీరేశలింగం, "ఛీ ! ఇది అన్యాయం ! జరగడానికి వీల్లేదు. చూస్తా నెవరు వస్తారో ! దీన్ని ఖండించి పారేస్తాను" అంటాడు.

వేంకటరత్నం. "అబ్బా ! పాపం ఈ దిక్కుమాలిన వాళ్లు ఎలా ఉన్నారో !" అనే ప్రేమమూర్తిలాగు ఉంటాడు !

వీరేశలింగం నడిపిన ఉద్యమాలలో ప్రధాన మైనది విధవా పునర్వివాహం. లోకంలో తీవ్ర మైన యుద్ధాలకు కారణం అయిం దది.

వేంకటరత్నం తలపెట్టిన ఉద్యమాలలో, సంస్థలలో ముఖ్య మైనవి కళా పంతుల సముద్ధరణం. అనాథ శరణాలయమూను.

ఇవి వద్దని ఎవడు పోరాడగలరు ?

ఒక్కొక్కప్పుడు వీరేశలింగం యొక్క దైవం దండధారీ, సమస్తీ అయిన లోక శాసకు డనిపిసుంది.

వేంకటరత్నం యొక్క దైవం తరిమి తరిమి రక్షించే వాత్సల్యమూర్తీ, పతితపావనుడూ అనిపిస్తాడు.

అయితే వీరేశలింగంలో ప్రేమభక్తులు లే వని కాదు. వేంకటరత్నంలో కార్యతత్పరత లే చనీ కాదు.

కాని వీరేశలింగం జీవితచరిత్ర అవిశ్రాంత కావ్యోత్సవం లాగ ఉం టుంది – భారతంలో ఒకి పీర మానవుని కథలాగ సామాన్య హృదయా లను ఆవేశపరచే తీవ్రసంఘటనలతో నిండి !

వేంకటరత్నం జీవితచరిత్ర భాగవతంలోని భక్తుని గాథలా ఉంటుంది – స్థూలంగా కనబడని. పట్టుకు దొరకని లక్ష్యాలూ, అనేక ఆవేశాలూ, వేద నలూ – అలాటి వాటితో నిండి !

వీరేశలింగం కథ నాటక రచనకూ. చలనచిత్ర నిర్మాణానికీ ఇట్టే లొంగుతుంది.

వేంకటరత్నం కథ అలా లొంగదు; అది భావకావ్యం, కీర్తన; మొదటిది ఎక్కువ జనరంజకం – ముఖ్యంగా ఈ నేటి కాలంలో.

వీరేశలింగం నవమానవుడు. రాగల కాలంలో మానవుడు బుద్ధీ, హృదయమూ రెంటినీ బాగా ఉపయోగించుకోవాలి. ఇది విజ్ఞానయుగం. మానవుడు పశువు కాడు. ఏ విషయాన్నైనా స్వంతంగా తన మెదడును ఉపయోగించి పరిశీలించి, తూచి సత్యం తేల్చుకోవాలి. మరి కవి అన్నట్టు, ప్రాక్పశ్చిమాలు రెండూ ఒకే ఒక హృదయం యొక్క రెండు స్పందా లయిపోయినపుడు మానవు లందరూ ఒకే ఒక ప్రేమ పాశంతో కట్టబడి, ఒకే ఒక విశ్వ విశాల సంసారంలో ఇమిడి శాంతంగా సుఖంగా బ్రతకాలి; భగవంతుడికి రెండు కళ్లున్నాయి అంటాయి పురాణాలు – సూర్యుడూ, చంద్రుడూ. మానవునకూ ఉన్నవాడికి, రెండు కళ్లే—బుద్ధీ, హృదయం (reason, love). ఈ రెంటిలో దేనికి లోపం వచ్చినా నవమానవుడు ఈ జగత్తులో మనలే దన్నది వీరేశలింగం సందేశం. ఆయనది మానవతా ధర్మం;

మెథొడిస్ట్ (Methodist) మత ప్రచారకు డైన John Wesley ని గూర్చి ఒక కథ ఉంది. ఆయనకు ఒకసారి ఒక vision – ఒక సాక్షాత్కారం కలిగింది. Wesley స్వర్గద్వారం దగ్గర ప్రవేశం కోసం నిలబడ్డాడు. "నీ వెవరవు?" అని ద్వారపాలకుడు ప్రశ్నించాడు. "I am a Wesleyan – నేను వెస్లీ ధర్మ సంప్రదాయానికి చెందినవాణ్ణి" అని జవాబిచ్చాడు. "మేము వా ళ్లెవరో వినలేదు" అన్నాడు ద్వారపాలకుడు. "పోనీ ఇక్కడ ప్రొటెస్టెంట్ మతం వాళ్లు ఉన్నారా?" అని ప్రశ్నించాడు వెస్లీ. పుళ్లీ "ఊహూ" అన్నాడు ద్వారపాలకుడు. "క్రైస్తవులా?" "ఒక్కరూ లేరు;" "మ రెవ్వ రున్నారు?" "విశ్వాసులు – believers" అన్నాడు ద్వారపాలకుడు.

స్వర్గద్వారం అంటూ ఉంటే, అక్కడ ఓ ద్వారపాలకుడంటూ ఉంటే, మొదటనే "మానవుణ్ణి" అని చెప్పి వీరేశలింగం నమ్మకంగా లోపలికి వెళ్ళిపోయి ఉంటాడు.

"భారతేర్ మహామానవేర్ సాగర తీరే" అంటాడు, కవిరాజరాజు రవీంద్రుడు. మానవ మహాసాగరం అంటాడు; ఎంత నిజం ఈ మాట!....

సుఖాలూ, దుఃఖాలూ, మహాకల్లోలాలూ, ఆందోళనలూ, ఆలింగనాలూ, అలజడులూ, ప్రళయ యుద్ధాలూ,మారణహోమాలూ, పండుగలూ, పబ్బాలూ, వేడుకలూ, ఆశలూ, ఆనందాలూ— వీటితో ఈ మానవ మహాసాగర మధ్యాన నవయు గారంభవేళ నిలబడిన నవమానవుడు, universal man, తెలుగునాట వీరేశలింగం.

అలాగ నిలబడి ఇలాగ అన్నట్లు నాకు తోస్తుంది:

"ఓ మానవుడా! నవమానవుడా! నీది—అంటే నీ బిడ్డలు, నాది ధర్మ సమరం సుమా! నీవు సాధించే విజయం సామాన్య మైంది కాదు. నిన్ను నీచపరచేది కాదు ఆ విజయం. దానివల్ల లభించే ప్రభావం నీ హస్తాల్లోనే గుప్తపరుచుకోలేవు. నీది ధర్మసమర మయితే నీ అస్త్రాలు కూడా ధర్మ యోధునికి ఉచిత మైనవే! నీకు ఆగ్రహం పనికిరాదు. ద్వేషం పనికిరాదు. నైచ్యం, అల్పత్వం, అసత్యం, పిరికితనం నీ దగ్గరకు రానివ్వకూడదు. ఉషస్సులో తొంగిచూసే ఆశ నీది. ప్రభాతంలో భాసించే విశ్వాసం నీది.

కనుక, ముందు ముందు ఆశకు కూడా అతీత మైన కష్టాలను పడడం, రాతిరి కన్నా, మృత్యువు కన్నా నల్ల నైన అవమానాలను క్షమించడం, ఎదిరించడానికి కూడా వీలులేనట్లు కనబడే శక్తుల్ని

తృణీకరించడం,

ప్రేమించడం,

ఓర్మితో సహించడం,

శైథిల్యంనుండీ, జరనుండీ నవజీవనాన్ని సృజించుకోవడం,

చలించక పోవడం,

నీ మార్గంనుండి తప్పుకొనకపోవడం,

నీరస పశ్చాత్తాపంతో క్రుంగకపోవడం,

ఇవన్నీ, అన్నీ నాలాగే నీవూ జ్ఞాపకం ఉంచుకోవాలి సుమా!'' అని!

వీరేశలింగాన్ని ''దేవత'' అన్నాడు రామలింగారెడ్డి.

ఆ మహా మానవసాగర తీరాన నేను ఒకసారి నిలబడి ఆ ''దేవత''కూ, నరదేవతల కందరకూ నమస్కరిస్తున్నాను.

1971 జూలై 'ఆంధ్రప్రదేశ్' - వీరేశలింగం జన్మదిన సంస్మరణ సంచిక నుంచి.

ఆంధ్రదేశము :

రాజ్యలక్ష్మమ్మగారు

నవీ నాంధ్రదేశ చరిత్ర ఎవరేనా వ్రాస్తే దానిని పంతులుగారికి అంకితం చేసి తీరాలి – అని మా తమ్ముడు అన్నాడు.

అలాగ కాదు; రాజ్యలక్ష్మమ్మగారికే కృతి ఇయ్యాలి, సూక్ష్మ దర్శి వైన నీ వలా గనడం భావ్యంగా లేదు – అన్నాను నేను.

మన దేశంలో స్త్రీలు మూడు రకాలుగా ఉన్నారు : విద్యావివేకాలు లేకో, పాశ్చాత్య సంఘ జీవితంలోని పైపూతలే పట్టించుకుని ఉత్తమ సంస్కారం అలవరచుకోలేని వెకలితనం వల్లనో కార్యరంగంలో దూకే మగవాళ్ళ కాళ్ళకి కన్నెతాడులాగ అడ్డుపడే జాతి ఒకటి: "ఆది జనకుండు, పిమ్మట నధిపు, డవల తనయుడును శాసకుల్ గదా వనిత" కని తన పని నోరు మూసుకుని కాళ్లీడ్చుకుంటూ కూడా కూడా రావడమే అనే రకం రెండోది. "నేను అవనత మస్తకనై అనుసరించేదాన్ని కాను; తోడు నీడగా ప్రయాణం చేసే దాన్ని; అంతే కాదు, నవకవి వ్రాసినట్లు, 'తోవ చదునుచేసేదాన్ని'; అసలు ఈ అనంతప్రస్థానం జైత్రయాత్రగా జేగీయమానంగా సాగించ డానికి పటిమా, ప్రతిభా ఇచ్చేదాన్ని: వాకిలీ వాడా, సమాజమూ జాతీ సంస్కరించేదాన్ని" అని సరస్వతై, లక్ష్మియై, సతియై విజ్ఞాన ప్రేమైశ్వర్య సంగమస్థానము, ప్రయాగ ప్రతిగృహమూ అనే శ్రేణి మూడోది.

రాజ్యలక్ష్మమ్మగారు మూడవ రకంలో వారు; రాజ్యలక్ష్మమ్మగారు బ్రాహ్మ మహిళ. మానవ సమాజంలో యథార్థ 'బ్రాహ్మ' మూడవ తరగతికే ఎలాగ చెందాలో, అతని జీవితంలో యథార్థ బ్రాహ్మమహిళ అలాగే విలవాలి. పంతులుగారి 'తోవ చదునుచేసిన' దా తల్లి. పంతులుగారి దుర్వార కర్మ వాహినికి కాలువలు తవ్వి గట్లను కట్టిన దా వీరనారి. కనుక నవీ నాంధ్ర చరిత్ర ఆమెకే అంకితం చెయ్యా లన్నాను.

పోనీ: ఇంకోలాగ అను. వాగర్థాలని విడదీయలేనట్లు వారినీ విడదీయ లేము కనుక, ఇద్దరికీ కృతి ఇస్తా నను. నిజానికి ఏ మహాపురుషుడు ఉత్తమ మహిళా ప్రభావం లేకుండా లోకోత్తరకార్యాలు చేశా డయ్యా:

ఏభై సంవత్సరాల క్రితం స్థూల దృగావరణం దాటి జ్యోతిర్లోకంలో విలీన మైన ఆత్మేశ్వరిని అంతరాంత రాకాశంలో ధ్రువతారలాగ ప్రతిష్ఠించు కుని, మొదట వియోగ క్లేశంగా ఉన్న అనుభవాన్ని వివేకంవల్లా, విజ్ఞాన పటిమవల్లా విమల ప్రేమానందముగా చేసుకుని, తలపుతలపునా, పలుకు పలుకునా. అడుగడుగునా ఆ నక్షత్రమండలాన్ని పలుకరిస్తూ వస్తూ ఉన్న తపస్వీ, మహర్షీ కనుక మన 'గురుదేవు' డైన బాబయ్యగారు అర్ధశతాబ్ది నుంచి ఆంధ్రయువ మనస్సునకు ఆశయ పక్షాలు తొడుగుతున్నారు; ఆంధ్ర యువ హృదయాన్ని కరిగించి కాల్వలుగా జేస్తున్నారు. రవీంద్రుడు 'Lover's Gift and Crossing' లో అంటాడు: 'ఇప్పుడు నీవు వెళ్లిపోయి నాలోనికి వచ్చావు: ఇప్పుడు నేను సమగ్ర సుందరంగా అయాను' అని:

ద్విజేంద్రలాల్ రాయల 'చంద్రగుప్త' నాటకంలో చాణక్యదేవుడు పూను కున్న కార్యం అసామాన్య మైనది. శిథిలమై, నీరసమై, స్వార్థపంకిల మైన నందసామ్రాజ్యాన్ని విధ్వంసం చేసి, జీవవంతమై, స్వచ్ఛసుందరమై మానవ శ్రేయోదాయక మైన భారతలోకం నిర్మించాలి. అప్పుడు ఆయన

సప్తమరుత్తులూ జెబ్బా జెబ్బా కలిపినట్టు, త్రేతాగ్నులూ కౌగిలించుకున్నట్టు, ద్వాదశార్కులూ పంక్తి తీర్చినట్టు అనివార్యశక్తితో సాక్షాత్కరిస్తాడు. ఆ చాణక్యదేవుడు భావించే ముందు, పలికే ముందు, పాలించే ముందు ఇట్టే ఒక్కసారి కన్నుమూసో, అట్టే ఒక్కసారి కన్ను పూర్తిగా తెరిచో "నీ వే మంటావు?" అని ఎవరినో అడిగి, ఆత్మేశ్వరి ఆలోచనకోసమో, ఆజ్ఞ కోసమో విరీక్షిస్తుంటాడు. ఆ ఆలోచనా, ఆ ఆజ్ఞా లేనిదే అతడు నంద సామ్రాజ్య విధ్వంసి అయి ఉండును కాని, భారత సామ్రాజ్య ప్రతిష్ఠాప నాచార్యుడు కాలేడు.

పంతులుగారు తన జీవితంలో మొదటి అరవై రెండు ఏళ్ళూ ఒకలాగా, తర్వాత పది సంవత్సరాలూ ఒకలాగా – అలాగే నడిపింపబడ్డారు.

అసలు పంతులుగారికీ, ప్రచండ చాణక్యునికీ కొంత పోలిక ఉంది కదూ? నందరాజ్యం అంటే అంధకారం, అన్యాయం అనుకో – అనాచారం, అవివేకం అనుకో.

ఉత్తమ సతీ సహవాసం అచేతన పదార్థాన్ని చైతన్యవంతం చెయ్యడమే కాక, పశువుని మానవుణ్ణి చేస్తుంది. మానవుని దివ్యుణ్ణి చేస్తుంది. ఇంకో చిత్రం – మానవత్వానికి విలక్షణమైన, అతీతమైన ఒక ప్రబల (superhuman) శక్తిగా మారిపోయిన వాణ్ణి మళ్ళీ మధుర కాంతమైన మానవలోకం లోకి దింపుతుంది. "ఎప్పుడైన చిత్తోద్రేకము కలిగినప్పుడు నే నెవ్వరిని లక్ష్యము చేయక ముందు విచారింపక తొందరపడి మత్తగజమువలె సంచరింప జూచినప్పుడు తానంకుశమయి నన్ను మరలించి యుక్త సమయమున శాంతవాక్య సుధారసముతో నన్నప్పుడు మరల స్వస్థచిత్తుని చేయుచుండును." అందుకనే పంతులుగారి కార్యాల్లో మేధా, హృదయమూ, తీక్ష్ణతా, తీయదనమూ కూడా కనిపిస్తాయి.

స్త్రీని గూర్చి గీతం వ్రాస్తూ శాంతినికేతనంలో నుంచి పాశ్చాత్యలోకం దాకా కవి ఏ సందేశం విసిరాడో విన్నావా?

"సాయం సంధ్య శర్వరిగా కరిగిపోతూంది. సమర రంగంలో మహా యోధులు క్షతగాత్రులై ధూళి శయ్యమీద ఒరిగిపోయారు. రావమ్మా తల్లీ! నీ మధుర హస్తంతో ప్రతివీరుని చిన్నగాత్రానికీ శిరాంజనం అవలేపనము చెయ్యి; మర్త్యుణ్ణి అమర్త్యుణ్ణిగా మార్చు."

ప్రతి పురుషుని దైనందిన చర్యలో జీవితం పొడుగునా స్త్రీ చేసే పని నిరూపిస్తుంది ఈ గీతం. అంతే కాదు. "పాశ్చాత్య లోకం పురుషుడు; ప్రాచి స్త్రీ. అది పౌరుషాలు లొనర్చే లౌకిక సంగ్రామం; ఇది క్షమా తపస్సులు పరచే పరమపథం. అది పగలు; ఇది రాత్రి. పగలు పైకి చూస్తాం; రాత్రి లోప లున్నదాన్నే అన్వయించుకుంటాం. సర్వమానవ కల్యాణానికి రెండూ ఎలాగ అవసరమో, ప్రతి గృహ వికాసానికీ, సమాజ శ్రేయానికీ, దేశకల్యాణానికీ స్త్రీ పురుషుల సంపూర్ణ సమ్మేళనం అవసరం" అని ఈ గేయం ప్రబోధిస్తుంది.

అందుకనే పఁతులుగా రనగానే సింహంలాగ గర్జిస్తూ, ప్రభంజనంలాగ తరుముతూ, చక్రంలాగ ఱఁడింఁచే ఒక శక్తి ఒక్కటే జ్ఞాపకం రాక, స్మితాననంతో, స్వీన్న నేత్రాలతో, అభయహస్తంతో, అమృతభాండంతో ఆ మాతృమూర్తి తానే ముందుకు వచ్చి సాక్షాత్కరిస్తుంది.

నేను కవి ననుకో! ఏ మహా ముహూర్తమందో నా అంతర చక్షువు వికసించి వికసించి ఏ పారలౌకిక దృశ్యమో చూస్తుంది; నేను మీ లోకం దాటి పైకి ఎగిరిపోతాను; షెల్లీ భరతపక్షిలాగ. 'Cloud of fire' అయిపోతాను; ఇంక ఏ మహాకావ్యమో సృష్టిస్తాను. వెనకాలే నా వృద్ధజనని, నా జీవి తేశ్వరి పొంచి ఉండి ఎన్నిసార్లు నా స్వర్ణ స్వప్నాలను చిన్న శకలాలుగా జేసి నన్ను ధూళిలోకి లాగలేదు! నేను జాతీయ యోధుడ ననుకో! పొంగి

పోతూన్న విశాల వక్షం కింద నాట్యం జేస్తూన్న నా హృదయంలో జన్మ భూమిని ప్రతిష్ఠించుకుని కారాగారాలకీ, కఠిన శాసనాలకీ ఆవల వెలిగే స్వాతంత్ర్య తేజస్సు నందుకుందా మని బ్రతుకారా చాచే నా చేతుల్ని ఎన్ని సారులు నా యింటిలోని అబలా విలాపాలు కిందకి ఈడ్వలేదు? 'సర్వ మానవ సౌభ్రాత్రం' అంటాను. జాతి కుడ్యాల్లో ఊపిరాడదు నాకు. ఆర్ద్రుల తపస్సు అంటాను. అణా పైసల్లో పడి అడగిపోతాను. అంతకూ కారణం నా యిల్లు! మన సమాజము నీరసంగా ఉంటే దానికి గృహదేవత అయిన స్త్రీ కారణం! నేను విద్యా బుద్ధుల్లో కొంత పెరిగితే నేమి? ఎగురబోతే నేమి? ఎప్పటి కప్పుడు రెక్కలు కత్తిరించే వారు ప్రక్క ప్రక్కనే ఉంటే!

ఈ స్థితి కంతకీ కారణం నేను. నా కుమారుడి మనోవికాసం కోసం. నా మనోవికాసం కోసం నేను పడే శ్రమలో వేయోవంతు నా భార్య సంస్కారానికి వినియోగించడం లేదు. నా భార్య నంస్కారిణి కావడంలేదు కనుక నేనూ ఏమీ చెయ్యలేను; నేను ఎంత తయారు చేసినా నా కుమారుడూ నా ఆశయానికి దూరు డౌతాడు. కనుక నాకేసీ, నేను చేసిన అల్పాల్ప కృషికేసీ, నేను చేయవలసిన కార్య ప్రణాళికకేసీ, నా యింటికేసీ ఒక్కసారి చూసి, పంతులుగారికేసీ, ఆ మహాపురుషుని లోకోత్తర జీవితంకేసీ, ఆయన చెయ్యకుండా వదిలిన పనులకేసీ, ఆయన యింటికేసీ ఒకసారి చూస్తే, దానిలో నిత్య జాగ్రన్నేత్రాలతో ఆయన్ని కనిపెడుతూ ఉన్న రాజ్యలక్ష్మమ్మ గారి ముందు మనము ఘోషిడాకా శిరస్సులు వంచుతాము. ఆధుని కాంధ్ర కుటుంబాలు ఆదిమ దంపతులుగా స్వీకరింపవలసిన వా రిద్దరికీ పదే పదే ప్రణమిల్లుతాము.

ఇంకొక విషయం: నాకు తెలుసును బ్రాహ్మధర్మం ద్వారా లభించిన ఆశయము సమగ్ర మైన దని. సమస్త మానవ సమస్యలూ సముచితంగా పరి

ష్కారం అవడానికి నేటి మానవకోటికి దానికంటె వేరే సాధనం లేదనీ నాకు తెలుసును. పరమేశ్వర ప్రసాదంగా నాకు దొరికిన ఈ వరాన్ని ప్రతి నిమిషమూ ఉపయోగించకుండా ఉంటే, నేను అహల్య లాగ శిలగా అయి పోవడమే కాక, మాన వాభ్యుదయానికి తోడు పడకపోవడంవల్ల అడ్డుగానే ఏస్తున్నా నని కూడా నాకు తెలుసు। ఇంత బాధ్యతాయుత మైన మహాసత్యాన్ని నా మనస్సులో ఎందుకు వెలిగించాడో కదా। నా ఒక్కనిలో ఇంత మహా కార్యం మూగై, ప్రమోదై స్తంభించుకునిపోతే ఎలాగ? ఈ వేదనే పంతులు గారి జీవితా న్నంతా ఊపిరాడని, ఎవరికీ ఊపి రాడనీయని కాఠోత్సవంగా చేసేసింది. ఎందకో పంతులుగారికి కోపం ఎక్కు వంటారు. నేను కా దంటాను. అది కోపం కాదు; ''అయ్యయ్యో నేను చెయ్యవలసిన పని ఎంత ఉందీ, ఎంత! ఎప్పుడు పిలుపు వస్తుందో। ఒక్కొక్కనికీ బోధించి, నమ్మించి, బుజ్జగించి కార్యరంగంలోకి లాగుతూ ఉంటే ఏ ఒక్క పని అయినా ఎప్పటి కౌను? ఊరికే గర్జించి లేవగొట్టి వీపుమీద తట్టి పనికి పురమాయించడమే చేయాలి. అంతే!'' అనే తొందర (impatience) అది. ఇలాంటి ప్రళయ జీవితాన్ని అనుసరించడమే కష్టం. కూడా కూడా రావడం కిష్టతరం! నడి పించారు రాజ్యలక్ష్మమ్మగారు నెమ్మది నెమ్మదిగా! కాని ఇంకోటి కూడా జ్ఞాపకం ఉంచుకోవాలి. తన్ను నడిపించే టంత శక్తిగలదానినిగా మొదట ఆమెను తయారుచేసుకున్నారు కూడా పంతులుగారు! ఆయన మాట లివి:

''పదుమూడవయేట కాపురమునకు వచ్చినది మొదలుకొని యంతకంతకు మా యిరువురకును పరస్పరానురాగము ప్రబలి యిద్దఱము నేకాభిప్రాయము లము కాజొచ్చితిమి. ఆమెకు నాయందుఁ గుదిరిన యవ్యాజ ప్రేమనుబట్టి నాయెడల పరమ విశ్వాసము కలదయి నా తోడిదె లోకమని మంచి కయినను చెడ్డ కయినను సర్వమునందు నన్ననుసరించుచు భ్రమరకీట న్యాయమున నామె నావలె మాటిపోయెను. అంచేత నే నే సాహసకార్యమునం చడుగు పెట్టినను తాను వెనుకంజ వేయక, నన్ను వెనక కీడ్వక తోడునీడ యై

యుండి ప్రోత్సాహవాక్యములు పలుకుచు నన్ను ముందుకు నడిపించు చుండెను ''

ఈ వాక్యాలు చదివాక అయినా కేవలము స్త్రీమీద నేరారోపణము నేను ఎలాగ చెయ్యగలను? నా దోషమే ద్విగుణీకృత మైపోతూంటే?

రాజ్యలక్ష్మమ్మగారి జీవితంలోని కొన్ని గాథలు: వీటిని చదివేముందు కొన్ని సంగతులు మాత్రం జ్ఞాపకం ఉంచుకోవాలి. అప్పుడు ఆంధ్రలోకంలో ఇంకా అంధయుగమే నసీ; ఒక వైపున శ్రావణమేఘమూ, అమావాస్యరాత్రీ కలిపి ఆగ్రహిస్తూ ఆక్రోశిస్తూ ఉన్నట్టు ద్వేషం, కౌటిల్యం, మౌఢ్యం, క్రౌర్యం లాంటి సైనికుల్తో అంధకారం చుట్టూ ముంచెత్తుతూ ఉంటే తానూ తనతో ఏ ఒకరిద్దరూనో పంతులుగారనీ; ఇప్పటికీ ఆ సైన్యంలో ఏ సామాన్య యోధుడొక్కడితోనైనా మనము పూర్తిగా యుద్ధం చెయ్యలేక పోతున్నామనీ; అప్పుడు ఆ సంగ్రామ మధ్యాన్ని ఒక్కసారీ భర్తను వదలకుండా క్షమాహృదయమైన హృదయంతో ఉల్లాసంగా రాజ్యలక్ష్మమ్మగారనీ:

వితంతు వివాహ ప్రయత్నాలు ప్రారంభించిన రోజు లవి ఆంధ్రదేశమంతా – ముఖ్యంగా రాజమహేంద్రవరము – అట్టుడికి పోతూంది. బంధువులూ, మిత్రులూ, పూర్వాచార పరాయణులూ, అశేషజనమూ వద్దన్నారు; జాగ్రత్తన్నారు. ఆయన హిమాలయం: కదపలేక పోయారు. రాజ్యలక్ష్మమ్మగారిని పట్టుకున్నారు. లాభము లేకపోయింది. ఆమెను ప్రేమించి పెంచిన మేనమామా, బంధువులూ వచ్చారు; చుట్టుముట్టారు, గొల్లుమన్నారు; మరణాన్ని మించిన ఘోరవిపత్తు వచ్చిందన్నారు; బెదిరించారు; ఏడిచారు. ఆమె మేరువు; చలించలేదు. అప్పుడామె అన్నమాటల్లో ఎంత గొప్పతనం ఉందో గ్రహించండి. భర్తతోడిదే లోకం అనీ, ఆయన్ని వదిలితే నేను ఏమి అయిపోనసీ, మంచి అయినా చెడ్డఅయినా తప్పదనీ అని

ఊరుకో లేదు. "ఆయన పూనుకున్న పని చాలా గొప్పది. నేను వద్దని చెప్పడ మేమిటీ? ఎన్ని కష్టాలు వచ్చినా సహాయం చేస్తా నసలు." ఎప్పుడూ పంతులుగారి కళ్ళు బహిరంగంగా చెమ్మగిల్లినట్లు ఎవ్వరూ చెప్పలేదు. ఆ రోజున ఆయన కపోలాలు తడిసి ఉంటాయి. భాద్రపదమునాటి వేయి గౌతములు లోపలకు పొర్లుకుని వస్తే ఆయన హృదయం మాతృహృదయంలాగ ఆంధ్రదేశ మంత విశాలమై ఉంటుంది.

ఆ రోజుల్లో ధూమశకటాలు లేవు. రాజమహేంద్రవరానికి రాకపోకలకు గంజాం జిల్లా కాశ్మీర మంత దూరంగా ఉండేది. ఆప్పుడు అంధ దినాలు కూడా కనుక ఎంత సాహసవంతురా లయిన స్త్రీ కయినా గడపదాటడమే కాశీ యాత్ర. రాజమహేంద్రవరం రేగిపోతూంది; ఆంధ్రదేశ మంతా అంటు కుంది. స్త్రీ పునర్వివాహోత్సవాలు ప్రారంభ మయాయి. ఎక్కడి గంజాం? ఎక్కడి ఆస్కా? ఇద్దరు బ్రాహ్మణ బాల వితంతువులు అక్కడనుంచి బయలుదేరారు – గౌతమీ తీరానికి! కాలినడక! చేతిలో కాసయినా లేదు! బంధు మిత్రుల్ని ఎలాగ ఏమిరించారో తెలియదు – విజయనగరం చేరారు. ఒక ఆమె మనస్సు చెదరిపోయింది; పాపం, ఆ తల్లి ఇంక కదలలేక పోయింది. రెండో బాలిక సామాన్యురాలు కాదు. వెనక్కి పూర్వ జీవితం కేపి చూసుకుంది. తన చేతి రాగి పళ్ళెలలో బంగారం అమ్మింది. మళ్ళీ ప్రయాణం – కాలినడకనూ, మోటుబండ్లమీదాను! ఆమె వారణాశి దక్షిణాన్ని ఉంది. పతిత త్రాణానికి బద్ధకంకణు డైన ఆ మహావీరేశ్వరు డెక్కడుంటే అక్కడికే ప్రణయ యాత్రికుల ప్రస్థానం!

ఇంక ఇక్కడ రాజమహేంద్రవరంలో పంతులుగారు కట్టించిన పుర మందిరం తెరుస్తా రా రోజున. రాజ్యలక్ష్మమ్మగారు మిత్రురాండ్రతో మహోత్సాహంతో చూడ్డానికి బయలుదేరుతున్నారు. మండు వేసంగి. మధ్యాహ్నం రెండు గంటలు. మూసి మూసి, చివికి, చిరిగిపోయిన కట్టుబట్టతో, మార్గా

యాసమువల్ల బడలి సడలి కుషి్కంచి పెంధూళితో వికృతంగా ఉన్న శరీరంతో ఆ యువతి గుమ్మానికి ఎదుటగా తోచింది. విశ్వ శైశవావస్థలో ఈ మానవ స్వరూపాన అవతరించి యుగయుగాల మహోవరణాలు దాటి వస్తూ, యాత్రాపథమునమీద పత నాభ్యుదయాలతో పడుతూ లేస్తూ, లోకశాంతికీ, పావిత్ర్యానికీ, ఆనందానికీ, ముక్తికీ వేంచేసిన ప్రణయభిక్షుకి, ప్రణయదాత్రి, ఉత్తమసతి, ఉజ్జ్వల మాతృమూర్తి నిండారా తెరచుకున్న తన హృదయాన్ని తన కళ్ళల్లో మెరపిస్తూ బ్రతుకంతా చాచి తన యింటి మొగసాల సాక్షాత్కరించినప్పుడు మాతృశ్రీ రాజ్యలక్ష్మమ్మగారి మనోవీథిలో ఏ శరజ్జ్యోత్స్న అలముకొని పోయిందో, హృదయావకాశంలో ఏ పాలకడలి పరవళ్ళు త్రొక్కిందో!

ఆమె పురమందిర ప్రయాణం మానుకున్నారు. ఆమెను స్నానం చేయించడం, సుందర వస్త్రములు ధరింపచేయడం, పొరుగింటికి పోయి అన్నము మున్నగునవి తెచ్చి భుజింపచేయడం – ఇంతలో పంతులుగారు వస్తున్నారు! నవ్వు మొగంతో వీధిగుమ్మంవద్ద నిలబడి, ఆయనకి దగ్గరగా వచ్చి, మీ కొక శుభవార్త చెప్తా నని లోపలికి ఆయన్ని తీసుకుని వెళ్ళి ఆ ప్రేమాతిథిని చూపించారట! ఆయన హృదయం అప్పుడు ఏమయిందో!

అనంతరం ఆంధ్రప్రముఖులు, భక్తుడు, కవి ఆదిపూడి సోమనాథరావుగారి జీవితేశ్వరి ఆ బాలిక! సుప్రసిద్ధ విదుషీమణి తెలికిచెర్ల వసుంధరాదేవిగారి జనయిత్రి.

పాపం! అక్కడ విజయనగరంలో ఆగిపోయిన భీరురాలు ఏమయిందో! అబ్బ! శ్రీచరణ స్పర్శలేని ఎందరు శిలాజీవులు! ఎక్కడెక్కడ ఉండిపోయారో! వారినికూడా వదిలెయ్యలేదు రాజ్యలక్ష్మమ్మగారి అనురాగము. ఇంద్రియ దౌర్బల్యము చేతనో, వంచకుల మోసము చేతనో అంధకూపంలో పడి

పోయిన అనాథ యువతులకోసం 'పతిత యువతీ రక్షణశాల' అని వారి యింటి కెదురుగా పెట్టి, వారికి చదువు చెప్పడం, వారి చీకటి హృదయాల్లో అమృత కాంతులు పోయడం, వారిని మానవతులుగా చేసి రాజమార్గమ్మీద వదలడం! ఆమె జీవితకాలంలో అయిదుగుర్ని అలా రక్షించారట! ముగ్గురికి తర్వాత వివాహాలు అయాయి! తక్కిన యిద్దరికీ శిశు హత్యా దోషము రాకుండా కాపాడారట! గర్భవతియై వచ్చిన యొక బ్రాహ్మణ వితంతువుని ప్రసవ వైద్యశాలకి పంపారట! ఆమె అక్కడ తాను గన్న పిల్లను వైద్యశాలాధికారుల కిచ్చి వెళ్ళిపోబోతూంటే, రాజ్యలక్ష్మమ్మగారు పరుగెత్తుకుని వెళ్ళి, తల్లినీ పిల్లనూ తెచ్చి తనయింట ఉంచి పోషిస్తున్నారు-ఇంతలో తన బిడ్డను వారి యింట వచలి తన వృద్ధమాత తనకోసం వస్తే ఆమెతో గంజాం మండలంలో తన బంధువులతో చేరా లని ఆ బ్రాహ్మణి వెళ్ళిపోయింది. తనలో జనని ప్రేమ ఉంటే ఆ వృద్ధురాలు ఎలాగ తీసుకుని వెళ్ళిందో! రాజ్యలక్ష్మమ్మగారికి ఆ బిడ్డ కన్నకూతు రయింది. ప్రేమావతి అని పేరు పెట్టుకున్నారట! ప్రేమావతి మన కందరకూ చెల్లెలు!

తమో వాహినిలో పడి మునిగిపోలేక గట్టుమీద ఒక పాదము పెట్టి, చలిత హస్తాన్ని అవలంబనకోసం చాచే వారిని పంతులుగారి అభయహస్తం పైకి లాగి ఆనంద జగత్తులో పడేసింది. వైతరణీ వాహినిలో మునిగిపోతున్నా వేద నన్న మాటలేక పాతాళ గర్భంలోకి పరిగెత్తుతూన్న వారిని రెండు దయా కరాల్లోనూ పట్టుకుని మాతృ వక్షానికి అదుముకుని, తీరాన్ని నిలబెట్టి దూరాన్ని ఉన్న స్వర్గాంగణాన్ని తమ నిర్వ్యాక్ర దృఢహస్తం చాపి చూపెట్టిన వారు రాజ్యలక్ష్మమ్మగారు!

ఇంకో గాథ: భార్యాభర్త లిద్దరూ పురమందిరం ప్రక్కనుంచి వైద్యశాలవైపు వెడుతున్నారు. దారిలో ఒక పెద్దగుంపు. దాని మధ్య ఇద్దరు వృద్ధస్త్రీలు చేయి పట్టుకొని తీసుకొస్తూంటే బీటలు బీటలుగా చిదికిపోయిన

కపోలముతో, రక్తార్ద్రంగా ఉన్న వస్త్రంతో, విగత కేశ పాశముతో ఒక వేశ్యాంగన ఉంది. బండీలో నుంచి "ఏమి టిదిఁ" అన్నారు రాజ్యలక్ష్మమ్మ గారు. "అలాగ అవవలసిందే: జారత్వ శంకచేత దొడ బద్దలు కొట్టాడు పిటుడు: టోగంది. వ్యభిచారిణీ" అన్నాడు ప్రక్కనే నిలబడిన ఒక పెద్ద మనిషి: రాజ్యలక్ష్మమ్మగారు వెంటనే భర్తకేసి తిరిగారు. "ఏమండీ: వీరి స్థితిని బాగుచెయ్యడానికి మన మేదైనా చెయ్యాలండీ!"అన్నారు. "వృద్ధత్వం చేత అశక్తులమయ్యాం: మన మిప్పుడు ఏం చెయ్యగలం!" అని ఆ ఏక పీరుడే అప్పుడు అంటే, "ఎందుకండీ సందేహం? అధైర్యపడకూడదు. చేయించే దేవుడు సహాయుంగా ఉన్నాడు. వెనక తీయగూడదు" అన్నారు ఆమె:

టోగంవా ళ్ళట: వ్యభిచారిణి లట: నా ఒళ్ళు కంప మెత్తుతుంది. నే నా మాట అనలేను. అంటే నా గుండె దహించుకుపోతుంది. ఉత్తమ సంస్కారంతో, వేనవేల సంవత్సరాల విజ్ఞానంతో. పరమ పవిత్ర మైన ఆర్యభూమిలో, హింసా సంఘంలో ఆ "సంస్థ" అలా నిలబెట్టడంచేత నేనే ఆ కపోలాన్ని చిదుకకొట్టినవాణ్ణి! నేను అలాగ అనగలనా? తలపులో, పలుకులో, పనిలో గడియ గడియకూ అంధకారమూ, కాలుష్యమూ, ద్వేషమూ నింపుతూ పది అడుగులు ముందుకు జీవితయాత్ర సాగించడానికి బదులు పాతిక అడుగులు వెనక్కి జారిపోతున్నవాణ్ణి! నేను అలాగ వేలెత్తి చూపగలనా?

నా దృష్టిలో వెలుగుంటే, నా మనస్సులో విజ్ఞానం ఉంటే, నా హృదయంలో స్వచ్ఛత ఉంటే, హేమంత నిశీథంలో వసంత ప్రభాతం చూడగల విశ్వాసమే ఉంటే, ఆ చిన్న కపోలలో, ఆ స్విన్న నేత్రలో, ఆ జీర్ణ వసనలో నా శరీరాన్ని తన చేతుల్తో లాగే నా జీవితాన్ని తన ప్రేమతో శుభ్ర సుందరంగా కడిగిన మాతృమూర్తిని చూడగలిగి ఉందును కదా_నేను అలాగ అనగలనా: ధర్మ హృదయంతో చూడు_ఆ అవమానిత భారత నారీమణి

పాంచాలీదేవి వలె సాక్షాత్కరిస్తుంది. ద్వేషభావంతో చూడు – ఆ మానవతి లోగోపకరణ మైన వ్యభిచారిణి వలె గోచరిస్తుంది. నా డామె చెక్కిలి చితికి నప్పుడే మన బ్రతుకు కూడా స్వార్థంవల్ల బ్రద్ద లయింది.

దయా ప్రేమలతో తడిసిన హృదయాలకి సరిహద్దు లుండవు. ఆబల లంటేనే కాదు రాజ్యలక్ష్మమ్మగారు కరిగిపోవడం. డాహంచేత నాలుక ఇవతలికి చాపి పగరుస్తూ ఉన్న ట్లుంటుందే సొమ్మసిలిన జంతువులాగ వేసంగి మధ్యాహ్నం – అటువంటి సమయాన పంచముడు ఒకడు పంతులు గారి యింటిముందు వీథిలో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. ఆయన కళ్ళాలకి వెళ్ళారు. ఇరుగు పొరుగు వారినీ, దారిన బోయే వారినీ ఎంత పిలిచినా, ఎంత వేడినా, ఎవరూ రాకపోవడంవల్ల రాజ్యలక్ష్మమ్మగారి మనస్సు బాధచేత కొట్టుకుపోతూంది. అంతలో కనపర్తి శ్రీరాములుగారు ఆ త్రోవను వెళుతున్నారు. ఆయన్ని వేడితే, చేతిలోని పుస్తకాలు కింద పెట్టితే, ఆయనా ఈమే చెలో వైపూ సాయంపట్టి వారి అరుగుమీద పరుండపెట్టారు. అతనికి సేవ చేయగా చేయగా తేరుకున్నాడు. ఆ రోజుల్లో అస్పృశ్యతా నివారణ సంఘాలు, హరిజన సేవా పరాయణులూ లేరు. పంచముడికి ఎండ దెబ్బ తగలకూడదు; తగిలినా, చనిపోవడం సబబుకాని సహాయం పొంది బ్రతకడం జన్మహక్కు కాదు కూడాను. ఇప్పు డయినా పంచముడే ఆని కాక, పేద వా డనో, వీథిలో ననో, మన హోదాకి ఏదో లోప మనో పురుషులమే మనలో కొంతమంచిమి ఈ సాయం చేయలేము. ధర్మగ్రంథాలు తలగడలుగా పెట్టు కువి పెట్టుకుని సంపాదించిన మనస్సులోని అస్పష్టభావమో. లేక మన కోసమో, మన మేర్పరచుకున్న కార్యప్రణాళికకోసమో అవసర మైన సిద్ధాంతమో మన సర్వ మానవ సౌభ్రాత్రం. అంతరాంతరముల నుండి పొంగి పొంగి, అంచులు దాటి, బహిర్లోకంలో ప్రవహిస్తూ అందర్నీ తడిపే దైనం దిన కార్యక్రమం ఆమెకి సర్వ మానవ సౌభ్రాత్రం!

ఇటువంటి వెన్ని సంఘటనలు, ఎన్నెన్ని ఆమె జీవితంలో! పంతులుగారి

యశస్సులో ఆమె పేరు అడగి పో నక్కర్లేదు – ఒకరి జీవితం ఒకరివల్ల సఫలీకృత మైనది కనుకా, సంపూర్ణం అయింది కనుకా: ఆమె విద్యాస క్తీ. ఆమె ప్రార్థనాశీలమూ సత్యసంవర్ధను డైన పంతులుగారే పొగిడారు,

పంతులుగా రంత విరామంలేని కార్యశీలి లేడు; ఆయన చరిత్ర ఇంత దూరాన్ని చదువుతూ ఉంటేనే మన కూపిరాడదు కూడ. ఆయన ఇంకా చేయకుండా వదలుతూన్న పనుల్ని ఆయనకి నిరూపిస్తూ, తాను కొంతవరకు నిర్వహిస్తూ కూడాకూడా పరిగె త్తినవా రామె!

పంతులుగారు ఎప్పుడూ నిద్రపోయి ఉండ రనిపిస్తుంది నాకు. ఆమెకు నిద్ర అక్కరలే దనిపిస్తుంది – తా నాయన్నికూడా కనిపెటుతూండాలి కనుక: అన్నింటికన్న ఆమెలో ఉన్న గొప్ప సుగుణం సోమరితనం లేకపోవడమే అని పంతులుగారు నిర్ధారించారు. ఆయన కార్యదీక్ష మృత్యువని గడగడ లాడించి హర దూరాలని ఉంచింది; ఆ కార్యోత్సవం పూ ర్తి ఆయ్యాక ఒక గడిలోనుంచి ఇంకో గడలోకి ఆయనే హాయిగా నడిచిపోయారు.

నాడు ఇహలోకంలో ఇద్దరూ కలిసి కృషి చేస్తూన్నప్పుడు ప్రతి సాయం కాలమునా ఆయన కళాశాలనుంచీ, కార్యరంగంనుంచీ ఇంటికి రాగానే వీధి గుమ్మంవద్ద మందహాస రంజిత మైన ముఖ మండలంతో నిలబడి 'మీ కొక శుభవా ర్త చెప్తాను' అని చేయి చేయి కీలించి లోపలికి తీసుకుని వెళ్లినట్లే, అవిశ్రాంతమూ, అమోఘమూ అయిన నిరంతర కర్మదీక్షతో ఇహ లోకాన్ని ఉజ్జీవింపజేసి ఆయన జీవితాంతంలో అమరధామం యొక్క ప్రాంగణ కవాటము వద్దకు రాగానే, తన కంపె, జీవితంలోలాగే, ముందే అక్కడకుపోయిన రాజ్యలక్ష్మమ్మగారు దరహాసవదనంతో ఎదురు వచ్చి ఉంటారు.

—ఈ వ్యాసం చిత్తుప్రతి ఇచ్చింది కృ. కా. గారి మనుమడు
చి॥ వెలమకన్ని సుబ్రహ్మణ్య శర్మ (అడ్వొకేట్, కాకినాడ).

చిలకమర్తి లక్ష్మీనరసింహం

[ఆంధ్ర అభ్యుదయ రచయితల రెండవ మహాసభ 30-12-1944 న
చిలకమర్తివారిని సన్మానించిన సందర్భంగా చేసిన ప్రసంగం]

అభ్యుదయ రచయితలు పంతులుగారికి సన్మానం ఏర్పాటు చేయడం, ఆ సన్మానానికి వివిధ కవులను ఆహ్వానించడం గొప్ప విషయం. మాకూ, పంతులుగారికీ ఆప్తబంధుత్వం ఉంది. అందుచే ఈ సన్మాన సభలో మాట్లాడడానికి నాకూ హక్కు ఉంది; పిఠాపురంనుంచి ఇంతదూరం నన్ను పిలిపించడంలో ఔచిత్యమూ ఉంది.

నేడు సాహిత్యసేవకులు అనేక సంస్థలలో, అనేక సంఘాలలో పని చేస్తున్నారు. ఒక సంస్థకూ, మరో సంస్థకూ; ఒక సంఘానికీ, మరో సంఘానికీ విభేదాలున్నాయని తలచడం, నిజంగా విభేదాలున్నా లేక పోయినా ఉన్న వని ఇతరు లనుకోవడం — ఇదంతా నాకు బాగా లేదు. వీరేశలింగంగారు మొదలుకొని నేటి యువతరం వరకూ అందరం ఒకే కుటుంబం వారం, ఒకే వాహినిలోని వారం. ఒకే జాతివారం. వీరేశలింగం, చిలకమర్తి లాంటి మహావ్యక్తులు పనిచేసి ఉండకపోతే, మే ముండేవారం కాము. నేటి యువకులవరకూ కలిసి ఉండే ఏదైనా ఒక మహా సాహిత్య సంస్థను నిర్మించితే, నే నెంతో సంతోషించుతాను.

గతించిన రోజులే మంచి వనే వాడిని కాను నేను. వెనుకటి రోజులి కన్న ప్రస్తుత పరిస్థితులు మంచి వనీ, రానున్న రోజులు ఇంకా మంచి వనీ ఆశ గలవాడను. రోజు రోజుకూ మానవుడు గాని, జాతిగాని అభ్యుదయం చెందవలసిందే గాని, వెనుకకు పోవడానికి అవకాశం లేదు. ఈ సత్యాన్ని గ్రహించిన పెద్దలు వీరేశలింగంగారు, లక్ష్మీనరసింహంగారు.

వీరేశలింగంగారు ఒక మహా ఉద్యమం. చిలకమర్తి ఒక మహావ్యక్తి. అలాగే గిడుగు రామమూర్తిగారు ఒక మహా ఉద్యమం. గురజాడ అప్పా రావుగారు ఒక మహావ్యక్తి. ఈ మహావ్యక్తులను గౌరవించడంలో విలువ ఉంది.

ఒక్కొక్కరు కొన్ని విషయాల్లో ముందుకు నడుస్తారు. కొన్ని విష యాల్లో వెనుకంజ వేస్తారు. మనిషి వెనక్కు నడుస్తూ చేయి ముందుకు పెట్టితే లాభం లేదు. శరీరం అంతా ముందుకు పోవాలి. సమగ్ర మైనదే అభ్యుదయం అవుతుంది. ఈ అభ్యుదయం వీరేశలింగం గారిలోనూ, చిలక మర్తి లక్ష్మీనరసింహం గారిలోనూ కన్పించుతూంది. లక్ష్మీనరసింహం గారు రాజకీయాలలో సైతం జంకలేదు. కాలవాహినితో పాటు ఏర్పడుతున్న ప్రతీ ఉద్యమంలోను వీరు పాల్గొని సానుభూతి చూపారు. సాహిత్యానికీ సమాజానికీ గల సన్నిహిత సంబంధాన్ని గ్రహించి, తమ సాహిత్యాన్ని సృష్టించారు.

గిడుగు రామమూర్తిగారు, వీరేశలింగంగారితో 1919 లో మాట్లాడుతూ, "వచ్చేది ప్రజాయుగం, వ్యావహారిక భాష యుగధర్మం; మీ రన్నివిధాలా ముందుకు నడిచారు, ఇక వెనుకంజ వేయవద్దు; పాత బంధనాలు పోవాలి, ప్రజలకు శాస్త్రజ్ఞానం అబ్బాలి; ప్రాచీన సంస్కృతి వారి కందజేయాలి" అని కోరితే, వీరేశలింగంగారు వ్యావహారిక భాషా ఉద్యమంపట్ల సుముఖు

అయ్యారు. చిలకమర్తి కూడా వ్యావహారికభాషను అంగీకరించకపోయినా, భాషను సులభమొనర్చి, ఆ ఆదర్శాన్నే కొంతవరకు చేరగలిగారు.

ఈ మహాకవి మనిషలివాడు కాడు. ఏ మహాకవీ మనిషలివాడు కాదు. అతనికి వార్ధక్యం ఉండదు. ఎప్పుడూ తరుణుడే! చిలకమర్తి జీవితంనుండి మనం నేర్చుకోవలసిన మహా సందేశం ఒకటి ఉంది. అది ఆశావాదం. ఆయన కెప్పుడూ నిరాశ జనించలేదు. 'మిల్టన్' ఒకా నొకప్పుడు తన అంధత్వానికి వగచాడు. కాని ఈయన అలా కాదు. బాహ్యదృష్టి లేక పోయి, అంతర్దృష్టి ఉన్నదా అనిపించుతుంది. వీరి కవిత్వంలో గాని. మాటలలోగాని ఆనందమే కనిపించుతుంది. వీరి హాస్యంలోని గొప్ప తనానికి కారణం వీరి నిష్కల్మష హృదయమే నని నా అభిప్రాయం. బాహ్య ప్రపంచంలోని ఆనందాలను వీరు చూడలే కున్నా, సమస్తవిషయాలనూ అర్థం చేసుకొని, తమ కవిత్వంవల్ల బాహ్యప్రపంచా న్నంతటినీ ఈ మహా కవి ఆనందింపజేస్తున్నారు. ఇది సామాన్య మానవునికి సాధ్యమైన పని గాదు. వీరిని గౌరవించడం ఎంతో ప్రశంసనీయ మైన కార్యం।

—"తెలుగు తల్లి", 1945 ఏప్రిల్.

బ్రహ్మర్షి గురుదేవులు

"A lamp can never light another lamp unless it continues to burn its own flame. The teacher who has come to the end of his subject, who has no living traffic with his knowledge, but merely repeats his lessons to his students, can only load their minds; he cannot quicken them. Truth not only must inform but also inspire. If the inspiration dies out, and the information only accumulates, then truth loses its infinity. The greater part of our learning in the schools has been wasted because, for most of our teachers, their subjects are like dead specimens of once living things, with which they have a learned acquaintance, but no communication of life and love."

—*Rabindranath Tagore*

ఈ లోకములో గురువు లనేకు లుందురు; గురుదేవుఁ డెన్నఁడెన్నఁడో యవతరించుచుండును. సామాన్య మానవుఁడు గురువు కాఁగలఁడు, గురువర్యుఁడు కాఁగలఁడు. కేవలము రుషియే గురుదేవుఁడు కాఁగలఁడు. వసిష్ఠుఁడు గురుదేవుఁడు. వ్యాసుఁడు గురుదేవుఁడు. రవీంద్రుఁడు గురుదేవుఁడు.

పురాణ భారతములోఁ బుట్టినయెడల నాయఁడుగారు కృష్ణద్వైపాయనుఁ

డైయుండును. పాశ్చాత్య జగత్తులో జన్మించినయెడల సోక్రటీ సయి యుండును. పదియు నెనిమిది పురాణములను నిర్మించి, వేదము 'లేక్చరించి కట్టి', 'నుడికారము సొంపెసలార' భారతమును రచించి, విశ్వవిశాల మైన తన మనోభాండారములో గిక్కిరిసియున్న యమూల్య పదార్థములను పైలుడు, సుమంతుడు, జైమిని, వైశంపాయనుడు మున్నగు ఛాత్రుల మనఃపేటికలలో నింపుచునే యమృత పదవియే కడపలగా గల యనంత ప్రస్థానము విర్విఘ్నముగా వారు సాగించునట్లు ప్రబోధించినవాడు వ్యాస భగవానుడే. కులపతులై, గురుదేవులై, యశఃకాయులై నిలిచియున్న శౌనక, బాదరాయణాదులు యుగయుగములను దాటి వచ్చి యీ దివ్యఛాత్రి పూర్తిగ నశించిపోకుండునట్లు నేటికిని రక్షించుచునే యున్నారు.

ఇక యువకుని హృదయము శరత్కాసారమువంటి స్వచ్ఛము. వాని భావన పక్షముల నెన్నడును ముడుచుకొనలేదు. వాని గగనహర్మ్యములు పర్వతములకన్న స్పష్టములు, నచలములుగా దోచును. వాని బ్రతుకే యలౌకి కానుభూతికో యంగలార్చును. వాని దాహమునకు బాల కడలి చాలన ట్లుండును. మఱియు నవ యుగోదయ మను వసంత సమయములో నొక చేతిలో సమర్పించుటకు నమృత భాండమును, రెండవ కేల స్వీకరించుట కక్షియపాత్రను నుంచుకొని యాశాళల నాహ్వానించు పిపా సాతురుడై వాడు పఱతెంచును. ఆ తరుణమున నట్టి తరుణు లుత్తమ విద్యార్థులై సరుగు పరుగున విచ్చేసి నపుడు వారికంటె నాతురుడై తన మనోభాండార మును హృదయ నిధానమును దెఱచికొని యున్న గురుదేవుడు దెదురుగా నవతరించి పిత్రాలింగనముతో స్వాగత మొసగి నప్పు డెట్టి యనుభవములు వికసించును! ఎట్టి సంఘటనలు ఫలించును!

ఏబది సంవత్సరము లభిన వాంధ్ర యువకులను రెండు సోపానముల మీద నెక్కించి పత్య సాన్నిధ్యమున నిలువబెట్టిన సోక్రటీసు నాయుడు

గారు; పాఠశాలయుఁ బ్రార్థ నాలయమును. నధ్యాపక పీఠము నాచార్య వేదికయు బ్రహ్మర్షి గురుదేవుల సన్నిధానమునఁ గలసిపోయెడివి.

కవికివలెనే యధ్యాపకునకును దన్మయీభవన యోగ్యత (emotional response), యుద్రిక్త భావన (imaginative fervour) యావశ్యక శక్తులు.

నాయఁడుగారి హృదయము శతతంత్రీ మహతి. ప్రతి వాయు నిహతికిని గంపించి పోయెడిది. ప్రతి శిష్యునితోడి యనుభవములే కాక ప్రతి కావ్యములోని యనుభవములును నంద నానిలములై వారి మనస్సు నుట్టూఁత లూఁగించెడివి. "He is a tube through which all things blow into music."

ఇక వారి భావనాశక్తి కవధి లేదు. ఇట్టె తన భావనా పక్షములను దిగంతములవఱకు విప్పి వైదిక యోగులనాఁటి భాగీరథీ తీరమునకును బవరి కార్శమవునకును బ్రయాణమై, యంతలో హాఫీజ్, సాదీ మున్నగు పారసీక భక్తుల మధువనములలో వ్రాలి, కాలూఁది, యప్పుడే షేక్స్పియరు, వర్డ్స్వర్తు, గెటీ, కార్లైలు వంటి పాశ్చాత్య ప్రవక్తల విజ్ఞాన గగన వీథులలో వారి మనస్సు విహారము చేయుచుండెడిది.

అనుభవింపఁ గల యట్టి హృదయముతో, భావింపఁగల యట్టి చిత్తముతోఁ, బ్రబోధింపఁగల యట్టి వాక్ప్రతిభతో నాయఁడుగారు శిష్యులతోఁ గావ్యములఁ బఠించు నపుడు వారి ప్రతి భాషణమును బ్రతి శిష్యునిఁ బ్రత్యేక ముగఁ బలుకరించునటు లుండెడిది; ప్రతి సందేశమును వానికే వినుచున్నట్లుండెడిది.

సాయంకాలము శర్వరిగాఁ గరఁగిపోవు సమయ మది. పాఠశాలలోని గదిలో మునిమాపుఁ జీఁకట్లు ముసుఁగు లొత్తిగిలఁ జేయుచుండెను. నూట యేబదిమంది విద్యార్థులు. ఎదురుగాఁ దేజస్తంభమువలె నిలిచిన స్వచ్ఛ

సుందరమూర్తి. పాదుషా, ప్రవక్త, గురుదేవుడు. మిల్టను పారడైజు లాస్టులో రెండవ పర్వములో స్టిజియక్ కౌన్సిలును వర్ణించు నపుడా యంధకారము నుండి యా యా మహావీరులు కవి మనఃప్రాంగణములో వలెనే విద్యార్థుల ప్రేమలను సుస్పష్టముగా మొలచిన ట్లుండెడివారు. ఆలాగు ననే ప్రూడ్ పదునాఱవ శతాబ్దపు నావికుల గాథలు; ఆలాగుననే పెన్సిక్ లాన్సిలట్ _ ఇలెయినుల ప్రణయగాథ!

నాయకుడు గా రాంధ్ర యువకునకు ప్రసాదించిన వరములు రెండు: ఉదారాశయ శీలము (idealism), తత్త్వదృష్టి. జీవితమును దారకా మండల మునకు వగిలించి యాత్ర సాగించుట; ప్రత్యణువు నందును ననంతత్వ మును, ప్రత్యనుభూతియందును బరమార్థమును బరిశీలింప యత్నించుట. వారి సన్నిధానములో నున్నపు డొక చిన్న తలపో, యొక చిన్న మాటయో, యొక చిన్న చేతయో యనంతవిశ్వములోని కొక్క-సారిగా గవాక్షమును దెఱచెడిది. బ్రౌనింగును గూర్చి చెప్పినట్లు, "To sit beside him..... is to pass out spiritually into the universe with the most accomplished of guides."

నిజమునకు నాయకుడు గా రొక్క- గడియ యైనను సైనాయ్ (Sinai) పర్వతశిఖరమునుండి దిగెడువారు కారు. అవిశ్రాంతముగా నిఖిల జగత్తులో సుస్థిరులై యుండెడివారు. కనుక మహాకవి యనినట్లు లోక మతని కొక యాత్రా వీథి మాత్రమె కాక యొక వసతిగృహము కూడ. సామాన్యముగా మార్గాంతమున మనకు గావలసినది దొరకును. ఈ లోకములో ప్రతి పదమ్మునను మనకు వరము దొరకును; ఏల యన, నీ లోకము తానే యాత్రాపథము, తానే గృహము. కావుననే గురుదేవులు కైలాస శృంగము మీదనే యహరహము నివసింప గలిగెడివారు.

ఈ మహోన్నత స్థితికి గారణము మా కెప్పటి కప్పుడు గోచరించు

చుండెడిది. వారి యంత ర్బాహ్యేంద్రియ నిగ్రహము, వారి యార్జవము, వారితపస్సు. అర్ధశతాబ్ది నమోఘముగా సాగిన యేకపత్నివ్రతము – శ్రీరాముని నాటినుండి గాథగా వినిపించుచున్నది – కాంతిమూర్తిగా నీ యంతేవాసుల మ్రోల సాక్షత్కరించినది. "Although it be not shined upon, true as a dial to the sun", "సతాం కేనోద్దిష్టం విషమ మసిధారా వ్రత మిదమ్" అని మన్ను మేము ప్రశ్నించుకొనెదివారము.

కాని, నాయఁడుగారి నిష్కళంక నీతి దండధరుఁడు కాదు. ఒక్కొక్కని నీతి చండశాసనము; లోపము సహింపలేదు; నా జీవితమును నా మ్రోలనే పెకల్చి దానిలోని కల్మషముల నెట్టియెదుటఁ బఱచి చూపును. ఇఁక నాకు మిగిలినవి నిరాశ, నిస్పృహ. గురుదేవుని నీతి నాలో నిదురించుచున్న యార్జవ పటిమ నెగసనఁ ద్రోసి నే నెంత సచ్ఛీలుఁడను గాఁగలనో యని పించెడిది:

"నీతిపద్ధతి గరువాన నిట్టనిలుచు
తావులం దెల్ల ప్రేమ మస్తకము వంచి
యోర్చి గెలుపొంది పైకొన నేర్చు ననుచు
నలరుఁ దేనియతేట బ్రహ్మర్షిమాట!"

మాన్లే పందొమ్మిదవ శతాబ్దిలో నాంగ్ల రాజ్యాంగ లోకమునకు వివేకము (conscience) వంటివాఁ డని యొక బిరుదాలి ప్రాపెను. ఏఁబది యేండ్లు బ్రహ్మర్షి తన శిష్యులనువలెనే యఖిలాంధ్రమును బహిర్వివేకమై నడి పించెను. కాని దీనిని నేను లోకోత్తర శక్తి యనను. వారికి విరోధుల మనుకొని "ఆక్షేప రూక్షాక్షర ముఖర ముఖు లైన దుర్జను"లను దుఃఖితులను గాఁ జేసి, యనుచరులనుగా మార్చుకొని, యనుఁగుబిడ్డలుగా నాలింగనము చేసికొనఁగల "సాశ్చర్య చర్యులు" వారు:

యువకుఁడహంకారి. ఎదుటివానిలో నహంకారము నోర్చుకొన లేఁడు. 'అది నీకుఁ దగదు. నీతిపద్ధతి యిది' యని నేర్పఁబోయిన, నేవగించ కొనును. అలాగుననే 'నా కెంతయో తెలియును; నీ కంతయును నేర్పెద' నన్న యధ్యాపకుని గౌరవింపలేఁడు. గురువు పండితుఁడు కావలయును. వండితునకు వినయ మేకైక భూషణము. 'నే నెంత తెలిసికొనిన వాఁడనో యని కాక నేఁ దెలిసికొనిన దెంత బాగుగ నున్నదో!' యనఁగలుగు వాఁడు గురుదేవుఁడు. ఒకని పాండిత్యము తనమీఁదను నెదుటివానిమీఁదను బాషాణ మై కూర్చుండును. ఒకని పాండిత్యము తనకును దన్నుఁ దఱిసిన వారికిని బ్రభా పక్షములను దొడుగును. నాయఁడుగారు గురుదేవుఁడు.

కావ్యకర్తకు వలెనే గురుదేవులకుఁగూడ నొక విశాల సౌహార్ద, మొక విశ్వప్రేమ యవసరము. వ్యాసునకు ధర్మరాజునెడ నెంత యభిమానమో శకునియెడ నంత యనురాగము. షేక్స్పియరునకు ఒథెల్లో యెడ నెంత యాదరమో ఇయాగో యెడ నంత సానుభూతి. డికెన్సునకు చజిల్విట్టు నెడలను, మిసెస్ గేంపు నెడలను సమాన ప్రేమ యనిపించును. కావున వీరు ప్రపంచకవులు. దుర్యోధనుడు, కాలనేమి, కాసియస్, ఉర్యాహీప్ లేని యాయా కావ్యములు మనకు దుస్సహములు. వారులేని లోకము కూడ నెంతయో పోఁగొట్టుకొన్న దనిపించును. ఆ కావ్యాత్మలఁ బూర్తిగా గ్రహించుకొని యా కావ్యముల నన్వయించుఁ బాఠము చెప్పఁగలుగువాని కంత విశాల ప్రేమయు నవసరమే; ఇంకొక విశేషము: విద్యార్థులలో నన్ని రకముల ప్రకృతులును గలవు. కవికి వలెనే బ్రహ్మర్షియైన గురుదేవునకున్ను నందఱును ననంత యాత్రా మార్గము తుదిని నమరులుగానే గోచరించు చుందురు.

పురాణ భారతమునాఁటి గురుకులములో గురుదేవుఁడుండెడివాఁడు; గురుపత్ని యైన తల్లి యుండెడిది; అనుఁగుబిడ్డ లైన యంతేవాసు లుండెడి

పూరు స్థాయడుగారి కలాశాల గురుకులము. స్థూల దృగావరణము దాటి పోయిన మా తల్లిగారిని మే మనునిమేషమును గురుదేవునిలో దర్శించుచునే యుండెడివారము. భౌతిక జీవితము చాలించిన ప్రాజ్ఞేశ్వరి తనలో నవత రించుటచే నసంపూర్ణముగ నున్న తన ప్రకృతి సముగ్రసుందర మైన దని మహాకవి వ్రాపికొనెను. పండిత సమ్రాట్టు, విద్యా వ్యాసుడు, సంఘ సంస్కర్త, ధీరోదాత్తుడు, వీర మూర్ధన్యుడు, మహారథుడు నైన గుర దేవుడు మా తండ్రి. గోక్షీరముతో, నవనీతముతో, శర్కరతో, శర జ్యోత్స్నతో జేయబడిన తన హృదయములో ననాథులకును, బతితులకును నభయస్థాన మిచ్చినట్లే ప్రతి శిష్యునకును ననురాగస్థాన మిచ్చి పెంచుకొనిన గురుదేవుడు మా తల్లి:

గురుదేవునకు వియోగ వేదన యైనది మాకు వర మైనది. సామాన్యునకు వేదన వేదనయే: తపస్వికి వేదన సృష్టించు శక్తి నిచ్చును. ఆ శక్తి లోక సంగ్రహార్థము. తీక్ష్ణ మగు సూర్యాతపమును బ్రతి రంధ్రమునుండి గ్రహించి గ్రహించి వృక్షము ప్రసూన ఫల సుందర మై మనకొఱకు సాక్షాత్కరించును. వేద నానలము చల్లార్చుకొని సామాన్య మానవుడొక సంతృప్తిని, నొక సుఖస్థితిని, నొక నిద్రావస్థను బొందవచ్చును. కాని యీ వేద నానలమును జయించినవాడు ప్రస్తుతలోకమునకును, భావికాల మునకును తేజస్సు నీయగల జ్ఞానదీపమును వెలిగించుకొనును. వసిష్ఠుని వంటి యార్యర్షుల గాథలను బఠింపుడు. ఎంత యగ్నిశోధన, మెంత హాలాహలపానము తా మనుభవించి తమ శిష్యుల మూలమున నీలోకమునకు శాంతికౌముదియు, నమృతమును బ్రసాదించిరి:

కనుక బ్రహ్మర్షి యైన గురుదేవుడు "దహమువలన మఱల్చుచు, హితార్థ కలితుడ జేయుచు, గోప్యంబు దాచుచు, గుణము బోషించుచు, నాపన్నుని విడువక, లేవడివేళ నిచ్చు" సన్మిత్రుడై, పితృదేవుడై, మా మా కలా

కాలంలో మాకు గురుకులవాస మేర్పఱచి, వ్యాసాదులలో నొకఁడై మాకు నేఁటికిని నమఱుఁడై వేంచేసియే యున్నాఁడు.

వారి చరణకమలములను నా హృదయవేదికపై నుంచుకొని నా శిరస్సును ధూళిలో నుంచుచున్నాను.

—కాకినాడ ఏ. ఆర్. కాలేజీ మాగజీన్ (1939-40) సంచికకు అనుబంధంగా వెలువరచిన "*In Memoriam*" నుండి.

రవీంద్ర స్మృతి

నా యెదలో త్వదీయ చరణమ్ముల చిహ్నము లెన్నడేనియున్
మాయవ, ఏ నిశీథపు తమస్సులు మూసినగాని; జీవయా
త్రాయత వీథి హాయిగ ప్రయాణము చేయుదు నక్షయంపు పా
థేయముగా గ్రహించి గురుదేవ ముఖస్రుత గీతికా సుధల్ :

ఎన్నో స్మృతు లిచ్టే మాసిపోతాయి. రవీంద్రుని స్మృతి మాయదు: రేలూ పగళ్లూ ఉండిపోతుంది — "గ్రహ తారా చంద్ర తపనుల"తో, నదీ వగ వనాదులతో : రవీంద్రుని స్మృతి సురపారిజాత పరిమళం. రవీంద్రు నికి కాళిదాసు స్మృతి అలాంటిది. రవీంద్రు డంటాడూ: "యౌవన రాజ్య పట్టాభిషేకోత్సవంలో సింహ పీఠంమీద నీవు ఆసీనుడ వయ్యావు. నీ చెంతనే నీ దేవి కూర్చుంది. భూమి పచ్చని తివాసీని నీ కాలికింద పర చింది. రత్నాలతోటీ, బంగారపు పువ్వులతోటీ పొదిగిన చాందినీ ఆకాశం నీమీద పట్టింది. ఋతువు లన్నీ మధుపాత్రలు చేతుల్లో పట్టుకుని, కాళిదాసూ! నీ చుట్టూ నృత్యం చేస్తున్నాయి. నాకు నీ స్వర్ణయుగంలో పుట్టాలని ఎంతో ఉండి నిట్టూరుస్తుంటాను. నేను కొన్నియుగాలు ఆలస్యంగా పుట్టిన కాళి దాసును" అని. ఔను, మనకు వేలయేండ్లనుంచి వచ్చిన కవికుల గురువు స్మృతిలాగే, ఈ కవిదేవుని స్మృతిన్నీ ఎప్పుడూ పచ్చపచ్చగా పరిమళ భరంగా ఉండి తీరుతుంది.

"ఆకుల్ రాలని పూలు వాడని వసంతారామం" వారి కవిత్వం. ఆయన దివ్యసుందర విగ్రహాన్ని సందర్శించి సందర్శించి, ఆయన మోహన కంఠరవాన్ని ఆలకించి ఆలకించి ఒకనాడు వివశులైనవారున్నారు. ఆ మూర్తి, ఆ వాణీ కనబడకుండా, వినబడకుండా శూన్యమైపోయిన ఈ బాహ్య లోకాన్ని చూసేప్పటికి అల్పవిశ్వాసులకు ఒక్కొక్కప్పుడు ఒక పెద్ద దిగులు పట్టుకుంటుంది. రవీంద్రుని తుది గీతాలలో ఒకటుంది – చదివితే నాకు మహా దుఃఖం వస్తుంది.

"ఈ మధ్యాహ్నం ఎంద మండిపోతూంది. ఖాళీగా ఉన్న ఆ నా కుర్చీ కేసి నేను చూస్తున్నా. అక్కడేమీ ఊరడించేది కనబడదు. నిస్పృహా వాక్కులు వీవో ఆ కుర్చీలోన అంతా నిండి, రోదనంలాగ పైకి లేస్తున్నట్లున్నాయి. పోగొట్టుకున్న యజమానికోసం జాలిగా చూస్తూ, ఒక గుడ్డి దుఃఖముతో, ఏమి జరిగిందో ఎందుకు జరిగిందో తెలియకుండా ఆల్లల్లాడిపోయే ఒక కుక్క బాధకన్నా ఎక్కువ పదునైనదీ, మృదువైనదీ ఒక బాధ ఆ కుర్చీ కంఠస్వరంలో ఉన్నట్లుంది" అని. ఆ కుర్చీ కున్నంత బాధ గురు దేవుని శిష్యుల హృదయాల కప్పుడప్పుడు కలుగుతుంటుంది.

రవీంద్రుని వ్యక్తిత్వం చాలా విశిష్టం. అభూతం. మహా ఉదాత్తమైంది. లోకం అంత విశాలమైందీనీ. సుంద రాతి సుందరమైంది కూడా. చిత్రం, బాహ్యమూర్తికీ, అంతర ప్రవృత్తికీ అంత సామరస్యం ఇంకెవ్వరిలోనూ కనబడదు. కాళిదాసులో ఉండే దనిపిస్తుంది. ఎన్నియుగాల వాసనలో దానిలో పరిమళిస్తాయి. ఎన్ని దేశాల సంస్కృతులో దానిలో వెలుగుతుంటాయి. ఆ వ్యక్తిత్వానికి జాతి లేదు; మతం లేదు; కులం లేదు; వయస్సులేదు. అలాగ అని అది పాతబడ్డదీ కాదు; పరాయిదీ కాదు.

రవీంద్రుడు చిరయాత్రికుడు, పథిక చక్రవర్తి.

ఒక్కొక్క గొప్పవాడు కేవలం పురాణ సంస్కృతివైపే చూస్తూ, "అదే గొప్పది, అంతకంటె మరేమీ లే" దంటాడు. మరొక్కడు తన దేశానిదో, జాతిదో సంస్కార కావరణలోకే చూస్తూ, ఆ గోడ అవతల దాన్ని దేన్ని రానివ్వ వద్దంటాడు. ఈ రెండు తరగతులవారికీ చారిత్రక దృష్టి లే దన్నమాట. విజ్ఞానదృష్టి లే దన్నమాట. వారు ప్రయాణమే మానుకున్నారు.

రవీంద్రుని కావ్యాలూ, సందేశాలూ చదివితే, వాల్మీకినుంచి కాళిదాసు దాక, కాళిదాసునుంచి కబీరుదాక, కబీరునుంచి ఈ రోజుదాక ఒక్కొక్కరితోనే చెయ్యి చెయ్యి కలిపి పాడుతూ అలాగే వస్తూ ఉన్నట్టుంటుంది.

అలాగే ఈ దేశంనుంచి ఆ దేశానికీ, ఆ ఖండంనుంచి ఈ ఖండానికీ ఆరిషోని తన కరదీపికలో విజ్ఞాన స్నేహాలు పోస్తూ, మూల మూలలూ వెతికిస్తూ తిరుగుతూ ఉన్నట్లుంటుంది.

ఏ నాటినుంచో అలాగే వస్తూ ఉన్నవాడు ఏ నాటికో అలాగే ముందు ముందుకు కూడా పయనిస్తా డనిపిస్తుంది. అందుకే ఒక్కొక్కప్పుడు రవీంద్రునిలో 'వయసులేని తనం' ఉన్నట్టు ఉంటుంది. "నాతో ముసలి వాడవు కమ్ము, అన్నింటికన్న మంచి దింకా ముందుంది" అనే ఆంగ్లకవి మాటలు తానూ అంటాడు రవీంద్రుడు, ఇంకా బాగా.

అందుకనే ప్రస్తుత యుగ ప్రభావాలు ఆయన బాగా పరిశీలించాడు. ముందువచ్చే స్థితిగతులూ గ్రహించాడు. కనుక ఆయన వ్యక్తిత్వానికీ, జాతీయతకీ విరోధం లేదు. జాతీయతకీ, మానవ సభ్యతకీ విరోధం లేదు. ఆయన ప్రత్యేక వ్యక్తికి ప్రాధాన్యం ఇస్తాడు. కాని ఒకలాగే ఇస్తాడు. ప్రత్యేక వ్యక్తి శరీరంలో ఒక అణువు (cell) వంటి వాడు. దానికి ప్రత్యేకం జీవం ఉంది. అది ప్రత్యేకంగానూ పెరుగుతుంది. శరీరాన్ని సుందరంగా ఆరోగ్యంగా ఉంచడానికీ పెరుగుతుంది. అలాగే ప్రతివ్యక్తినీ అఖిల

మానవకోటి అనే దేహంలో. అలానే వ్యక్తికీ, జాతికీ ప్రత్యేకత ఉంది; అవి ఆరోగ్యంగా అందంగా పెరగాలి. కాని, మానవాభ్యుదయానికీ. ప్రస్తుత సభ్యతకీ అనుకూలంగానూ పెరగాలి.

అందువల్లనే రవీంద్రుని జాతీయత గుడ్డిదీ కుంటిదీ కాదు. ఆయనకు ఏ వ్యక్తీ లోపం లేనిది కాదు. ఏ గ్రంథమూ లోపం లేనిది కాదు. ఏ జాతీ లోపం లేనిది కాదు. కనుక ప్రతి వ్యక్తిపై, ప్రతి గ్రంథంపై, ప్రతీ జాతిపై గొర వానురాగాలే. ఇటు భయం, బానిసతనము, అసత్యం, అజ్ఞానం, అంధాచారం, అలసతా తన జాతిలో భయంకర లోపా లనడానికి ఆయనకి భయం లేదు. అటు అధికార్థ మత్తతలమీద, ద్రవ్యవాదంమీద, దురాశమీద ఆగ్రహించడానికీ భయం లేదు. ''ఎక్కడ మనస్సుకు భయం లేదో, ఎక్కడ వాక్కులు సత్యగర్భంలోనుంచి దొలుచుకుని వస్తాయో, ఎక్కడ శిరస్సు గర్వంవల్లి ఉన్నతమో, ఎక్కడ వివేక విజ్ఞానధారలు ఇష్క్ర సంప్రదాయాచారా లనే ఇసుకలో ఇంకిపోవో, ఎక్కడ లోకంలో పాడు గదులూ, ఇరుకు బరలూ లేవో, ఎక్కడ దుర్వార మైన కర్మధార సంతత ముక్తమై అభ్యుదయ మార్గంలో ప్రవహిస్తుందో – అక్కడికి, ఆ స్వర్గంలోకి నా దేశాన్ని మేలుకొలుపు, నీ దయాహస్తంతో నిర్దయగా కొట్టి లేపు'' అని అంటాడు ఆయన.

''బుద్ధ దేబేర్ ప్రతి'' అనే మరో గీతంలో ''బోధి వృక్షచ్ఛాయలో మేలుకున్న వెలుగు అజ్ఞానపు తెరలను చీల్చి వేసింది. నిశితమూ, స్వచ్ఛమూ, నిర్భయమూ అయిన అట్టి విజ్ఞానమూ, మేధా మళ్లీ అలస మనస్సునకు కాంతీ, చైతన్యమూ ఇవ్వాలి'' అని ఆక్రోశిస్తాడు. ''దేశ దేశ నందిత కరి–మంద్రిత తవ భేరీ'' అన్న ఉజ్జ్వల గీతంలో ఎంత కర్కశంగా తన దేశాన్ని ప్రబోధిస్తాడు! ''నీ దుందుభి దేశ దేశాల్ని పిలిచింది. నీ పీఠం చుట్టూ మానవు లందరూ గుమి కూడారు. మంగళ ముహూర్తం వచ్చింది.

నా దేశం ఏదీ? వెనకనే కాళ్ళీడ్చుకుంటూ పాకుతూండా? తన మూటలా బిడ్డాన్ని వేసుకుని అందరితోనూ ముందుకు నడవదేం? నిత్య జాగ్రన్నేత్రి వైనశక్తీ! గట్టిగా తట్టి లేపు ఆమెను! నీ విజయ కాహళిని వినిపించు. అందరూ మాయలు అనే తెరల్ని చింపి పారేశారు. బాధ పడ్డారు, శ్రమ పడ్డారు. ఈ దేశం మాత్రం రాత్రులూ పగళ్ళూ చేతులు పక్కల్ని వేళ్లాడేసుకుని పిగ్గులేక బద్ధకంగా కూర్చుంది. కొత్త సూర్యుడు ఉదయించాడు. ఏమి యాత్రికులు! ఎందరు యాత్రికులు! మాన వాలయ ప్రాంగణంలో తన్ను తా నవమానించుకుని ధూళిలో పడి ఉంది నా భారతం. మానవ మంది రంలో ఆమెకు చోటు లేదు. లోక మార్గా లన్నీ ఎలాగ క్రిక్కిరిసి పోయాయో! నీ రథ చక్రాల చప్పుడుతో అవి ఎలాగ చకితం అవు తున్నాయో! బాటసారుల పాటలతో ఆకాశం నిండి పోయిందే! పాతబడ్డ పాఠంట్లో తలుపులు వేసుకుని కూర్చుంది నా దేశం. ఆమె హృదయమూ, కంఠరవమూ నిశ్శబ్దంలోకి కుంగి పోతున్నాయి. అహా! లోకమంతా ఏమి జనం! ఎందరు! ఎందరు! గుండెల్లో, ఛాతీల్లో, భుజాల్లో, కండరాల్లో ఏమి శక్తి! ఏమి నిర్భయం! అయ్యయ్యో! నా దేశానికి తనంటే తనకే అను మానం, సందేహం, నిస్పృహ. తన నీడ తన్నే తరుముతుంటే ఎలాగ వణకి పోతోందో! ఓ మహాశక్తీ! చైతన్యదాత్రీ! ఒక్కసారి అతి నిష్ఠుర మైన ఆఘాతంతో లేపి నిలబెట్టు నా దేశాన్ని!"

ఈ తీవ్రతతో మెరిసిపోయే అయన దృష్టికి భావి యుగం సాహిత్యం రిస్తుంది. అభిమానాలూ, ఆవేశాలూ పక్కకి తోయగలిగిన ధీరోదాత్తుడు. కొత్త దనానికి విముఖుడు కాడు. బెదరడు. ప్రస్తుత స్థితిగతులకి నీరసపడే అలసీ, అల్పవిశ్వాసీ కాడు. "హింసాయ్ ఉన్మత్త పృథ్వీ" వంటి గీతాల్లో దురాశా, ద్వేషమూ, స్వార్థమూ ఒల్లకి ఈ లోకంలో కట్టిన మహా నిర్మాణాలు పెళ పెళ మని కూలిపోవడం, వాని మీద అసంఖ్యాక మానవకోటి నిలబడి అదే పనిగా నవ నిర్మాణాలతో నవ జగత్తు కట్టుకోడం స్పష్టంగా చూస్తాడు.

తామే కర్ణధారులై, తామే తెడ్లతో పడవల్ని నడుపుతా రంటాడు. తామే పొలాలు దున్ని, తామే బీజాలు చల్లి, తామే కోసుకుంటూ తింటూ రంటాడు: రాజదండం ఛిన్నభిన్న మైతే, కూలిపోయిన శత సహస్ర రాజ్య నిర్మాణాల మీద విలబడి శ్రమించే కోటానుకోట్ల మానవుల కంఠస్వరాలు తిరుపుల్లాగ మోగుతూ, పడుగూ పేకలాగ కలిపిపోతూ, రాత్రీ పగలూ లోక మార్గాల మీద హోరు మంటూ యుంటాడు. సమాన సుఖ దుఃఖాలు ఒక్క విశ్వ గీతంగా వినిపిస్తూ ఉంటే, రుజాలసతలు దులిపి, భుజం భుజం కలిపి, ఛాతీలు విప్పి, శిరస్సులు ఎత్తి మానవులు తమ కోసం శ్రమిస్తూ సమంగా జీవిస్తా రంటాడు. ఇతర దేశాల్లో లాగే మన వంగంలో, అంగంలో, కళింగ సముద్రాల్లో, గంగా ఘట్టాల్లో, పాంచాలంలో, బొంబాయిలో, ఘూర్జ రంలో సామాన్య మానవుని ఈ సూత్ర చైతన్యోత్సవం కలకలం చేస్తూం దంటాడు. ఈ గీతాలు చదివినప్పుడు, చిరగాఢ నిద్ర వదలి పాశ్చాత్య పురాణంలో సేమ్సన్‌లాగ అశేష మానవకోటి ఒక్కసారి ఒక్క మహా భూతంలాగ లేచి, ఊగి, హుమ్మని, స్తంభాలు చేతుల్లో పట్టుకుని ఊపి ఊపి, ఊపిరాడనీని పురాణ సౌధాన్ని నేలమీదికి పెట పెట మని విరిచి లాగేస్తున్నట్లనిపిస్తుంది.

ఇట్టి లోకంలో రవీంద్రుడు కేవలం అస్పష్ట స్వప్నాలు పేనుతూ కూర్చోలేదు. మనకి స్వప్న మాత్రంగా ఉన్నవి ఆయనికి స్పష్ట దృశ్యాలు. కనుకనే దుర్వారమైన కర్మ చైతన్యానికి పురికొల్పుతూ ఉంటాడు తన వారిని. ఒకసారి ఇలాగ ప్రబోధిస్తాడు: "రా, స్నేహితుడా, భయపడకు: ఈ కరకు నేలపై అడుగు పెట్టు. మని మాపులో స్వప్నాల్ని ఏరుకుంటూ కూర్చోకు. ఆకాశంలో తుపానులు మూలుగు తున్నాయి. మెరపులూ, ఉరుము దెబ్బలూ మన నిద్రమీద పడి కొడుతున్నాయి. సామాన్య జీవిత రంగంలోనికి దిగు. రావయ్యా! మాయాజాలకం చిరిగిపోయింది! కరకు రాతి గోడలమధ్య విలబడు!"

ఇంకో చోట అంటాడు: "సోమరితనపు కలల్లోకి మమ్మల్ని జోకొట్టకు. కదిలించు మమ్మ. ఈ ధూళిలో కుంగిపోయే గుణాన్ని వదిలించు. మా పేనస్సుల్ని బంధించే సంకెళ్ళని తెంపి, ప్రారబ్ధ కర్మ మనే దాన్ని తుడిచి వెయ్యి. నిరంకుశ ప్రభువుల కాళ్ళకింద పడేసి మా అభిమానాన్ని చంపే మా అంధత్వాన్ని పోగొట్టు. యుగయుగాల అవమానాల్ని నిర్మూలించు" అని.

రవీంద్రుని సంస్కృతి స్థిరంగా దృఢంగా ఈ భూగర్భంలోకి వేళ్ళని పోనిచ్చి పెనవేసుకున్న వాస్తవిక సంస్కృతిన్నీ, మళ్ళీ పూవులతోటీ, పళ్ళ తోటీ, కొమ్మలతోటీ గాలుల్లో, కాంతుల్లో రస్సు ఊగించే సత్యసుందర సంస్కృతిన్నీ!

ఇక రవీంద్రుని తుది గీతం—ఆయన అస్తమించిన తరువాత ఆప్తుల్ని పఠించ మని ఆదేశించినది:

"ముంపు శాంతి సాగరం పరుచుకుని ఉంది. కర్ణధారీ! దానిమీద పడవను వదులు. నీ వెప్పుడూ సహ యాత్రికుడవుగా, సఖుడవుగా ఉంటావు. వీనిని నీ అంకంలోకి చేర్చుకో, దయచేసి చేర్చుకో! అనంత మార్గంపై ధ్రువతార మెరుస్తూంది. ఓ ముక్తిదాతా! నీ క్షమా, నీ అనుగ్రహమూ నిత్య యాత్రలో అక్షయ ఐశ్వర్యంగా ఉండుగాక! ఈ నశ్వర బంధాలు తెగి పోవును గాక! ఈ విశాల విశ్వం తన చేతులు చాపి కౌగిలింతలోకి వీనిని తీసుకొను గాక! తన నిర్భయ హృదయంలో అజ్ఞేయ మైన ఆ మహాశక్తిని ఇతను తెలుసుకొను గాక!"

ఈ గీతం వినగానే అఖాతమూ, శాంతమూ, నిశ్చలమూ అయిన క్షీర సాగరమూ, ఆ నడుమ నావా, దానిమీద రాజర్షి కవిదేవుని నిర్భయ సుందర మూర్తీ, దూరాన ధ్రువతారా, ఆవలి తీరం అన్నీ స్పష్టంగా దర్శన మిస్తాయి.

ఇంతలోనే స్మృతిపథంలో "భానుసింహ పదావళి" మొదలుకుని "బలాక" వరకూ, "బలాక" మొదలుకొని "ఫాల్గుని" వరకూ, తుది గీతావితానం వరకూ అన్నీ మెరపుమీద మెరపులాగ తోస్తాయి. రవీంద్రుని దివ్యస్మృతి మానేది కాదు.

—రేడియో ప్రసంగం

బ్రాహ్మసమాజ జ్యోతులు

బ్రాహ్మసమాజ మనగానే బ్రాహ్మునకు – ఏవో దేశ కాల పాత్రములచే ఆవరింపబడి ఏవేవో నిర్దిష్ట నియమములచే నడుపబడు ఒక మానవ కూటము మాత్రమే కాదు; కలకత్తాలోనో, కాకినాడలోనో నూరేండ్లనుండియో, ఏబదేండ్లనుండియో ధర్మజీవనము సాగించుచున్న సాధక సంఘమే కాదు.

బ్రాహ్మసమాజ మనగానే ప్రతి బ్రాహ్మని అంతరనేత్రముల మ్రోల ఈ విశ్వ మంతయు ప్రకృతితో, ప్రజలతో, నిశాదివములతో, సుఖదుఃఖములతో, పూర్వ వర్తమాన భవిష్యత్తులతో, ప్రాక్పశ్చిమములతో ఒక్కసారి పరచికొనిన ట్లగును.

బ్రాహ్మసమాజ మనగానే ప్రతి బ్రాహ్మని అంతరంగమును గరు త్మంతునివలె పక్షములు తొడిగికొని పై కెగసిపోవును. వేదకాలమునాడు భాగీరథీతీరమున బ్రహ్మజ్ఞాన నిలయములై, యోగనిద్రాళువు లైన తపో వాటికలకు పరతెంచును. సామ్రాజ్య స్వార్థమును తొలగించి, సకల భూత ములయెడ సమాన కారుణ్యమును ప్రసరింపగల బుద్ధిని వికసింపజేసిన అశ్వత్థ మహీజచ్ఛాయల కాలూదును. అకలంక వర్తనమువలన, అనివార్య విశ్వాసమువలన అరుణతర మైన ప్రాణరక్తముచే తడుపబడిన శ్లీవాంకము కిరీటముగాగల కలవరిగిరిపై విక్రమించును. ఎడారిలోని గ్రీష్మాతపము

కంటె తీక్ష్ణతర మైన సత్యఖడ్గముతో, అమావా స్యాంధకారముకంటె సాంద్రతర మైన అజ్ఞానయవనికను చించి, స్వచ్ఛ మైనను సర్వసాధారణ మైనదియు, తీక్ష్ణ మైనను తీయ నైనదియు నగు ధర్మదృష్టివి మేలుకొల్పు ఖర్జూర కేదారఖండములలో విహారము సేయును. మధ్యయుగము నందలి భారత వైష్ణవ గీతాభంగముల మీద, సూఫీ మధురురీ పద్ధముల మీద, ఫ్రాన్సిస్కన్ బెనిడిక్టైన్ సేవాసమీక్షముల మీద విశ్లేషణ గోరని ప్రయాణము సేయును.

బ్రాహ్మసమాజ మనగానే ప్రతి బ్రాహ్మని హృదయ యవనిక మీద ఎంద రెందరు భారతవీరులు, భాగవత శిఖామణులు ఒకరిని మించి యొకరు అవతరింతురు:

శత సంవత్సరములకు పూర్వమే వ్యక్తిగత సాంఘిక జాతీయ మానవ సమస్యల సముచిత పరిష్కారమునకై ప్రతి సామాన్య మానవునకును అందగల సమగ్ర సుందర మైన విధానమును వినిర్మించిన నూతనయుగ నిర్మాత, మహాద్రష్ట, ఋషిసమ్రాట్టు అగు పురుషోత్తముడు 'రామ్ మోహనుడు' సాక్షాత్కరించును.

భౌతికావరణ బద్ధ మైనను ఏ భేదమును పాటింపని విశాల విశ్వాలయ మును స్ఫురింపజేయు నూతన మందిరములో వెలిగింపబడిన దివ్యజ్యోతిని జీవన స్నేహముతో ఎగసనద్రోయుచు యజమాని రాకకై యెదురుచూచు నతీమణివలె క్షమా నిశ్చలమును, కరుణా ప్రశాంతమును నగు మూర్తితో 'విద్యావాగీశుడు' పొడగట్టును.

చిరుతప్రాయమునాడే తనలో మేల్కొనిన మెరపును పాశ్చాత్య విజ్ఞాన పరిశీలనమువలన, పారశీక వేదాంత పరిగ్రహణమువలన, ప్రియతమ మగు ఉపనిష న్మంత్రపారాయణమువలన అమరజ్యోతిగా చేసికొని, వివిధానుభవ పంకుల మగు సామాన్య లోకములోనే శాంతి నికేతనము కల్పించుకొన్ని,

తా నున్నచోటే అందరకు రుష్యాశ్రమముగా భవ్యమనోహర మైన ఆధ్యాత్మిక దృష్టివి అందర యెదుటను మెరపించుచు, యుగ యుగమ్ముల యోగ నిద్రలో సుస్థిర మైన హిమాలయమువంటి 'వృద్ధమహర్షి' గోచరించును.

మృత్యు కైతల్యము క్రమ్ముకొను చోట అగ్నిమంత్రముతో, నిరాలంబ సంశయ వాదము చెలరేగు చోట నిశ్చల విశ్వాసముతో, భోగపరాయణత్వము ప్రబలిన చోట సజీవ వైరాగ్యముతో, దీపస్తంభము వలె మొలిచి, దివ్య దూతవలె నిలిచి, శంఖధ్వనివంటి ముక్తకంఠమును మోగించి మోగించి, బ్రహ్మానందపరవశు డైన ప్రవక్త 'కేశవచంద్రుడు' నాట్యము చేయును.

ఉచ్ఛ్వాసము కీర్తనముగా, నిశ్వాసము కీర్తనముగా, హృదయ స్పందనము కీర్తనముగా, ప్రతి భావన కీర్తనముగా, పలుకు పలుకు కీర్తనముగా, సెలయేటితీగల వీణవలె నొకసారి, తారకామంత్రుల వీపంచివలె నొకసారి బ్రహ్మానంద గానమును భారతమునుండి పాశ్చాత్య ప్రపంచమునకు, పాశ్చాత్య ప్రపంచమునుండి భారతమునకు ప్రవహింపజేసిన 'ప్రతాపచంద్రుడు' మూర్తీభవించును.

భ్రాంతమోహానుని స్వర్ణయుగ నిర్మాణమునకు సాధన మైన సమగ్రాశయము, సత్యసందేశము మనోహర మానవరూపము దాల్చిన విధమున భక్తిమార్గములో భాగవత శిరోమణి యై, విజ్ఞానవీథిలో వేదాంత దేశికుడై, కర్మక్షేత్రములో మహారథు డైన 'ఆనందమోహను' డవతరించును.

అచంచల విశ్వాసమువలన, అనివార్య సత్యమువలన దృఢాతి దృఢ మైన హస్తములో స్థాపింపబడిన కరదీపికను ఒక్క నిముస మైనను నేలపై జడవేయక వాడ వాడలలో, గుండె గుండెలలో వెలిగించి వెలిగించి విశ్రామ మెరుగని ప్రచారక సార్వభౌము డగు 'పండితరాయలు' తాండవించును.

దశ దిశా తంత్రులొక్కటే సుధాస్రుతిగా ధ్వనించు విశ్వవీణారవము వంటి గీతాంజలిలో, ద్రవ్యవాదమునుండి, లౌకిక సంగ్రామమునుండి పాశ్చాత్యులను, గాఢ నిద్రనుండి, మూఢ జీవితమునుండి ప్రాచ్యులను ప్రబోధించుచు, ప్రాక్పశ్చిమములా రెండును ఒక్క హృదయము యొక్క రెండు స్పందనములే యని తెలిపికొని విశ్వసించి, విర్వచించి విశ్వ భారతిగా ఆచరించి ఎప్పటి కప్పుడు ప్రపంచ పరిస్థితులను, భారత వాతావరణమును పరిశుభ్రముగా, ఉన్నతముగా ఉంచుచు మహర్షుల సంప్రదాయమున వెలిగి మహర్షి యైన 'రవీంద్రుడు' విరాజిల్లును.

విజ్ఞాన దృష్టికి విశ్వాస పక్షములు తొడిగి ప్రయాణము చేసి చేసి, శాస్త్రమునకు శాస్త్రమునకు వడుము నున్న నరిహద్దు లన్నియు కరగిపోయిన సీమను, ప్రాణికిని ప్రాణికిని నడుమ లేచిన కుడ్యము లన్నియు చెదరిపోయిన చోటును చేరి, విజ్ఞానైక్యమును, జీవైక్యమును భావనా స్వప్నముగనే కాక ప్రస్ఫుట దృశ్యముగా తిలకించిన 'జగదీశచంద్రుడు' ఉదయించును.

తాను పెదవి విప్పిన సత్యవాణి యై, తాను ప్రబోధించిన వివేక వర్ధని యై, తా నాచరించిన హితకారిణి యై, ఎదిరించినవేళ ప్రభాభంజ మై, ప్రభంజన మై, ఎదురు చూచినప్పుడు అనయహస్త మై, ఆలింగన మై, అఖిలోద్యమములకు ఆదిపురుషు డై, దక్షిణదేశమువకు రామమోహను డైన 'వీరేశలింగము' వెలుగొందును.

ఆంధ్ర యువ మనస్సునకు ఆశయ పక్షములు తొడిగి తొడిగి, ఆంధ్ర యువ హృదయమును అమృతవాహినిగా కరగించి కరగించి, ఈ నాటి పాప పంకములో రేపటికి తపఃకమలముల వికసింపజేసి, ఈనాటి అనాథ జీవితములో రేపటికి శాఖోపశాఖలుగా పెరిగిపోగల సంసార మందారమును మొలిపించి, సర్వలోక కుటుంబ సంసారములో అనాథ లే రని ఘోషించు టకు తన హృదయమునే అనాథ శరణాలయముగ జేసికొని, భక్తికి, జ్ఞాన

మునకు, కార్యోత్సవమునకు మూడు సుందర నిర్మాణములను ఒక్క తావుననే నిల్పి మన కొక ప్రయాగను ప్రసాదించిన గురుదేవుడు బ్రహ్మర్షి 'వేంకటరత్నము' ప్రత్యక్ష మగుచునే యుండును.

బ్రాహ్మ సమాజ మనగానే మూడేండ్ల భారతచరిత్ర క్రిక్కిరిసి క్రిక్కిరిసి, తోడోపు లాడుకొనుచు మన మనస్సుల లోనికి పరవళ్ళు తొక్కుచు ప్రవహింపదా? మహావీర గోవింద దేనడే, పండిత సమ్రాట్టు భండార్కరు, చందావర్కరు, కాశీబాయి నౌరంగీ, సాధుమూర్తి వాస్వానీ, రాజనారాయణ వసుడు, విజయకృష్ణ గోస్వామి, అక్షయ కుమార దత్తు. గౌర గోవింద రాయలు. ప్రకాశచంద్ర రాయలు, గాయకాచార్య త్రైలోక్యనాథ సన్యాలు, వీరాతివీర బలదేవ నారాయణుడు. కృష్ణకుమార మిత్రుడు. రుచిరామ్ సహానీ, ఆచార్య ప్రఫుల్ల చంద్ర రాయలు, నారీశిక్షా ప్రసూనము సరోజినీదేవి, కవయిత్రి కామినీ రాయ్, నాయక శిరోమణులు సేనుగుప్త, విధాన చంద్ర రాయలు, సర్ సీలరత్న సర్కారు, రాజకార్య ధురంధరులు కృష్ణగోవింద గుప్త, భూపేంద్రనాథ వసువు, సత్యేంద్ర ప్రసన్నసింహులు, సీతానాథ తత్త్వభూషణులు, ప్రియతము డగు మన హేమచంద్రుడు, బ్రహ్మగా వాసక్త డాక్టరు రూబెన్సు, రంగారావు, శ్రీధరులు నాయడు, బుచ్చయ్య పంతులు, లక్ష్మీనారాయణ. బాపయ్య, సాంబశివరావు, సీతారామయ్య..... ఎంద రెందరు, ఎంద రెందరు ఆ ప్రవాహ తరంగములపై తరగెత్తి వచ్చుచుందురు :

—'బ్రాహ్మ సమాజ మనగా' అన్న శీర్షికతో 'దర్మపాదవి' (3-1-1964)లో ప్రకటితం.

ఉమర్ ఖయ్యామ్

ఘ్యాజుద్దీన్ అబుల్ వతహ్ ఉమ్మరీన్ ఇబ్రహీం అంటే ఎవ్వరూ ఎరగరు. ఖయ్యామ్ అంటే ఎరగనివారుండరు. ఖయ్యా మన్న పేరు తఖల్లుస్ _ పెన్ నేమ్. ఈ పేరు ఎంత పుణ్యం చేసుకున్నదో!

ఖయ్యాము కన్న భాగ్యశాలి అయిన కవి మరొకడు కనబడడు. బ్రతికి ఉన్నంతకాలమూ ఒక పాపుషా నాశ్రయించ లేదు. మరణానంతరం ఏ మహాకవికీ రాని యశస్సు ఇతనికి వచ్చింది. చిన్ననాటనే అనేక శాస్త్రాలలో అఖండ పండితు డనిపించుకున్నాడు. బాగ్దాము పాపషా మలిక్ షా జలాలుద్దీను ఆంతవాని ఆదరణం అర్థించకుండానే పొందేము. సతీర్థ్యుడైన నిజాముల్ ముల్క్ అర్పించుకున్న జాగీరు అనుభవించాడు. మెర్వ్ సుల్తాన్ సదరుద్దీన్ మహమ్మద్ తానై వచ్చి ఇతనికి కానుక లర్పించుకున్నాడు. సమ్‌జర్ షా తత్తీమీద జరిగి ఆర్ధాసన మిచ్చుకున్నాడు. అయినా; 'రాజూ ఒక మానవుడే, నావంటివాడే; పొట్టకోసం ఒకరిని వేడుకోను. ఒక రొట్టె, ఇంత పీరూ నాకు చాలవా!' అని బింకంగా చెప్పుకున్నాడు. ఇక నడి వయస్సులో పండితులతో గోష్ఠులు కావించాడు. అర్థించిన రాజుల ఆస్థానము లలంకరించాడు. పూల తోటలలో, వెలయేటి ఒడ్డున వన భోజనాలూ, వెన్నెల కొలువులూ, సాకీ అందిచ్చిన ద్రాక్షసవాలూ, శిష్యులకు పాఠాలూ, ఎడ నెడ ఒక్కొక్క రుబాయీ రచనా - ఇలాగ ప్రాయము జరిగింది.

అయితే కాల మొకే రీతిగా ఉండదు. సుఖ దుఃఖాలు పగళ్లూ, రేలులాగ తప్పవు. ఖయ్యామునకు ముసలితనం వచ్చింది. అనురాగము చూరగొన్న ఆప్తమిత్రులూ వెళ్ళిపోయారు. వాటితో పూలకారు పోయింది. జీవిత మనే పాత్రికలో ఆసవ మడుగంటింది.

"పువ్వులకారు రాకలకు పోయెడి సీతులకున్ రసోజ్జ్వల జ్జీవిత కావ్య వక్త్రముల చెచ్చెర త్రిప్పిన" ఖయ్యామునకు శోకభారము దిగ ద్రోయగలిగి వది ఒక్క ఆసవమే మిగిలినది. అయితే, దిగులు పడ్డాడా? ఇంక "ముది కాయము లేతగిలంగ క్రావెవన్" అన్నాడు. శత్రువు లైన ఇస్మయీలి యాలు ప్రభువులై నానా కష్టాలూ పెడుతుంటే, 'రుస్తుంజా శత్రు వైనా కుంగిపోను, హాతింతాయి మిత్రు డైనా పొంగిపోను" అన్నాడు. ఇతను మారేండ్ల పండు ముసలియై ఒకనాడు తోటలో విహరిస్తూ ఒక శిష్యునితో అంటాడూ: "ఇట్టి చోట నా గోరీ ఉంటుంది తెలుసునా? ఏడాదికి రెండు సార్లు చెట్లూ, లతలూ నా గోరీపై పువ్వులూ, ఆకులూ రాలుస్తాయి" అని. ఖయ్యామ్ గోరీ విషాపూర్‌లో ఒకతోట గోడవారను, చల్లపి చెట్ల నీడను నేటికీ ఉన్నది. తొలి ప్రొద్దులా, మలిసందెలా పూలతావుల ఒరువుతో అలసానిలము ఆప్యాయంగా వచ్చి అతని సమాధి పైన నేటికీ సుమ దళాలను విసిరి విసిరి పోతూంది. పెట్టి పుట్టినవాడు ఖయ్యామ్!

ఇక మరణానంతరము కూడా ఆ సమాధిని చుట్టి అలరు వాసన అలము కొన్నట్లే అతని కీర్తి ప్రపంచ సాహిత్యలోకం అంతా ప్రసరించింది. ఫిర్దౌసీ, సాదీ, నిజామీ, రూమీ, జామీ పారసీ కవులలో దిగ్దంతులు. హాఫీజ్ వీరిని మించిన ప్రభువు. అయినా ఉమర్ ఖయ్యామునకు లభించిన కీర్తి వీరికి రాలేదు. అంతే కాదు. మరి లోకంలో ఏ ఇతర మహాకవి కావ్యమున్నూ ఇతని రుబాయీలు అనువదింపబడి నన్ని భాషలలోకి అనువదింపబడ లేదు.

ఈ ప్రతిష్ఠకు కారణం ప్రపంచ భాష అయిన ఇంగ్లీషులోకి ఫిట్జ్‌గెరల్డ్ అంతటి ఘటికునిచేత అనువదింపబడడం అని కొందరు అనుకోవచ్చు. అది కొంతవరకు నిజమే కావచ్చు.

ఉమర్ ఖయ్యామ్ ఆంగ్లంలోకి వచ్చిన కాలంలో అంత ఆకర్షించిన కావ్యం ఇంకొకటి లేదు. పాశ్చాత్యలోకంలో కాప్రదృష్టి, హేతువాదమూ

ప్రబలుతున్న రోజు లవి. ఆవిరి యంత్రం నిర్మింపబడ్డది. విద్యుచ్ఛక్తి యంత్రాలు వచ్చాయి. పరిశ్రమలు వృద్ధి పొందుతున్నాయి. డార్విన్, హక్స్‌లీ, స్పెన్సర్ సృష్టి తత్త్వాన్నిగూర్చి విచారించి పరిణామ సిద్ధాంతాన్ని ప్రకటించారు. ప్రజలలో పారలౌకిక చింత సడలింది, ఐహిక చింత హెచ్చింది. మూఢ విశ్వాసాలు మాయమౌతున్నాయి. పూర్వ మతాలు కూకటి వేళ్ళతో కదలడం మొదలు పెట్టాయి. చదువుకున్నవారికి ప్రకృతి శాస్త్రాలమీద ఇష్టం ఎక్కువ అయింది. 'స్వర్గమూ, నరకమూ అంటూ లేవు, ఈ శరీరం పోయాక ఆత్మ నిలవదు. దైవాని కున్నా యని చెప్పే శక్తు లన్నీ ప్రకృతివే!' అనే అభిప్రాయాలు ప్రబలం అయాయి.

ఆ సమయంలో "నీ కను మోసల నున్నదియే నిజమ్ము" అన్న ఖయ్యాము వాణి నవ్యంగా, స్వచ్ఛ సుందరంగా వినబడింది. తమ వైజ్ఞానిక భావాలు ఖయ్యాము కావ్యంలో ఉన్నట్లు చదువరులకు అనిపించింది.

అయితే నాటి ఖయ్యాము ఆకర్షణ నేటి వరకూ తగ్గ లేదు. అంతే కాక పాశ్చాత్య దేశాలలోనే కాకుండా ప్రాచ్య దేశాలకు కూడా అతని కావ్యాలకు అంత ప్రభావం ఎందుకు ఉంది? దీనికి కారణ మేమిటి? మానవుని మెదడు మేలుకొన్నది మొదలుకుని ఒక జిజ్ఞాస తప్పడం లేదు. ఈ జీవితం అంటే ఏమిటి? మానవులలో ఇన్ని రకాలూ, ఈ తేడాలూ ఎందుకు? ఎక్కడినుంచి వచ్చాం, ఎక్కడికి పోతున్నాం? చావుతో అంతా సమాప్తా, తరవాత ఏ దైనా ఉందా? ఇదంతా సృష్టించినవా డొక డున్నాడా, ఏ ఉద్దేశంతో ఇదంతా సృష్టించాడు? ఈ ప్రశ్నలు అనాదిగా అంకురించడం, రక రకాల సమాధానాలు చెప్పుకోవడమూ జరుగుతూనే ఉంది. వివేకవంతులూ, మేధావులూ ఎండరో ఈ సమస్యల పరిష్కారం కోసం తల క్రిందుగా తపస్సులు చేశారు. అయితే మానవుని మనస్సులో సందేహాలు సందేహాలుగానే ఉంటున్నాయి. కవితలు కవితలుగానే ఉంటున్నాయి. మెదడును తృప్తి పరచే వేదాంతా లెలాగున ఉన్నా, హృదయానికి శాంతి నిచ్చే దేదో ఉండాలి

గదా: ఏ మానవు డైనా ప్రస్తుతం కోరేది సుఖం గాక మ రేం ఉంది? వికానికి అన్ని విశ్వాసాల అడుగునా, వివిధ మతాల వెనకా, అందరిలోనూ ఒకటే ఆకాంక్ష ఉందనిపిస్తుంది – ఉన్నంతకాలం సుఖంగా ఉండా లన్నది. అందుకనే – "పోయిం దేదో పోయింది, వచ్చే దేదో తెలియదు; ఈ క్షణమే విజం, ఇప్పుడు హాయిగా ఉండు" అని ఎవరూ చెప్పలే నంత సొగసుగా, బిగువుగా చెప్పిన ఖయ్యాము అందరకూ ఆప్త డయ్యాడు

ఖయ్యాము కాలము నాటికి సూఫీ మతం బాగా వ్యాపించి ఉంది. ఈ మతస్థులు భోగాలు వదులుకుంటారు, వేదకనం స్వీకరిస్తారు, ఎప్పుడూ దైవ ధ్యానంలో మునిగి ఉంటారు. ఆత్మ పరమాత్మ ల ఐక్యం కోసం సాధన చేస్తారు. వీరి భాషలో ఆసవ మంటే బ్రహ్మము; మె: భగవంతుడు ప్రియ. హఫీ జన్నాడు కదా:

"మరల హాఫిజ్ మరల మధుపాత్ర మధుపాత్ర
మరి మరి ప్రియాన నాన్వేష ణోత్సవ యాత్ర
ఏనాడో ఏవింత సీమలోనో తొలంగు
నీ క్షిమా దృఢహస్తములనే సఖి, ముసుంగు!"

అవి. ఈ సూఫీలలో గొప్ప భక్తులూ, మహాకవులూ ఉన్నారు. అయితే ఎట్టి మత మైనా క్రమంగా గడ్డకట్టుకు పోతుంది. పెట్టి ఆచారాలకు కట్టుపడి పోతుంది. కపట వ్యాపారాలకు ఆవాసం అవుతుంది. అలాగే సూఫీ సమాజంలో వేషధారులు బయలు దేరారు. ఒకరు తామే పావనుల మను కోడం మొదలు పెట్టేరు. ఇట్టి వారిమీద జనానికి గౌరవం ఉండదు. అన్ని అహంకారాలకంటె సహించరాని అహంకారం నీతికీ, మతానికీ సంబంధించి నది. ఖయ్యాముకు ముందే ఇబిన్ సినా అనే ప్రతిభాశాలీ, బహుశాస్త్రవేత్తా, పండితకవీ ఉండేవాడు. ఇతడు ఒకరాత్రి భోగానుభూతితో, ఇంకోరాత్రి విజ్ఞానార్జనంలో గడిపేవాడట. ఇతడే నాటి మత విశ్వాసాలమీద ధ్వజం

ఎత్తి, ఎన్నో గ్రంథాలు వ్రాసేడు. ఇతని ప్రభావం ఖయ్యాముమీద ప్రసరించి ఉండవచ్చు. ఖయ్యాము తన కావ్యంలో సూఫీల పరిభాషనూ, సాంకేతికాలనూ ప్రయోగిస్తాడు – ద్రాక్షాసవమూ మొదలైనవాటివి. కాని, కొన్ని రుబాయీలు చదవగానే ద్రాక్షాసవము ద్రాక్షాసవమే గాని సాంకేతికము కాదని మనకు తోస్తుంది.

ఖయ్యాము మతం ఇది : ఈశ్వరుడు ఉన్నాడు. ఆత్మ లేదు. కుమ్మరి కుండల్ని చేసినట్లు దేవుడు లోకాన్ని సృష్టిస్తాడు. కుండ పగిలాక మన్నులో కలిసిపోతుంది. ప్రాణం పోయాక శరీరం భూమిలో కలిసిపోతుంది. ఆ మన్ను మళ్ళా కొత్త దేహం నిర్మించడానికి వినియోగ పడుతుంది. ఈ నెలయేటి కోవను మొలిచిన లేత పచ్చికమీద మోటుగా కాలు అనకు. ఇవి ఏ కోమలి శరీర మృత్తికనుండి చిగురించినవో! ఇక తాను కావించే కార్యాలకు మానవుడు బాధ్యుడు కాడు. దేవుడు శరీరమూ, మనస్సూ కూడా సృష్టించాడు. మన కార్యాలను మనస్సే ప్రేరేపిస్తుంది. ఇక పాపాలు చేశా మని దేవు డెలాగ దండిస్తాడు? మనస్సు నెందుకు సృష్టించాడు? కుండ ఓటి దైనా, పాత్ర సొట్టపోయినా తప్పెవరిది? సృష్టి కాల బద్ధం. విధి తప్పదు గతం మరిరాదు. భవిష్యత్తంతా సంశయం. వర్తమానం అవశ్య భోగ్యం. ఇది వసంతం. ఇది ప్రభాతం. సుమలత కపోలం హిమ పాండుర మయింది. మరక తాసనం మీద గులాబి కొలు వున్నది. ఇది తియ్యని వేళ. ఈ పచ్చని గరిక తివాసీమీద వెచ్చని మధురాసవం తాగు. తొందరపడు. మనల దీ ప్రొద్దు. రేపు సీమీదనే పచ్చని గడ్డి మొలుస్తుంది సుమా! స్వర్గమూ లేదు, నరకమూ లేదు. ఆనందం ఇచ్చే వస్తువుల్ని స్వర్గంలో ఉంటా యంటారు. వాటిని ఈ లోకంలోనే అనుభవించు. చేజేతా చేసిన పాత్రను నీవే చిన్నభిన్నం చేస్తావా? దేవు డున్మత్తుడా? తన సృష్టిని తానే ఎందుకు భగ్నం చేస్తాడు? ఉహూఁ. ఈ సందేహానికి నివృత్తి కనపడదు. ఎన్ని చిక్కులో పడల్చవచ్చును. ఎన్ని చిక్కులకో లోబడక పోవచ్చును.

మరణ రహస్యబంధం విప్ప లేక విసిగి పోతావు. అయినా అనుతాపం మాత్రం వద్దు. ఏ నిశీథ సమయాన్నో అనుతాపం రావచ్చు. ఆనంద ప్రభాతం వచ్చి దాన్ని తుత్తునియలు చేసి విసిరి పారెయ్యాలి. పూజలూ, వమాజాలూ ఏ కష్టాలు పోగొట్టవు. విధి తప్పదు, తప్పదు. అంతే!

విరాగివాది నంటా వేమో! కాదే! సుఖదుఃఖ మేళనం జీవితం. సాధ్యమైనంతవరకు సంతోషాన్నే అనుభవించు. తప్పని మరణానికి తల్లడిల్లకు. తోసుకు వచ్చిన దుఃఖాన్ని ధీరుడవై అనుభవించిపారేయ్. సీజరులూ, పికందరులూ, కైఖుస్రూలూ కొంత సుఖించారు. అంతలో మట్టిలో కలిసి పోయారు.

ఈలోకం పాంథశాల: ఉభయ సంధ్యలూ వాకిళ్లు. ఇక్కడకు ఎందరో వస్తున్నారు. పోతున్నారు. నీవూ అంతే! కనుక ఇదే ఇరామ్ - నంద నారామం. ఇక్కడే కౌసర్ - మధుప్రవంతి, మందాకిని. ఈ గులాబీ పొద పక్క విశ్రమించు ఒక్క రొట్టె, ఒక్క కావ్యము, పక్కన నర్గీస్ పూలవంటి కళ్ళతో, అరుణ వారుణీ పాత్రతో, గాలి కదిలించే జులపాలతో, గులాబీ చెక్కిట పట్టు మచ్చతో రాగవతి ప్రేయసి, పైనుంచి బుల్ బుల్ తాగు తాగు తాగు అని హెచ్చరిస్తుంది. ఈ క్షణం పోనీకు, తాగు! అంటే ఏ క్షణాని కా క్షణం హాయిగా జీవితం సాగించు - అంటాడ ఖయ్యాము.

ఖయ్యామును కొందరు ఎపిక్యూర్ అంటారు. కాని ఎపిక్యూస్, ఖయ్యాముల భావాలలో కొంత తేడా ఉంది. ఎపిక్యూరస్ నిరీశ్వరవాది, ఖయ్యాము కాదు. ఎపిక్యూరస్ విధి లేదంటాడు. ఖయ్యాముమన సుఖ దుఃఖాలు విధిచేత నిర్ణయింపబడ్డా యంటాడు. ఒక్క భగవంతుని విషయంలో తప్ప చార్వాక మతావికిన్నీ, ఖయ్యాము మతానికిన్నీ ఏమీ తేడా లేదు.

ఖయ్యాము ది రంగు రంగుల మూర్తి. ఆకర్షవంత మైన వ్యక్తిత్వం ఇతనిది. ఇతన్ని గూర్చి ఎన్నో మనోహర మైన గాథ లున్నాయి. నిషాపూర్‌లో ఒక గొప్ప ఇమామ్ ఉండేవాడు. ఆయన దగ్గర చదువుకున్నవారు అదృష్టవంతు లవుతా రనుకునే వారు. ఆయన శిష్యుల్లో నిజామ్‌ుల్ ముల్క్, ఉమర్ ఖయ్యామ్, హసన్ బిన్ సమాన్ -ఈ ముగ్గురూ ఒక్కసారే చదువుకునే వారు. వీరు ముగ్గురూ గట్టి స్నేహితు లయారు. ఒకనాడు, హసన్ - 'ఇమామ్ సాహెబ్ దగ్గర చదువుకొన్నవారు అదృష్టవంతు లవుతారు. మన ముగ్గురిలో ఏ ఒక్కరైనా కావచ్చు కదా. అతడు మిగిలిన ఇద్దరినీ సమానులుగా చేసుకోడానికి ఒప్పందం చేసుకొందాం' అని అన్నాడు. కొంతకాలం జరిగింది. నిజామ్‌ుల్ ముల్క్ బాగ్దాదు సుల్తాను వజీ రయ్యాడు. ఉమర్ ఖయ్యామ్ ఒకనాడు నిజాముల్ ముల్క్‌ని కలుసుకున్నాడు. వజీ రతనిని గౌరవించి, "మీరు చాలా గొప్ప పండితులూ, మేధావంతులూను. మీ రేదైనా గొప్ప రాజోద్యోగం చెయ్యాలి. మన షరతు జ్ఞాపకం ఉంది కదా! పాదుషాతో మనవి చేస్తా. మీరూ గొప్ప పదవికి రావచ్చు" అని అన్నా రట. ఖయ్యా మిలా బదులు చెప్పాడు: "మీరు గొప్ప కులీనులు, కరుణార్ద్ర హృదయులు. తమ కసాధ్య మైన పని లేదు. మీ శ్రద్ధకు నేను కృతజ్ఞుణ్ణి. నా కొక రొట్టే, ఇన్ని నీళ్ళూ చాలు. విద్యార్థులకు పాఠం చెప్పుకుంటూ గ్రంథ కాలక్షేపం చేసుకుంటా. రాజుల కొలువు నాకు వద్దు. సెలవు ఇప్పించండి". నిజామ్‌ుల్ ముల్క్ తన స్నేహితుణ్ణి మరీ మరీ కొగిలించి పన్నెండు వందల తోమానులు ఆదాయం వచ్చే జాగీరును స్వీకరించి అనుగ్రహించ మని కోరి. అట్టే పంపించాడు.

ఈ రొక గాథ: గ్రహగతులను బట్టి, వాయు వర్షాలు ఎలా ఎప్పుడు వస్తాయో తెలుసుకునే శక్తి ఖయ్యామ్‌కు ఉండే దట. మెర్వ్ పాదుషా వేటకు బయలు దేరుతూ వర్షమూ, మంచూ కురవని దినం నిర్ణయించ మని ఖబర్ చేశాడట. ఫలానా దినము బాగున్న దని ఖయ్యాము చెప్పేడు. కాని

ఫాదుషా వేటకు బయలుదేరడ మేమిటి, ఆకాశం అంతా మబ్బులు క్రమ్మ కుని మంచు కురవడ మేమిటి; నలుగురూ ఎగతాళి చేశారు. ఫాదుషా వేట మానుకుందాం అనుకున్నాడు. ఖయ్యాము, "ఏం భయం లేదు. బయలు దేరండి. మబ్బును చెదరగొట్టే గాలి రాబోతూ ఉంది. అయిదు రోజుల దాకా నేల తడైనా కాదు" అన్నాట్ట. పై కథల్లో ఒకటి అతని స్వాతంత్ర్యాపేక్షి, రెండవది అతని శాస్త్రవేత్తృత్వం తెలియ పరుస్తాయి. అతని జ్ఞాపకశక్తి కూడా గొప్పది.

ఇస్పహాన్ నుకాములో ఉండగా ఒక గ్రంథం ఏడు సార్లు చదివి విషాపూర్‌కు వచ్చాక, ఆ పెద్ద గ్రంథం యావత్తూ తిరిగి నకలుగా వ్రాసేశాట్ట. ఇక మనకు ప్రియుడైన ఖయ్యాము యొక్క [illegible] పెట్టే గాథ ఒకటున్నది. పూర్వాచార పరాయణుడు కానివీ, ఓస్తాం మిలాచారాలకు దూరుడనీ ఖయ్యామును గూర్చి ఒక వదంతి ప్రజలలో వ్యాపించి ఉన్నది. శత్రువులు తన ప్రాణా లెప్పుడు తీస్తారో అని ముక్కోయాత్ర చేస్తాడు ఖయ్యామ్. చేసి తిరిగి వచ్చి ఇలా అంటాడు:

"కలపయు మట్టి రాల నిడి కట్టిన దేవళమందు నీకు ఏ
ఫలము లభించు? ప్రేమరసభావ యుతుడవ యేని కామినిన్
వలవుము, ప్రాణహీన మగు బండలు వేయిటికన్న శ్రేష్ఠమై
అలరు గదా మనుష్యహృదయంబు ప్రతిప్రణయానురక్తులన్."

—రేడియో ప్రసంగం, 24-4-1955.

8

చిత్తరంజన్ దాస్

మనిషి కృతఘ్నుడు అనను; అయితే మనిషికి మరుపు మాత్రం ఎక్కువ అంటాను. లేకపోతే అదే పనిగా యీ స్మరణ సభలూ, వదే పదే యీ స్మృతి చిహ్నాలూ దేనికి? మరిచిపోయినవాళ్ళను జ్ఞాపకం చేసుకుందుకు. అంతేకాదూ? బాగా ఆప్తులుంటారే, బొత్తిగా గుండెలకు పెనవేసుకుపోయినవాళ్లు. వాళ్ళని తప్పిస్తే కనుచూపు దాటిపోయినవాళ్ళందరూ మనస్సులోగూడా మాసిపోతారు. ఒక్కొక్క తరుణంలో, దేశంలో ప్రతీ వాణ్ణీ తుఫానులాగ ఊపిపారేసే ప్రబలుడుంటాడు. వాడి పేరూ, వాడి కథలూ జనాన్ని పిచ్చెత్తిస్తాయి. అతగాడు లోకరంగంనుంచి అదృశ్యు డవుతా డనుకోను. ఇహ క్రమక్రమంగా అతని మూర్తీ, అతని చరిత్రా, దూరంగా వెళ్ళినకొద్దీ అస్పష్టమైపోయి, ఆకాశంలో కలిసిపోయే కొండలా గైపోతాయి. తరువాత అప్పు డప్పుడు స్మృతి సభల్లోనూ, సమకాలికుల నెమరువేతల్లోనూ బయటపడుతూంటాడు – అంతే!

పాపం, కొన్ని రంగాల్లో పనిచేసివవాళ్ళు మన మనస్సుల్లో మరీ త్వరగా చెరిగిపోతారు. అయితే, దేశ చరిత్రను దిద్దినవాళ్ళూ, దేశ భాగ్యాన్ని నిర్మించినవాళ్లూ కొందరు అంతగా తుడిచిపెట్టుకుని పోరు. చిత్తరంజన్ దాస్ విలిచిపోయేరకం!

30 ఏళ్ళ క్రితం – అంటే – మనం స్వాతంత్ర్యోద్యమ మంటామే, అది ముమ్మరంగా ఉన్న రోజుల్లో కొందరి పేర్లు ప్రతి భారతీయుడూ మంత్ర ముచ్చరించిన ట్లనేవాడు. లాల్ బాల్ పాల్ అనేవాడు. సురేంద్రనాథ్ బెనర్జీ అనేవాడు. అంటూంటే కళ్లు ధగధగ మనేవి. వింటూంటే ఒళ్లు జలజల

మనేది. తరవాత అలాగే ఆలీ సోదరులూ, మోతీలాల్ నెహ్రూ, పటేల్ సోదరులూ ఇక్కడ ప్రకాశం, వేంకటప్పయ్యపంతులూ దేశాన్ని ఆవేశ పరచేవారు. ఇలాంటి జగజెట్టుల్లో గూడా ముందుకు తోసుకొచ్చి నిలబడ్డ వాడు చిత్తరంజన్ దాస్.

19 వ శతాబ్దిలో పుట్టిన ప్రముఖులు అందరకం పెద్దతరహావాళ్ళు. వీళ్లల్లో ఒక ఔన్నత్యమూ, గాంభీర్యమూ ఉండేవి. అంటే అందరూ గూడా ఓ పెద్ద కొండలా గుండేవారేమో – పెద్ద యెత్తైన శిలా విగ్రహం లాగ. ఉహూఁ. అవి కాదు నా అభిప్రాయం. పెద్దతరహా అంటే కొందరు మహాపురుషులు సరస్సుల్లా గుంటారు – మన పక్కనే, మన కంటబాటులో కదలకుండా చల్లని నీరూ, అవీ యిస్తూ – మనకి తెలిసిపోతూ. మరి కొందరు నదుల్లా గుంటారు. వీళ్లూ, పక్కనే ఉంటారు. అందుబాటులో ఉంటారు. వీళ్లూ చల్లని నీరూ అవీ యిస్తారు. అయితే ఎక్కడి నుంచి వచ్చారో, ఎక్కడికి వెడుతున్నారో తెలియనీయకుండా ఉంటారు. కొందరు పువ్వులతో, పళ్లతో, నవ్వైపులా చాపుకున్న చేతులతో పెద్ద చెట్లలా ఉంటారు. సరే, కొందరు పర్వతంలాంటి వాళ్లూ ఉంటారు. అయితే, ఇందాకా చెప్పినట్టు 19 వ శతాబ్ది వాళ్లందరిలోనూ ఓ పెద్దతనం ఉండేది అంటే చెరువైతే పెద్ద కాసారంలాగా, చెట్టయితే పెద్ద వటవృక్షం లాగా నున్నూ ఉండేవాళ్లన్నమాట. వాళ్లు జైంట్స్ అనిపించేది. వాళ్లేదో ఉద్దేశంతో బతికిన ట్టుండేవాళ్లు. వాళ్ల ప్రయాణానికి గమ్యస్థానం ఉండేది దనిపించేది. అక్కడికి పనిగట్టుకుని మార్గం దిద్దుకునే వాళ్లు వాళ్లు. అక్కడికి వెళ్లేదాకా కావలసిన దారిబత్తెమంతా ఓ సంచీలో కూడబెట్టుకున్న ట్టుండే వాళ్లు. ఇలాంటి కొన్ని గుణాల్లో వాళ్లు మనకన్నా దిట్టలేమో మరిఁ చిన్నదో, పెద్దదో, వాళ్లు జీవితాన్ని ఒక యిల్లులాగ కట్టుకునే వాళ్లు. టిప్స్ లాగ దేశాల్లో ఉండేట ట్టుండేది కాదు వాళ్ల జీవితం .... ఇక్కడ నుంచి అక్కడకు, అక్కడనుంచి ఎక్కడికో పోతూ.

చిత్తరంజన్ 19 వ శతాబ్ది దిట్టల్లో కల్లా దిట్ట. ఈయన బెంగాల్‌లో పట్టాడు 1870 లో. 1925 లో పోయాడు. అనాటి పెద్దల్లో ఇంత త్వరగా ఎవరూ వెళ్ళిపోలేదు. పాపం, ఏభై యైదేళ్లేగా ఆయన జీవించింది! 1923 లో కాకినాడలో జాతీయమహాసభ జరిగినప్పుడు వచ్చాడు – ఒక స్పెషల్ ట్రెయిన్‌లో, కొన్ని వందలు పరివారంతో–అంతవరకూ అమలులో ఉన్న కాంగ్రెస్ కార్యపథకాన్ని మార్చడానికి. రెండో పక్షంలోనూ ఉద్దోలు లున్నారు. అయితే చూసిన వాళ్ళ కీయన నెలా కనబడ్డా డంటే – ఇందాకా చెప్పానే – ఆ పర్వతంలాగ, కావలసింది సాధించి తీరే ప్రభువులాగ, దారిలో వచ్చే మళ్లూ, గోతులూ, రాళ్లూ, చీకట్లూ, గోడలూ అన్నీ తొక్కుకు పోయేవాడిలాగ. ఆ ప్రాభవం కొట్టొచ్చిన ట్టగుపించింది మా టోటి యువ కులకు. మహా అభిమానిలాగ కనబడ్డాడు మాకు. ఏమి గర్వం, ఏమి తీవి – అనుకున్నాం. అంతవరకూ సాగిన ఆయన చరిత్ర తెలుసుకున్న దాకా తోచింది కాదు. అప్పుడు విన్నాం – ఏమని?

ఈయన తండ్రి కలకత్తాలో ప్రముఖ న్యాయవాదిగా ఉండేవా డనీ, ఈయన గూడా బారిస్టర్ పాసయ్యా డనీ, ఇష్టం వచ్చినట్టు ఖర్చుపెట్టడం వల్లా, కారణాంతరాలవల్లా తండ్రిగారు అప్పులపా లైతే తానూ తండ్రీ ఇన్‌సాల్వెంట్స్ అయారనీ, తరవాత తాను లక్షలార్జించడం మొదలుపెట్టాక వెనకటి అప్పు లన్నీ - అవి తీర్చనక్కర లేకపోయినా ఈ అభిమాని తీర్చి పాడేశా డనీ, అప్పుడు దేశం యావత్తూ ఆశ్చర్యచకితం అయిపోయిం. దనిన్నీ, తరవాత ఆలీపూర్ కేస్‌లో శ్రీ అరవింద మొదలైన ముద్దాయిలకు న్యాయవాదిగా ఉండి తన ప్రతిభ ప్రకటించా డనిన్నీ. దానితో మరీ గొప్ప లాయరై మరీ కొల్లలుగా గడిస్తూ అనేక సంస్థ కు, విద్యార్థులకు, కష్ట జీవులకు ఆ ఆర్జన యాచిస్తూ కుడి, యెడమ చేతులతో పంచిపెట్టి పారవేసేవా డనిన్నీ, ఆయన ఇల్లొక పెద్ద సత్ర మనీ, ఆయన వంగప్రజకు ప్రియతము డనిన్నీ, ఆయన కాంగ్రెస్ సభల్లో మొదట మహాత్ముని అసహాయోద్యమాన్ని

వ్యతిరేకించాడనిన్ని, క్రమక్రమంగా దానిని స్వీకరించి తానూ, తన భార్యా, చెల్లెలూ, ఒక కొడుకూ అందరూ జైలుకి వెళ్లారనిన్ని, ఇంకా ఎన్నో ఎన్నో ఇలాంటి గాథలు విన్నాం అప్పుడు. "చిత్తరంజన దాసు, చిన్నారి కొడుకునీ – చెయి విరిచి చెరబెట్టినారూ" అని గూడా పాడాం. మే మప్పుడు చిత్తరంజన్ దాస్ వీరుడు అనుకున్నాం. ఆ్యాగు లందరూ వీరులు కారు నిజానికి.

ఇంచాకా అనుకున్నాం గదా, గొప్పవాళ్లలో రకరకా లుంటారని – సాధుసత్తములు, ఉత్తములు – మన దేశభక్త వేంకటప్పయ్యగారిలాగ, కార్యచతురులు – వల్లాయి పటేల్‌లాగ, మేధావులు – లోకమాన్యునిలాగ, ఇలాగ ఇలాగ రక రకాలు. చిత్తరంజన్ దాస్ వీరుడు. వీరుడికి ముందు వెనక లెంచుకోవడం, కేలిక్యులేషన్, తటపటాయించడం ఉండదు. సమర వీరుడు, దాన వీరుడు, ధర్మవీరుడు – ఎవడైనా అంతే: ఎదిరి బలం, తన బలం ఎంచుకోవడం ఉండదు. పోరాడ వలసిందే, గెలిచితీర వలసిందే. తన కలిమీ, తన భావీ తూచుకోవడం ఉండదు. ఇచ్చిపారేయవలసిందే. ఈ వీరుడికి యుద్ధం చేయడం సహజగుణం. వీనికి ఈవి పువ్వునకు తావి. అంతే: ఒక్కొక్క దాత ఉంటాడు. ఇస్తాడు. అడిగిన దంతా గూడా ఇవ్వొచ్చు. అయితే ఆ ఈవికి వెనక కాస్త కీర్తికాముమో, రవ్వంత మోక్ష దృష్టో ఉండొచ్చు. ఆ ఈవికి వెనక తన భావికోసం ఓడుపు గూడా ఉండొచ్చు. వీళ్ళు ఎట్టి దాతలైనా కావచ్చు – దానవీరులు కారు. వీళ్ళకి లోక మెంతేనా ముఖపడి ఉండొచ్చు – వీళ్ళ గాథలు కావ్యాలు కాలేవు. చిత్తరంజన్ దాస్ దానవీరుడు:

తరవాత 1925 లో మరి మూడునెల్లకు చనిపోతా దనగా మిగిలిన ఆస్తి యావత్తూ – కోట్లు గడించినవాని కిది బహుకొద్ది – దేశానికిచ్చేశాడు. నూరేళ్లు జీవించవలసినవాడు 55 ఏళ్లే జీవించి, వగిగి, చితికి ప్రాణమే ఇచ్చేశాడు దేశానికి – అంతే: ఆదీ అతని ధోరణి:

చిత్తరంజన్‌ని గూర్చి ఇలా చెప్పుకోవలసిన వెన్నో ఉన్నాయి- కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా కావడం, ఆంగ్లేయుల్ని హడలెత్తించడం ఇలాగే ఎన్నెన్నో.

చిత్తరంజన్ మహా వక్త. మొదట న్యాయస్థానాల్లోనే ఈయన వాగ్ధాటి అప్రతిహతంగా ఉండేది. తరవాత రాజకీయ సభల్లో ఆ కంఠస్వరం, ఆ వాణి జనాన్ని ఊగించేసేది. గయా కాంగ్రెస్ అధ్యక్షపీఠం నుంచి ఆయన చేసిన ప్రసంగంలో తుది వాక్యాలు ఆయనవే వినిపించాలని ఉంది – ఎలాగా:

"సీది ధర్మసమరం సుమా. నీవు సాధించే విజయం సామాన్య మయింది కాదు. నిన్ను నీచపరచేది కా దా విజయం. దాని వల్ల లభించే ప్రాభవం నీ హస్తాల్లోనే గుప్త పరచుకో లేవు. నీది ధర్మసమర మైతే నీ అస్త్రాలు గూడా ధర్మయోధునికి ఉచిత మైనవి. నీ కాగ్రహం పనికి రాదు. ద్వేషం పనికి రాదు. నైచ్యం, అల్పత్వం, అసత్యం నీ దగ్గరకే రాగూడదు. ఉషస్సులో తొంగిచూసే అశ నీది. ప్రభాతంలో భాసించే విశ్వాసం నీది.

"ఆ గ్రీక్ గాథలో వస్తాడే ప్రైటాన్ – మానవుడికోసం బంధితుడైన వాడు, వాడి కంఠరవం వినిపించిన ఆ గేయం – అది నువ్వు గూడా పాడు ! ఏమనీ ?

ఆశ కూడా అతీతమైన కష్టాలను పడ్డం,
రాతిరికన్నా మృత్యువుకన్నా నల్లనైన అన్యాయాలను
క్షమించడం,
ఎదిరించడానికి గూడా వీలులేనట్టు కనబడే శక్తిని
తృణీకరించడం,
ప్రేమించడం - ఓర్మితో సహించడం,
శైథిల్యం నుండి జరనుండి నవ జీవనాన్ని సృష్టించుకోవడం -

చలించకపోవడం - నీ మార్గం నుండి తప్పుకొనకపోవడం,
నీరస పశ్చాత్తాపంతో క్రుంగకపోవడం -
ఇవి - ఇవన్నీ కలిపి - ఇదీ ధర్మ మంటే -
ఇదీ గొప్పగా బ్రతకడ మంటే -
ఇదీ ఆనంద మంటే - సౌందర్య మంటే -
నిర్భయ స్వచ్ఛంద జీవిత మంటే ఇది -
ఇదే జీవితం - ఇదే సామ్రాజ్యం - ఇదే విజయం!"

విన్నారా! కొంతయినా స్ఫురించిందా చిత్తరంజన్ ప్రసంగ ధోరణి? అయ్యయ్యో, ఆయన మాటలే వినిపిస్తే బాగుండు ననిపిస్తుంది నాకు.

చిత్తరంజన్ మంచి కవి. ఈయన కావ్యాలు వంగభాషలోనే వ్రాసేడు. ఈయన 'సాగర సంగీత' మనే కావ్యాన్ని మాత్రం శ్రీ అరవిందులు ఆంగ్లంలోకి అనువదించారు. చిత్తరంజన్ సాహిత్యలోకంలో అడుగు పెట్టేసరికే రవీంద్రుని ప్రభావం వంగకవులపై ఎంతేనా ఉంది. మొదట చిత్తరంజన్‌పై గూడా అది ప్రసరించింది. సంస్కృత సాహిత్యం, మధ్య యుగపు వైష్ణవ గీతాలూ, సూఫీ రచనలూ, ఆంగ్ల కావ్యాలూ వీటన్నిటి వలుకుబడీ నాటి వంగ రచయితలపై తీవ్రంగా ఉండేది. చిత్తరంజన్ నెమ్మదిగా ఆ ధోరణి వదులుకున్నాడు, పూర్వ వంగకవుల ధోరణికి - చండీదాస్, విద్యాపతుల మార్గానికి తన పద్ధతి తిప్పుకున్నాడు. నాటి రవీంద్రుని ప్రభావం నుండి ఒక పట్టాన బయటపడ్డం కష్టం. అయినా చిత్తరంజన్ అలా చేసి నెగ్గాడు.

"ఇతన్ని వంగకవుల ప్రథమశ్రేణిలో నిలబెట్టలేం. ఇతడు కొత్త కావ్య వస్తువులను ఎన్నుకోలేదు. కొత్త ఛందోమార్గాలను తొక్కలేదు. కొత్త సందేశాలను ఇవ్వ లేదు. వ్రాసింది తక్కువ కూడా!" అని కొందరు విమర్శకులు అనవచ్చు గాని - అతని కావ్య లన్నిటిలోనూ మనోహరమ్మా,

సుకుమారమూ అయిన పరిసరం ఒక టుం దనిస్నీ, అమరు లైన వంగ కవుల్లో అత దొక దనిస్నీ విజ్ఞు లంటారు.

ఇతని మొదటి కావ్యం 'మాలాంభ' -- అంటే ఆరామం. భావ కావ్యాల సంపుటి. సౌందర్య మంటే మహోయిష్టం, జీవిత మంటే పట్టపగ్గా లేని ఆసక్తి. సుఖదుఃఖాల లోతులు అంటకోవా లనే కాంక్ష. ఇవువంటివి ఈ ఆరామంలోని ఖండకావ్యాలలో స్ఫురిస్తాయి. వీటిలో కాంతి, చల్లదనం తక్కువ.

తరవాత - 'లైఫ్ ఆఫ్ ఏ హార్లట్' -- 'పిట్టా జీవితం' అని మరో కావ్య సంపుటి. ప్రతిఫలం దొరికని ప్రేమ, చితికి పోయిన ఆశ, వీటి మీద కవి మన స్పెక్కువ పరుగెత్తే చా రోజుల్లో. సృష్టిలో కనబడే అన్యాయాలూ, విప్పలేని రహస్యాలూ, పుడుతూ ఈ కవి హృదయా న్నప్పుడు నలిపేసినట్టు కనిపిస్తుంది.

"ది స్ట్రగ్గిల్ సోల్ లేస్ డౌన్ ఇట్స్ బర్డెన్ ఎట్ దై ఫీట్ ఓ మెర్సీ ఇన్‌ఫినిట్" అంటాడు. భగవంతు ణ్ణంటూడూ, "నువ్వు మూగవు - పిలిస్తే, ప్రశ్నిస్తే జవాబు చెప్పవు" అని. ఇంకా తక్కువగా, అంటాడు "నీతో వాకు పని లే" దని.

కులటని గూర్చి వ్రాస్తూ - ఆమె అవమానం లోకానికి హాయి, ఆమె బాధ లోకానికి ఆనందం - అని ఆగ్రహిస్తాడు.

మరికొంత కాలానికి 'మాల' అనే కావ్యసంపుటి ప్రకటించాడు. దీనిలో ఆ తిక్క కనబడదు - ఆ ఎదిరించడం, ఆ అశాంతిన్నీ. ఉదాత్తమైన ఆవేశా లుంటాయి దీంట్లో. భగవంతుడు ప్రేమమూర్తిగా సాక్షాత్కరిస్తా డిక్కడ కవికి. ఆ దివ్యస్పర్శ తగిలితే తన ఇంద్రియాలు విషమైపోయి ఊగిపోతా యుంటాడు. తన అంతరంగ ద్వారం తెరిచా వంటాడు. రమ్మంటాడు ప్రభువుని. కానే స్వామి అడుగులకింద తివాచీ నైపోతా నంటాడు.

ఒక్కొక్కప్పుడు చీకటిలో నడిచిపోయే బాటసారి అనిపిస్తి, తనకోసం దూర దూరాన గవాక్షంలో దీపం వెలిగించి ఏదో అదృశ్యహస్తం పెట్టి దనిస్తి అంటాడు. పర్వత శిఖరం మీదా, తరులతలమీదా, సూర్యోదయానికి ముందు వీచే గగనాంకం మీదా పర్యటించే ఆ ఉదాసీనాంతి తనకు కావా లంటాడు.

తరవాత వచ్చిన 'అంతర్యామి' అనే కావ్యసంపుటిలో గూడా ఇదే ధోరణి.

ఆఖరుది 'సాగర సంగీతం'. దీనిలో నిశీథవసాలలో, వెలుగునీడలలో ఎప్పటి కప్పుడు మారిపోయే సముద్రమూ, ఆ మార్పులతో కవి చిత్త వృత్తులు గూడా మారడం — కవికీ కడలికీ ఉన్న బాంధవ్యం — కడలిని చూస కవి మనస్సు మారుతూంటే కవి మనస్సున కనుకూలంగా కడలి దర్శన మిస్తూండడం, ఉషఃకాలంలోనూ, ప్రభాతవేళలో సముద్రం, పండుపున్నమినాటి పయోధి, సందెవేళల సాగరం, మనిమాపు మపిరే టప్పుడూ, రాతిరి నిద్దరపోయేటప్పుడూ తానూ, అపార పారావారమూ ఒకరి వైపు ఒకరు అచంచల నేత్రాలు త్రిప్పుకొని చూసుకోవడం, మెత్తని గాలి ప్రేలుల చక్కిలిగింతలు తట్టుకోలేక అంతజలరాశి అలలు అలలుగా విరిగి విరిగి కిలకిలా నవ్వడం — దూరాన క్షితిజరేఖ వద్ద మేఘాలు సముద్ర స్నానానికి క్రిందికి దిగడం — క్రుద్ధ ప్రభంజనం పెద్ద పెద్ద అంగలు వేసు కుంటూ సముద్రంమీద నడవడం — ఉద్ధత తరంగాలు నురుగు జూలూగి స్తూ ఎగిరిపడ్డం — తరవాత సముద్రం మీద పొడుగాటి నీరెలు పాకడం — ఇటువంటి ఎన్నో ఎన్నో చిత్రాలతో ఈ కావ్యాలలో వేదకాలంనాటి ఉద్గాతల శక్తి. హోమర్ నాటి గ్రీకు కవుల ప్రజ్ఞా కొంతవరకు స్ఫురిస్తా యని ఒక రసజ్ఞు డైన విజ్ఞు డంటాడు.

దేశభక్తు డైన చిత్తరంజన్ దాసును లోకం క్రమక్రమంగా మరచి పోవచ్చునేమో కాని — చిత్తరంజన్ కవిని మరచిపోలేదు.

—రేడియో ప్రసంగం, 6-11-1959.

ప్రకాశం

['నా జీవితయాత్ర' సమీక్ష – 'శ్రీ'లో ప్రచురితం – 1948]

ప్రస్తుతం ప్రకాశం మకాం మద్రాసు గవర్నరు భవనంలో.

భక్తులైన పూజారులకు గాని స్వామి గర్భాలయం తలుపులు ఇదివరకు సడలేవి కావు.

ఇప్పుడు ముఖద్వారం తలుపులు మూతపడడమే మానివేశాయి. ఎప్పుడూ వచ్చే ప్రజా, వెళ్లే ప్రజానూ : తీర్థం :

వారిలో కాసూరి రంగడు, ఆలీబేగ్, అద్దేపల్లి అప్పడు, మస్తాన్, 'కింగ్ ఆఫ్ ఒంగోల్' నవులూరి రమణయ్య, రాజమహేంద్రవరం బెస్తలూ కూడా ఉన్నారా : అనిపిస్తుంది.

ఎందుకు ఉండగూడదు :

వీళ్లెవరో తెలుసునా : వీళ్లందరూ ప్రకాశం బాల్యంలో స్నేహితులు.

డెబ్భైయేళ్ళక్రితం, నాయుడుపేటలో సువర్ణముఖి ఒడ్డున వేంచేపి ఉన్న శ్రీ ఆంజనేయస్వాముల కారగింపుగా కోడిగుడ్లు నైవేద్యం పెట్టిన బాల భాగవతుడు కాసూరి రంగడు.

అక్కడ తోటల్లో విడిది చేసిన వెంకటగిరి మహారాజుల ఏనుగులమీద ఎక్కడానికి మావటి వానికి కానీయో, అర్ధణాయో కానుక ఇచ్చి, గజా రోహణ భాగ్యం పదేండ్ల ప్రాయంలోనే పొందిన నవాబ్ ఆలీబేగ్ బహద్దరు.

బొంగరాలూ, గోలీలూ కొనడానికి దొంగతనాలు అవసరమై, చిన్న ముఠాలు చేరదీసి ఒంగోలు నడిబజారు పీథుల్లో ఒల్లర దుకాణదారుల గల్లా పెట్టెల బిరుపు వదిలించే మేటి సర్దార ఆద్దేపల్లి ఉప్పడు.

అందరికన్నా అసాధ్యుడు నవలూరి రమణయ్య. ఇతని 'ఈట్' కంపెనీలో మస్తాన్ సాహెబ్ వంటి మహా సాహసికులు ఉండేవారు; రంగారాయుడు చెరువుకింద పండిగే పంటను రాత్రి రాత్రీ కోయించి, నెత్తిని పెట్టించి పొలం దాటించిన పోటర్లు;

ఇలాంటి వారితో అప్పుడు ప్రకాశానికి జట్టు;

కనుక ఇప్పుడు వాళ్లుంటే – ఎప్పుడూ వాళ్లూ ఉంటూనే ఉంటారు – వాళ్లది కూడా డెభ్భైఅయిదో షట్టిన రోజు రుూ ఏడాదికి ఇటో అటో పడి ఉండేదేమో;

అయినా – మొన్న ప్రధానమంత్రి• జన్మదినోత్సవం జరిగినప్పుడు వాళ్లందరి పుట్టిన రోజుల పండిగలూ జరిగినట్లే;

ప్రకాశం పెట్టి ప్రజ;

ప్రభువుల్లో కంటె ప్రజల్లోనే ఉదాత్తత ఎక్కువ ఉందంటాను. సామాన్యుని కున్న దర్జా సామంతునికే లేదు.

గద్దెమీదా, గరికెనేలమీదా ఒకే తీవితో కూర్చోగలిగిన వాడిదే హుందా.

వాడికి ఒక కనుపు సింహాసనం గౌరవం ఇవ్వనక్కర్లేదు.

పంచ ఉరుగును పట్టపు తఖ్తు చెయ్యగలవాడు వాడు.

సామాన్యప్రజ సహజంగా రాజు; కొందరు దోపిడివల్లా, దుస్తంత్రాల వల్లా, ముళ్ళు వేసీ, కళ్ళు పట్టుకునీ, దొంగతనం వల్లా దొర లౌతారు.

• అప్పుడు కాంపోజిట్ మదరాసు స్టేటులో ముఖ్యమంత్రిని ప్రధానమంత్రిగా వ్యవహరించేవాడు.

ప్రకృతిసిద్ధంగా దర్జా అయినవాడు ప్రకాశం.

ఇతన్ని 'ప్రకాశం గారు' అనలేము. అలాగ అంటే ఆప్తత పోతుంది. నన్ను నేను 'గారు' అనుకున్నంత నవ్వులాటగా, దుస్సహంగా ఉంటుంది.

ప్రకాశం పంతులు అని కూడా అనలేము.

మతం లేదు, కులం లేదు. మస్తానుకీ, బెస్తకీ నేస్తం 'పంతు' లెలా గవుతాడు?

పంతుళ్లు వేరు. వారూ ప్రముఖులూ, గొప్పవారే. న్యాపతి సుబ్బారావు పంతులు, మోచర్ల రామచంద్రరావు పంతులు: వారికి 'పంతులు' అనేది నప్పుతుంది: బిరుదూ ఒప్పుతుంది. సామాన్యులా?

'పంతులు'గాని, బిరుదుగాని తగిలించకుండానే 'ప్రకాశం' అన్న పేరులో కావలసినంత బరువూ, ప్రతిష్ఠా ఉన్నాయి. అందులోనే ఉన్నాయి కూడా మన ప్రధానమంత్రి పలుకుబడీ, ప్రభావమూను.

ప్రకాశం మూడుకోట్లజనం పేరు.

ప్రకాశం అంటే 1921! తరవాత వచ్చిన ప్రజా జాతీ యోద్యమానికి ప్రబల చిహ్నం అన్నమాట. మన రాష్ట్రంలో ఆ ఉద్యమ చైతన్యం అంతా అతనిలో ఇమిడి ఉంది. అతని మూర్తి (personality) లో మనకు ఆ ప్రజాశక్తి స్ఫురిస్తుంది.

ఆ ఉద్యమాన్ని గూర్చి ఇక్కడ ఒక్కమాట:

1921 కి పూర్వం, జాతీ యోద్యమంలో విద్వాంసులూ, అధికారులూ, మేధావులూ ప్రసంగా లిచ్చి, పత్రికలకు వ్రాసి కృషిచేస్తూ ఉండేవారు.

ఇక నలభై కోట్ల ప్రజ మాత్రం నిదానంగా నిద్రలాంటి మగతలో పురాణ స్మృతులు నెమరువేసుకుంటూ ఉండేది. ఆ నీరస స్థితికీ, విర్వీర్యానికీ సిగ్గు పడడం కూడా ఆ ప్రజకు తెలియదు. మానం లేదు: అభిమానం లేదు.

కృష్ణ లేదు, ఆత్మవిశ్వాసం లేదు. తన పీడ తన్నే తరుముతుంటే తల్లిచిల్లి పోయేది.

అప్పుడు భారత రంగంలోకి గాంధీ అవతరించాడు.

ఈయన చిత్రమైన వాడు.

ఈయన్ని మించిన మహా మేధావులు వర్తమాన భారతంలో ఉన్నారు. ఈయన కన్న విద్యాసంపత్తీ, ఆర్థబలమూ, శరీర సౌష్ఠవమూ, రాజకీయ విజ్ఞానమూ, కళాపైభవమూ ఉన్నవారు, హిమాలయ శిఖరాలవంటివారు ఎందరో నేటి భారతవర్షంలో సాక్షాత్కరిస్తారు.

అయితే, దవ్వు దవ్వునే నిలబడి వారిని గౌరవిస్తుంటాము.

వారిలో ఒక్కొక్కరిలో ఉన్న ఒక్క ప్రత్యేక శక్తి మంచు మన కించువరం – తప్పుడ తనం – నిలబడితే వాళ్లు మనకి అందరాని ఎవరెస్టులు అయిపోతున్నారు. వాళ్ల గొప్పతనం సామాన్యులమైన మన కొద్దితనం చూపిస్తుందే కాని, ఉత్సాహం గాని, ఆత్మవిశ్వాసం గాని, అహంకారం గాని, గర్వం కాని ఇవ్వలేదు.

ఇక గాంధీ మాహాత్మ్యం ప్రత్యేక ప్రతిభలో లేదు.

ఈయన మన కిళ్లు మిరుమిట్లు గొలపడు.

ఈయన కైలాస శిఖరం కాడు.

దేశం అంత జలాశయం గాంధీ.

గాంధీ గంగానది.

దానిలోని అమృతం మీకూ, నాకూ – అందరికీ అహ రహమూ అన్ని పనులకూ అందుబాటులో ఉంటుంది.

ఈయన శక్తుల మనకూ ఉండవచ్చు వనిపిస్తుంది.

ఈయన కట్టూ, బట్టా మనలో అందరికన్నా సామాన్యవి కట్టూ, బట్టా స్ఫురింపజేస్తాయి.

ఈయన కుటీర వాసమూ అలాగే.

ఈయన ఉపవాసాదులూ అలాగే.

కనుక తనవంటివాడే ఒకడు నల్లపైకోట్లమందికి నాయకుడైనప్పుడు, 'రాజమాన్య రాజ పూజితు' డైనప్పుడు, ఆ నల్లపైకోట్లలో ప్రతి దరిద్రుడూ తాను కూడా నాయకుడైనట్లే గర్వపడడం ప్రారంభించాడు.

గాంధీ వైస్రాయిని చూసినప్పుడు, ప్రతి కుగ్రామంలోనూ ప్రతి కాంగ్రెసు వాలంటీరూ, ప్రతి మసిషీ వైస్రాయి తనతోనే సంప్రదింపులకు వేంచేసినట్లు అనుకోవడం మొదలు పెట్టాడు.

'నా వంటి వాడు అంతవాడైనప్పుడు నే నెందుకు కాకూడదు?' అన్న అహంభావమూ, ఆత్మవిశ్వాసమూ, ఓడాయీ, ప్రాభవమూ మొదటిసారి వానిలో విజృంభించాయి.

1921 తో నల్లపైకోట్ల బొరియల్లో ఉన్న పురుగులు నల్లపైకోట్ల మానవులయ్యాయి.

మరి నల్లపైకోట్ల మానవులు సముద్రంలాగ పొంగి వస్తూంటే ఎందరు 'కానూట్లు' (Canutes) దానికి అవధులూ, అడ్డుకట్టలూ కట్టగలరు?

ఈ దృష్టితో చూస్తే ఆచార్యులూ, పండితులూ, భాష్యకారులూ, ప్రభువులూ – పిళ్లు మాత్రమే గాంధీ శిష్యులు కారు.

సూక్ష్మంగా చూస్తే గాంధీ అనుచరులు ఒక్క కాంగ్రెస్ వాదులు మాత్రమే కూడా కాదు. కాంగ్రెస్‌వారూ, కమ్యూనిస్టులూ, అన్ని రాజకీయ పక్షాలవారూ – అడ్డరు కట్టి వారూ, కట్టనివారూ. అహింస అనే వారూ, అనని వారూ, హరిజనోద్ధరణకు భుజా లొగ్గేవారూ, ఒగ్గనివారూ - అందరూ

అయన అనుచరులే! అంటే అనిబద్ధమైన అశేష భారత ప్రజానూ గాంధీ సంతతే! గాంధీ నేటి భారతదేశానికి బాపూ!

1921 తో మన రాష్ట్రంలో కూడా ఒక్కసారి ఒళ్లు విరుచుకుని హుమ్మని లేచిన జన సామాన్యానికి ఉన్న గుణా లన్నీ ప్రకాశంలో ఉన్నాయి. ఆవేశం, ఉత్సాహం, ఆగ్రహం, అనుగ్రహం, ఔదార్యం, అసూయ, పట్టుదల, మొండితనం, సాహసం, తిక్క - అన్నీను.

అన్నింటికీ అడుగున అంతర్వాహినిగా సహజమైన ఒక బుద్ధి సూక్ష్మత కూడా ఉంది.

ఈ గుణాల కలయిక అతన్ని అప్రతిహత మైన ఒక శక్తిగా చేసింది.

మేధావిగా కనబడే వాని సమక్షంలో మనం కూడా మేధకుని ఒడుపుగా తిరుగుతాము. అలాగే సజ్జనులుగా కనబడేవారి సన్నిధిలో కూడా. అలాగ కనబడకుండానే తెలివైనవాడే నిజంగా మన్ని లోబరచుకుంటాడు. ప్రకాశం అలాంటి వాడు.

ఈ భావా లన్నీ మొన్న 'నా జీవిత యాత్ర' చదివాక నా మనస్సులో కలిగాయి.

అతని చిన్నతనపు చేతలూ, గాఢలుగా అయిపోయిన కొన్ని సంఘటనలూ, ఆ తరవాత 1921 మొదలుకొని మొన్నటి శాసనసభా నాయకత్వపు సంవడుల దాకా జరిగిన సంఘటనలూ - అన్నీ మనస్సులోకి పరుగెత్తుకుని వచ్చాయి.

ఒకటి తేలింది. చిన్ననాటి ప్రకాశమే ఇప్పటి ప్రకాశమూనూ!

కొందరి జీవితాల్లోలాగ ఇతని జీవితంలో అభూత మైన మార్పులూ, వింత ఉప్లవాలూ వచ్చిపడి ఇతన్ని ఒక కొత్త మనిషినో, వింత మనిషినో చేసి పారెయ్యలేదు. ఇతని బ్రతుకులోని స్వచ్ఛతా, వేడీ పోగొట్టలేదు. పాత గుణాలే జాతి అంత విశాలంగా పెరిగాయి. అంతే!

ఎంత బాగుంది 'నా జీవిత యాత్ర'!

యాభై ఏళ్ళ గాథ పండెపు గుర్రంలా పరిగెత్తింది.

ప్రకాశం గొప్ప రచయిత కాడు. 'శిల్పి' కాడు - జవహర్‌లాల్ నెహ్రూ లాగ.

నెహ్రూ 'స్వీయ చరిత్ర' గడసరి. కళావేత్తా, ఉత్తమ సంస్కర్తా గంగుడి దిద్ది, రాగాలు పోసి సుందర నిర్మాణంగా తయారు చేసినది. దానిలో ఒక అపూర్వ సంఘటన వచ్చినప్పుడు, ఒక అసాధారణ వ్యక్తి అవతరించినప్పుడు, ఒక తీవ్ర సమస్య ఎదురుకొన్నప్పుడు గ్రంథకర్త మనస్సు ఎన్ని విధాలుగా ఆలోచించిందో, ఎలాగ పని చేసిందో అన్నీ విపులంగా విరింపబడ్డాయి.

'నా జీవితయాత్ర' అలాగ కాదు. సంఘటన తరవాత సంఘటన; సమరం తరవాత సమరం; ఎటొచ్చీ చిన్నతనంలో చిన్నవీ. పెద్దగాక పెద్దవీ. చరిత్రకారుని అభిప్రాయాలు వినం. మన అభిప్రాయాలు ఇవ్వం. సరదాగా చదువుకుంటూ పోతాము.

'Rough, and tough, we are the stuff! We want
to fight and cannot get enough!'

అన్నట్టు మన కనిపిస్తుంది.

ఒక్కొక్క యాత్రకు గమ్యస్థానం ఉంటుంది. కనుక అ యాత్రా మార్గం గమ్యస్థానం కోసం తీర్చిదిద్దిన ట్లుంటుంది.

మరి ప్రకాశం యాత్రకు గమ్యస్థానం లేదు.

కనుక యాత్ర ఆగిపోవడము లేదు. అలాగ సాగిపోవడమే, అంటే స్వరాజ్య స్థాపనతో ఆగిపో దన్నమాట!

బ్రతికున్న మానవుని యాత్ర ఆగిపోతుందా! అ మార్గం తీర్చిదిద్దినట్లు కాక మలుపులతోనూ, వంపులతోనూ నిండి ఉంటుంది. ప్రతి మలుపు

వెనకాలా ఏవో ఏంతో, వేడి వేడి పోట్లాటో ఉండి తీరుతుంది. మలుపు లేని మార్గం మనకి బాగుండదు. దానిలో సరదా ఉండదు.

వస్తాలు, చిన్నాలు వేయకుండా 'జీవితయాత్ర' వ్రాయడంవల్ల ఒక విధమైన సొగసూ, ఆకర్షణా లేకపోయినా, కథకు బలమూ, తీవ్రగమనమూ వచ్చాయి.

తనకు అనుకూలమైనవీ, విరుద్ధమైనవీ కూడా విశేషాలన్నీ సమానోత్సాహంతో ఒకటే రుచితో చెబుతాడు.

సందె చీకట్లో కిటికీలో కూచున్న ప్రకాశాన్ని యెనమండ్ర కొండయ్య ఊచి పుచ్చుకుని కొడతాడు. పట్టుగలు రాజమహేంద్రవరంలో తాసిల్దారు కచేరీ దగ్గిర ఆ కొండయ్యనే బండిలోనుంచి పడదోసి చలపతిరావూ. తానూ దూకబోవడం వగైరాలు.

తన్ను, తన మతానీ పచ్చడి చెయ్యడానికి రాకినాడ నడి వీధిలో సింహాంలాగ వచ్చిన సింగితపు అబ్బాయి వీరగాథ భారతంలోనుంచి కత్తించిన కథా ఖండంలా గుబుటుంది – ఘల్లుమనే బాణాకర్ర, తాడిలాంటి రాడి వెంకటరత్నం ఒక్క దెబ్బతో చిత్తడం, ఒకే దెబ్బ కిద్దరు యోధులకు ఒక్కసారే తగిలి భూశయనం చేయించడం – ఈ చిత్రాలన్నీ తన కర్తృత్వమే చేసినా యెంత ఆర్తితోను, ఆనందం, ఆవేశంతోనూ ఇచ్చిస్తాడు.

తరవాత మునిసిపల్ వ్యవహారాలలో తన ప్రతిస్పర్ధి ఓడమర్తి దుర్గయ్య గారిని అలాగే మెచ్చుగుంటాడు.

ఆ తరవాత మైలాపూరు మేధావులతో – మహా మహా న్యాయమూర్తులతో వచ్చిన మాట పట్టింపుల దాకా ఈ గుణం కనబడుతుంది.

మెచ్చుకుని వెన్ను చరచ గలడు; నొచ్చుకుని వెన్ను చీల్చగలడు.

మరొక విశేషం. ఎక్కడా తన లోపాలకు కూడా తలుపు మూయడు.

అల్లాటి ఆదెయ్య కొడుకు చిన్న ప్రకాశాన్ని తన్నాడు. వాటి గూర్చి ఇతవి కందు. కనుక ఎలాగ పగ తీర్చుకోవడం? వాడి పుస్తకం దొంగ తనం చేసి, సుదర్శన చక్ర ముక్కలు ముక్కలుగా చింపి పారేస్తాడు. ఇదో రకం చచ్చు పగ తీర్చుకోవడం. అయితే మాత్రం?

నాటకాల్లో వేషాలు వేసేటప్పుడు నారీమణులతో సహవాసం తప్పదు? ఏం జెయ్యమంటారు?

అమాంతంగా ఒక అభూత నైతిక విప్లవం వచ్చి అహింసలో పడిపోవడం, ఆగ్రహ కైలాసం అధిరోహించడం _ ఇలాంటి వేవీ జరగవు.

అసలు ఇతని జీవితంలో ఉన్న బలం అంతా ఇదే. ఇతగాడు సామాన్య ప్రజ – వెలుగు చీకట్లతో?

కొందరి స్వీయ చరిత్రలు చదువుతుంటే – వాళ్లు పుటుకతోనే సజ్జనులై పుట్టి ఊరుకున్నారా అనిపిస్తుంది. మరి కొందరివి చదువుతుంటే ఒక్కసారి ఒక మహా మహూర్తాన వాళ్లు ఎలాగ మంచివాళ్ళు అయిపోయారో అనిపిస్తుంది.

జవహర్‌లాల్ జీవితంలో వచ్చే సంఘటనలు ఒక్క జవహర్‌లాల్ జీవితంలోనే వస్తాయి.

పండితుడు మోతీలాలు ప్రసవ ఏకమాత్ర పుత్రుడు. బాల్యంలోనే భారతీయ ప్రముఖులతో సహవాసము; మాంట్యాజీ, సర్ సప్రూ అను దినమూ ఆనంద భవనానికి విచ్చేసే అతిథు లాయె! ఇంగ్లాండులో చదువు.

ముందే తేలిపోతుంది మన కందని వాడని.

ఆయన అనుభూతులు మనకు రావు. పుట్టుకతోనే కాంగ్రెసు ప్రెసిడెంటుగా పుట్టేసి ఊరుకున్నా దనిపిస్తుంది, ప్రహ్లాదుడూ నగైరా లాగ.

జవహర్‌లాల్ ప్రత్యేక వ్యక్తి, గొప్ప వ్యక్తి, అసాధారణుడు.

ప్రకాశం చేసే పనులు మనమూ చేస్తాము. అతడు అనే మాటలు మనమూ అంటాము.

కన్నతల్లి కడుపుతీపివల్ల పూటకూటి ఇల్లు పెడితే కాలక్షేపం చేసినది మొదలుకొని, ప్రధానమంత్రి పదవి అధిష్ఠించిన దాకా ఏ వాక్యా, ఏ కార్యమూ మనకి దూరమైనదిగా కనబడదు.

ప్రజే ప్రధానమంత్రి అయింది.

కాని ఆ సాధారణతలో ప్రత్యేకత కూడా ఉంది. కనుక, ప్రకాశాన్ని ఏరి పట్టం కట్టకుండి.

ఇక్కడ ఒక్కమాట:

ఇతని జీవితయాత్రా మార్గ మంతా బాణాకర్రలఘులఘులతోనూ, తుపాకీ గుండ్ల తొంచరలతోనూ మాత్రమే నిండి ఉంటుం డని అనుకోకూడదు.

నిజమే, ఇతగాడు తుపాకీమందు వాసన కొడితే చాలు ఎదురుగా కదన రంగంలో దూకే రకమే!

కాని ఇతని బతుకులో గుండెలు కరిగించే కరుణ ఘట్టా లెన్నో ఉన్నాయి! తండ్రిగారు వెళ్లిపోయాక, తల్లిగారు వంటపూటి ఇల్లు పెట్టడమూ, నాలుగు రాళ్ళకోసము మేనమామ, బావమరుదుల ఇళ్ళ నుద్యో అల్లల్లాడడమూ, సిరుపేద కుర్రవాడు లాయర్లని చూచి సరదాకు లాంగ్‌కోటు కుట్టించుకుని బడాయిగా వేసుకోవడమూ, రైలులేని రోజుల్లో పన్నెండేళ్ళ పిల్లవాడు ఒంగోలునుంచి రాజమహేంద్రవరం దాకా వెళ్ళడమూ, ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారూ, ఇల్లాసు లక్ష్మమ్మగారూ ఈ పెంపుడు బిడ్డతో ఎడబాటు సహించలేక ఏడవడమూ, తరవాత తాను బారిష్టరయ్యాక వట్టి కృతజ్ఞతా ప్రదర్శనానికి కాక కేవలమూ ప్రేమవల్ల వారి ఋణము తీర్చుకోవడమూ, తాను నెలకు ఏ డెనిమిదివేల రూపాయలు తెస్తూంటే, తల్లిగారు మరణ శయ్యమీద ఏడెనిమిది వందల రూపాయలు కూడబెట్టి

ఇవ్వడమూ – ఈ గాథలు చదువుతుంటే ఒక్కొక్కసారి గుండెల్లో పోటు పొడిచిన ట్లవుతుంది. కళ్ళు కరుగు తుంటాయి.

1921 తరువాత సాగే 'నా జీవిత యాత్ర' ఎలా ఉంటుందో, త్వర త్వరగా చదవా లని ఉంది.

ఇది ప్రజాయుగం అంటున్నారు. ఇక్కడ ప్రజా ప్రభుత్వం వచ్చిం దంటున్నారు ఈ రోజుల్లో ఎంత సామా న్యాతిసామాన్య డైనా తనకంటె ఎత్తుగా పీఠబడినట్లుగా ఉన్నవాణ్ణి సహించలేడు.

అధికారం ఉపహ్యాంగా ఉంటుంది. అది రక రకాలు: మెదడుకు సంబంధించినది, నైతిక వర్తనకి సంబంధించినది, ఆర్థశక్తికి సంబంధించినది.

ఇలాగ జాతీయ నాయకుల్లో ఒక్కొక్క గొప్ప మేధాని ఉంటాడు. ఒక్కడు పదివేలమందిలో ప్రసంగం ఇస్తున్నపుడు తన తెలివి తేటలు చూపిస్తూ. పరమతత్వాలు విశదపరుస్తూ, లెక్కలతో, అంకెలతో, సుభాషి తాలతో జనానికి ఊపి రాడనీయక తన పొస్నత్యము తెలిసో తెలియకో పాటుతూ ఉంటాడు. మరొక్కడు అహింసాప్రేమలూ, ఆర్జవాపేశమూ తానే మూర్తి కట్టిన ట్లనిపిస్తూ నీతి కథలు మెత్తమెత్తని మాటల్లో పొడిగి అపర ధర్మరాజులా అయిపోయి, మనకి అంచ రానంత మంచివాడుగా పాక్షిత్కరిస్తాడు.

వీళ్ళు గొప్పవాళ్ళు కా రనను.

మనలోనివా రవి మాత్రం అనిపించరు. ఈ ప్రజాయుగంలో అసలే అనిపించరు.

వీళ్లు –

Too bright and good, for human nature's daily food!

మనలాగ ఉంటాడు, మనలాగ చేస్తాడు. మనలాగ బాధపడ్డాడు, సుఖ పడ్డాడు. మనకు మించిన తెలివి తేట లున్నా మన బుర్రలకి వానిని రుద్దడు. మనకు తెలియకుండానే వాటిని మనకోసం వినియోగిస్తాడు.

అలాంటి వాడు కాకపోతే, ఇం కెవడు ఈ రోజుల్లో మన రాష్ట్రానికి ప్రధానమంత్రిగా ఉండడానికి అర్హుడు చెప్పండి!

ప్రత్యేక వ్యక్తిలాగ కాక ప్రజకు లాగే తనకు కులంలేదు, మతం లేదు, వయస్సులేదు దెబ్బలయ్యేందుకు వాడయి తాత అయి పోలేదు.

పాత స్మృతులు నెమరువేసుకోకుండా జాతితో సమానంగా పరుగెత్తు కుంటూ వచ్చేవాడు కాకపోతే ఇం కెవ్వడు మన రాష్ట్రానికి ప్రధానమంత్రిగా అర్హుడు చెప్పండి!

పాకీవాళ్ళు, పారిశ్రామికులు, కర్షకులు, కష్టజీవులు అటువంటివాడితో కాక మ రెవ్వరితో తమ కష్ట సుఖాలు వెళ్ళబోసుకుంటారో చెప్పండి!

రాళ్లు విసిరేవారిలోనూ, తుపాకీ దెబ్బలు తినేవారిలోనూ మాత్రమే ఉండే స్వభావం గల వాడ్తే నాయకుడ్డిగా వీళ్లు స్వీకరించగలరుగాని, మరెవ్వరి సాన్నిధ్యానికి ఆప్తతతో వస్తారయ్యా!

మళ్ళీ అంటున్నాను: ఇది ప్రజా ప్రభుత్వం అయితే, ప్రకాశం లాంటి ప్రధాని మరొక్కడు ఇప్పుడు దొరకడు. ఈ దృష్టితో చూస్తే ప్రస్తుత భారతదేశంలో ఏ రాష్ట్రానికీ ఇంత అర్హుడయిన ప్రధాని లేడు!

(తరువాత చెందిన మార్పులతో)

కోపల్లె – ముట్నూరి – భోగరాజు

[శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి 'కాకి వెంగుళ' అన్న గ్రంథానికి శ్రీగారు సంతరించిన ముందుమాట నుంచి]

మునుట్నూరి కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు గార్లున్నూ, చెంకువాడ నరసింహం, కౌతా శ్రీరామశాస్త్రి గార్లున్నూ బ్రహ్మయ్యగారికి గురువులూ, అత్యంత ఆప్తులున్నూ. మరి వీరిలో ముఖ్యులు కోపల్లె, ముట్నూరి, భోగరాజు వారు; మరి వీరిలోనూ ముఖ్యులు ముట్నూరి వారు. బ్రహ్మయ్యగారికి పరమ గురువులు వీరు.

ఇక వర్తమాన్ధ్ర లోకానికి గురుదేవులైన రఘుపతి వేంకటరత్నం నాయుడుగారికి మొదటితరం అంతేవాసులు వీరందరూ; వారికి ప్రియతములైన అనుచరులున్నూ. వీరి మూర్తులను (personalities) నాయుడుగారే తీర్చి తీర్చి నిర్మించారు. వీరి తరుణ మనో మందిరాల తలుపులు తెరచినవారు వారే; వానిలో ప్రభాత మంగళ కాంతులూ, పరిమళ భరా లైన దివ్య పవనాలూ వారే ప్రసరింపజేశారు.

నేను కూడా వారి చరణ సవిధాన కూర్చున్నవాడనూ, వారికి అత్యంత సన్నిహితుడినూ. వారి శిష్యులలో దాదాపు తుదితరం వాడను.

కనుక – హనుమంతరావు, కృష్ణారావు, పట్టాభిగార్లు నాకు పెద్ద అన్న గార్లు; నా వారు. ఒకే ఒక గురుదేవ చరణాలను సేవించుకున్నవారం మేము.

ఒకే ఒక దివ్య సంసారం మాది.

మా ప్రేమలూ, మా భక్తి ప్రపత్తులూ, మా గురు శిష్య సంబంధాలూ మీలో చాలా మంది ఇవ్వుడు భావించుకోనైనా లేరేమో!

కాళేశ్వరరావు గారు నన్ను ఆప్యాయంగా "తమ్ముడూ" అని పిలుచు కున్నపుడు, నే నెలాగున వివశుణ్ణి అయిపోయేవాడనో మీ కెలాగున తెలియ పరచడం?

నా అన్నలకు శిష్యుడూ, ప్రియతముడూ, సహచరుడూ అయిన బ్రహ్మయ్యగారు నాకు దగ్గర చుట్టం కారూ! మా విశాల సంసారం లోని వారే ఆయన కూడా!

మరి నాకు లాగే బ్రహ్మయ్యగారికీన్నీ మరీ మరీ ఇష్టులు మట్నూరి వారు. మా దృష్టిలో తెలుగునాట సంస్కారారామంలో పరిసిన సంపుల్ల మందారం మా కృష్ణారావుగారు. నా డేరుషివాటికలోనో "తపో భగ్నులై" నే డీ తెలుగునాట అవతరించిన తాపసులుగా వారిని బ్రహ్మయ్య గారు ఎర్రిస్తారు.

ఆయనవీ, కోపల్లె, భోగరాజులవీ కథలూ, గాథలూ చెప్పి చెప్పి బ్రహ్మయ్యగారు నన్ను ఎలాగ తన అనురాగావరణంలోనికి లాగు కొన్నారో, ఆయనకు నే నెలాగ లొంగిపోయానో గాని!

ఇక మా నాయుడుగారిని గూర్చి కూడా బ్రహ్మయ్యగా రన్న మాటలు వినండి. ఏ మట్నూరివాళో, భోగరాజువాళో అన్నట్లు విన్పిస్తాయి అవి నాకు.

"శ్రీ నాయుడుగారు శీతకిరణుడు. పూర్ణచంద్రునివంటివారు. ఇరవయ్యో శతాబ్ది ఉత్తరభాగంలో మనకు లభించిన స్వాతంత్ర్యసిద్ధికి కావలసిన అన్ని హంగులూ ఏర్పరచుటకు పందొమ్మిదో శతాబ్ది ఉత్తరభాగంలో జన్మించిన కారణజన్ములు డాయన. మద్రాసునుండి శ్రీకాకుళం వరకు ఆంధ్రమాగాణ ములు సేద్యము చేసి ప్రతి సంవత్సరం ముంగారు పంటలను పండించి

అనంతశాస్త్రికు లగు విద్వాంసులను ప్రభవింపచేసిన పంటకాపు ఆయన. మన మహాత్ముని కనుసన్నల స్వరాజ్య సంరంభమున వేల వాహినుల సమర రంగమున దుముకించి జయభేరులలో ఆంధ్ర పౌరుషమును, ప్రశస్తి దశ దిశలనూ చాటినవి వారి శిష్య ప్రశిష్యులే. నాయుడుగారికి నేను ప్రశిష్యుడను."

ఈ మాటలు వ్రాసిన బ్రహ్మయ్యగారివి కృతజ్ఞతతో ఆలింగనం చేసుకొంటున్నాను. నా గురుదేవులనూ, నా జ్యేష్ఠ సోదరులనూ తలచుకొని భక్తితో శిరస్సు వంచుకుంటున్నాను....

బ్రహ్మయ్యగారితో కబుర్లు చెప్పడమూ, కాలక్షేపం చేయడమూ నాకు చాలా యిష్టం....

ఆయన సంభాషణకు, ముఖ్యంగా ప్రియతము లైన పెద్దల ధోరణులనూ, వారికి సంబంధించిన సంఘటనలనూ వర్ణించేటప్పుడు ఆ చురుకుదనమూ, రంగూ, రుచీ ఎలాగు వచ్చాయి!

అకలంకమైన మనస్సుతో అమలినమైన ఆవేశంతో చెప్పడం అలాగు ఉంచండి! అడుగడుగునా కథా గాథా వచ్చి, రక్త మజ్జాస్థి మాంసాలతో మూర్తులను కట్టి, ప్రాణాలను పోస్తాయి. వాటి వెనుక చిత్రపటాలలాగవ నాటి రోజులు ఎదుట పరచుకుంటాయి.

"మట్నూరి వారిలో మంచి హాస్యరసం కూడా ఉంది." అని చెప్పి ఊరుకో దీయన. అలాగ ఎవరయినా అనగలరు. ఇలాగ కథ కూడా మొదలుపెట్టి సాగిస్తాడు ఈయన.

"ఒకసారి కృష్ణారావుగారూ, నేనూ మరికొందరం కూచిపూడి వద్ద ఒక గ్రామానికి వెళ్ళాం. ఆ ఊళ్ళో ఒక పెద్ద ఇంటికి, ఒక శాస్త్రిగారి ఇంటికి వెళ్ళాం. ఆయన అప్పుడే దేవతార్చన కావించారు. అక్కడ నిలబడ్డ మా తలలమీద పూజాజలం చల్లాడు. కృష్ణారావుగారి తలమీద మరి కొంతపేపు

పరి కొంత దివ్యోదకం చల్లారు. తరువాత ఇవతలికి వచ్చాక, మాతో కృష్ణారావుగా రన్నారూ: 'ఆయన నామీద తీర్థం ఎక్కువగా ఎందుకు అభిషేకించారో తెలుసునా? నా శిరస్సు సాలగ్రామం లాగున ఉండటంవల్ల' అని. అందరమూ గొల్లు మని నవ్వాం. మా గురువుగారిది బట్టతల కదా!"

"కృష్ణారావుగారూ, చెరుకువాడవారూ, నేనూ మరో ఊరు వెళ్ళాం. అక్కడ ముసురు పట్టింది. మేం కారులో కూర్చుంటే, చెరుకువాడవారు ఒక ఆసామీని పిలుచుకురావడానికి వెళ్ళారు - తలమీద తెల్ల ముసుగేసుకొని, త్రోవలో మరో తొందరలో ఉన్న ఒక ఆబోతు విలబడి ఉంది. వాన జల్లుల తెరలలో తిన్నగా చూపు ఆనక అది అయన వెంటబడింది. ఆయన తొందరగా నడిచి ఒక అరు గెక్కారు. 'మన నరసింహంగారు వెనక జన్మలో ఆవు సుమండీ' అన్నారు కృష్ణారావుగారు!"

ఇలాగ చెప్పుకు పోతూంటే ఆయన సుందరమూర్తి బ్రహ్మయ్యగారి మోల నిలబడుతుంది. వివశు డౌతాడు.

తనలాగే ఆయనను అమిత భక్త్యనురాగాలతో అర్చించే కోట సుబ్బారావుగారు అప్పుడు స్ఫురణకు వస్తాడు. వెంటనే సుబ్బారావుగారి తండ్రి కొడుకుతో అన్నమాటలు చటాలున మనస్సులో మెరుస్తాయి. "ఒరేయ్ _ నీవు నా కర్మ చేయవురా _ కృష్ణారావు కర్మ చేస్తావు" అన్నవి.

అప్పుడు - "కృష్ణారావుగారివి గుండ్రని ముఖం, పెద్ద కాటుక కళ్ళు. కోడేరువంటి ముక్కు, విశాల వక్షస్థలం, దీర్ఘ బాహువులు, బంగారువంటి మైచాయ, పెదవులమీద చిరునవ్వు, కిరీటం వంటి తెల్లని తలపాగా" అంటూ ఒక్కొక్కగీత, ఒక్కొక్క వర్ణం తగిలించుకుంటూ పోతాడీయన.

అంతలో కోపల్లె హనుమంతరావు గారు ప్రవేశిస్తారు - బ్రహ్మయ్యగారి మనోవీథిలో. ఈయన గొంతు మరీ ఉత్సాహంతో ఊగుతుంది.

కోపల్లెవారికి, మన కుటీర పరిశ్రమలలో వికసించే కళా విదగ్ధత అంటే అమిత గౌరవం అనీ, విరుపేదలూ, శ్రమ జీవులూ అయిన సామాన్య జనం అంటే వల్లమాలిన సానుభూతి అనీ, రుషి అయిన జగదీశచంద్రబోసు లాగ ఆయన చెట్టూ చేమకూ కూడా చుట్టమనీ చెప్తాడు. అలాగ చెప్పి ఆగిపోడు. కథలూ, సంఘటనలూ తోనుకు వస్తాయి ఇలాగ –

''పెద మద్దాలి తగరపు చెప్పులు బజారులో చూచేరు, హనుమంతరావు గారు. 'ఖరీ దెంత?' అని అడిగారు ఆ చర్మకారుని. 'రెండు రూపాయలు' అన్నా డతగాడు. 'ఇంత చక్కని పనికి ఇంత తక్కువ పుచ్చుకుంటే నీ కడుపు ఎలాగ నిండుతుంది?' అని మూడు రూపాయలు ఇచ్చారు ఆయన. తక్కువ ఇచ్చి విలువలేని అతని కళా నైపుణిని తక్కువ పరచడం కూడా ఆయనకు కిట్టదు.

''ఒకసారి బందరు చౌకులో మామిడిపళ్ళ దుకాణానికి వెళ్లా రాయన. 'నాజూకు పసందు పరక ఎంత?' అని అడిగారు దుకాణదారుణ్ణి. 'ఒక్క రూపాయి' అన్నాడు. 'వాటి గౌరవాన్ని తగ్గించవద్దు, రెండు రూపాయలు తీసుకో!'' అన్నా రాయన.

''కళాశాలలో విద్యార్థులు దంతధావనానికి వేపపుల్లలు విరగ దీస్తున్నారు. అధ్యాపకులు వేప పువ్వును పచ్చడికోసం కోస్తున్నారు. 'చెప్పుకోడానికి నోరు లేదు కాని, అవి ఎంత బాధపడుతున్నవో' అన్నారు చెమ్మగిల్లిన కళ్ళతో హనుమంతరావుగారు.''

ఈ సంఘటన వర్ణించి, 'అట్టి మూర్తి నభూతో న భవిష్యతి' అని గొంతెత్తి చాటుతాడు ఈయన.

మరి ముట్నూరి, కోపల్లెలు ఉన్న చోటికి ముందుకు తోసుకురాకుండా ఉంటారా పట్టాభిగారు?

వీరిని వేరే వేరే చూర దూరంగా ఉంచడం ఎలాగ; కలిసి చెట్టపట్టాలు వేసుకొని సాహిత్యకరిస్తా రాయెను :

అప్పుడు బ్రహ్మయ్యగా రంటా రిలాగ –

"ధాతవస్త్రాలతో, కిరీటం వంటి తలపాగాతో, ఆకు చెప్పులతో, ప్రసన్నవదనంతో, చేతికర్ర విలాసంగా తిప్పుకుంటూ, ప్రశాంతంగా కృష్ణారావుగారు నడిచి వస్తే. అంతలో సూటుబూటులతో, జరీ అంచు తల పాగాతో, బంగారు గొలుసుగల జేబు గడియారంతో, చేయి ఎత్తితే అందని ఎత్తైన గుర్రపు బగ్గీలో పట్టాభిగారు ప్రత్యక్షమౌతారు. ఒకరు ముట్నూరి వారాయెను : ఒకరు భోగరాజువా రాయెను : వేషభాషలలో, సంభాషణలలో, నడవడిలో, ప్రకృతిలో కొట్టవచ్చిన ట్లుండే దండీ వారి తారతమ్యం : – అయితే పట్టాభిగారికి కృష్ణారావుగారి సలహా సంప్రదింపులు పూర్తిగా ఉంటూ ఉండేవి. నేను ఏ దయినా పట్టాభిగారి అభిప్రాయం కోరినప్పుడు వారు తమ అభిప్రాయం చెప్పి, 'కృష్ణారావుతో కూడా సంప్రదించండి' అనే వారు. 'కృష్ణారావుగారు మీరు చెప్పిన దానికి భిన్నంగా చెప్తే, తిరిగి మీ వద్దకు రమ్మంటారా?' అని ప్రశ్నిస్తే, 'అబ్బే, ఎందుకు; కృష్ణారావు మాటే ఫైనల్ (final)' అంటుండేవారు. 'ఒక్క అరటిపండు తినడాని కిచ్చి, ఒక రాట్నం ఇచ్చి, ఇన్ని పుస్తకా లిచ్చి, ఏ పాడు వయినా కాగితా లిచ్చి, పిరాయుడ్డీ, కలం ఇస్తే నా కింకేమీ వద్దు.' అనేవారు ఆయన –"

అంటూ పట్టాభిగారివి గూర్చి, వారి అవిశ్రాంత కార్యోత్సవాన్ని గూర్చి, కత్తి అంచువంటి వారి మేధను గూర్చి, ఎన్నో భిన్న భిన్న వివరాలూ, విశేషాలూ మాలలాగ గుచ్చుకుంటూ పోతారు బ్రహ్మయ్యగారు సంభాషణలో.

అవి లేకపోతే మూర్తి చిత్రణ ఎలాగ? నడుమ నడుమ ఒక వక్రరేఖ తగలవచ్చు; అది వికటహాసం మాత్రం కాదు. ఒక నీలినీడ తోచ వచ్చు, అది మసిపూత మాత్రం కాదు....

ఆ మధ్య.....

నేను హైదరాబాద్‌నుండి బెజవాడ వెడుతున్నాను. దారిలో నా కారుకు ఏ తిక్క పుట్టిందో హఠాత్తుగా కదల నంది....

అంతలోనే బ్రహ్మయ్యగారు తన కారులో వస్తున్నారు. వారి డ్రయివరూ, నా డ్రయివరూ కలిసి నా కారును బుజ్జగించేలోగా మేము ఒక తూముమీద కూర్చున్నాం....

బ్రహ్మయ్యగారు ఆ రోజున .... కొన్ని గాథలు చెప్పారు మా సంభాషణలో – మహాపురుషులు కొందరిని గూర్చి. వాటిని ఈ ''జాతి వెలుగులు''లో కూడా ఉదాహరించిన ట్లున్నారు. ప్రజ్ఞా పాటవాలమీద కన్న, వినయ సంపదమీద, గౌరవ మర్యాద లిచ్చి పుచ్చుకోవడంమీద, ఈయనకు ఎక్కువ గౌరవము, ఇష్టమూ ఉన్నట్లు అనిపించింది నాకు – ఆ మాటలు వింటుంటే!

''మీరు నాకు గురుతుల్యులు'' అని దేశ భక్తునితో అన్నాడట మహాత్మాజీయే!

నవభారత శిరోమణిక్యం గదా జవహర్‌లాల్! ''నాకు మోతీలాల్జీ ఎటువంటివారో మీరూ అటువంటి వారు'' అని వెంకటప్పయ్యగారిని మన్నించాడట!

హిందూ ముస్లిం విభేదాల విషయమై నిష్కర్షగా గాంధీజీని ప్రతిఘటించాడు గదా పాంచాల సింహం! అయితే మాత్రం! 'ఎప్పటి కయినా ఆ సమస్యను పరిష్కరించగల మహానాయకుడు ఈ నలభై కోట్లలో ఒకే ఒక్కడు – మహాత్మాజీయే!'' అని ఉదారంగా ప్రకటించాడు లాలాజీ!

''నా కన్న మీరు త్యాగశీలురు; నేను నెలకు యెనభై రూపాయల భృతి తీసుకుంటున్నాను; మీ రేమీ తీసుకొనడం లేదు'' అని కోపల్లె వారిని శ్రీనివాసశాస్త్రివంటి ఉదాత్తుడే కీర్తించగలడు.

ఆ నాడు జాతీయ మహాసభా సమావేశం జరుగుతూంది. ఆ దివ్యదినాల్లో మాట: రివ్వున జవహర్ మెరుపులాగ లేచి నిలబడతాడు – నిర్భయంగా, స్వతంత్రంగా మెరపిపోయే కళ్లను పరచుకుపోయే జగత్తులోనికి పరిపిస్తూ: "పెద్ద లెల్లరకు విశాల దృక్పథం లేదు; నేటి ప్రపంచ పరిస్థితుల అవగాహన లేదు" అని ఉరుముతాడు. "జవహర్‌లాల్ మమ్మల్నందర్నీ తెలివి తక్కువ వారిగా చిత్రిస్తున్నాడు; వీని కొక కుమారుడు పుట్టి వీనిని తెలివి తక్కువ వానినిగా నిరూపించే శుభదినం కోసం నే నెదురు చూస్తున్నాను" అంటాడు మోతీలాల్జీ: అనురాగంతో ఆవంత ఒరిగిన వాత్సల్యమూ, ఉజ్జ్వల సంకల్పంతో ఒక్కింత శిక సెత్తిన తారుణ్యమూ: సత్యవిరతీ, స్వతంత్రతా, ధీరత, గంభీరత, నమ్రత, నవ్యత, ఔన్న త్యము, ఉదకువ – ఆనాడు సభా గగనాన ఎట్టి వానజల్లులూ కురిసేయో: ఎన్ని విద్యుల్లేఖలూ మెరిసేయో:....

బ్రహ్మయ్యగారి సంభాషణలలో ఉన్న గుణాలు కొంతవరకు ఈ "జాతి వెలుగుల"లోనూ స్ఫురిస్తాయి....

ఈ "వెలుగుల"లో అందరూ సూర్యచంద్ర తారామండలాల వంటి వారు. వీరిలో జవహర్‌లాల్, లాల్ బహదూర్ శాస్త్రి, లాలాజీ ఈయనకు ఆరాధ్యులూ, ప్రియులూ అయినా, అంతంత దూరాన ఉంటూ కాంతులు ప్రసరించినవారు. దేశోద్ధారక, దేశభక్తులు ఈయనకు కొంత దగ్గరగానూ, సుంత దవ్వులనూ మెరసినవారు, వయస్సూ మొదలైన కారణాలను బట్టి:

మిగిలినవారు ఆకాశమండపంలో లాగుననే ఈయన మందిరాంతరంలో గూడా దీపాలు. తాను కూడా తన స్నేహంతో వానిని తరుమ ఎగసన ద్రోపినట్లు అనిపించేటంత సన్నిహితులు:

నాయుడుగారు ఆ వెలుగుల మధ్య అఖండ జ్యోతి.

నాయుడుగారు వీరి గురుదేవులకే గురుదేవులు; అందుకే వారి కీర్తనకు

తన మాటలు చాల వన్నట్లు వాటితో ముట్నూరి వారి ఉజ్జ్వల వాక్కులు కూడా పొదిగి వినిపించారు.

ఇక - మిగిలిన అయిదుగురిపైననూ ఈయనకు పూజ్యభావమూ, అనురాగమూ, మెప్పు ఉన్నాయి. అయితే వీటిలో పాళ్ళు మారుతాయి వ్యక్తుల్ని బట్టి!

కోపల్లెవారి మీద పూజ్యభావం ఎక్కువ. ముట్నూరిపై ప్రేమ ఎక్కువ. భోగరాజుపై వల్లమాలిన మెప్పు. చెరుకువాడతో చెలిమే అనిపిస్తుంది. కౌతావారి మీద గొప్ప గౌరవం.

ఇక ఈయనకు కోపల్లె జీవితం ఒక దివ్యకీర్తన; ముట్నూరిది ఒక సుందరకావ్యం; పట్టాభిది ఒక ఉజ్జ్వల నాటకం.

హనుమంతరావును కీర్తిస్తూ ఈయన చిట్ట చివర ఇలాగ అంటాడు :

"ఆయన స్మరణీయుడైన తరువాత ఆయన ఉన్న తాదర్శాలకు అనుగుణంగా జాతీయ కళాశాల రూపు మలచి నిలుపలేకపోయినారు _ వ్యవహారదక్షులూ, మేధావులూ. పండితరాజులూ, మహాకవులూ, గొప్ప శిల్పులూ అయిన ఆయన మిత్రులూ, అనుయాయులూ కలిసి కూడా. కారణం ఇది: వారి అందరివీ ప్రతిభా పాటవాలు; వాటిని తనలో ఇముడ్చుకొని వాటిని మించిపోయిన తపస్సు ఆయనది" అని.

ఈ మాటలను బట్టి నాకు ఈ విధాన తోచింది: కోపల్లెకు జాతీయ కళాశాల దేవళం, ఇతరులలో కొందరికి కళాయతనం. మరికొందరికి గొప్ప సంస్థ - అవి :

ఇక బ్రహ్మయ్యగారు కృష్ణారావును వర్ణించే బాణీయే వేరు. అయినా, పగిడీ మొదలుకొని పాదరక్షలవరకు ఆ మనోహర విగ్రహమూ, ఆయన కొలువు కూటమూ, ఆ దర్బారుకో జ్ఞానప్రదీపితమై, భక్తిరస ప్లావితమై

కర్మాచరణ ప్రబోధకమై వింగినేలలకు విశ్రేణి కట్టే ఆయన వాణీ, ఆ ఔన్నత్యమూ, ఆ సౌలభ్యమూ. ఆ గాంభీర్యమూ, ఆ ఉల్లాసమూ - అంటూ ఇలాగ అలవికాని అనురాగంతో సాగిపోతాడు.

మరి పట్టాభి వద్దకు వచ్చేసరికి వేగమూ, వేడీ మిక్కుటమవుతాయి. వివరాలు ఎక్కువ అవుతాయి.

కోపల్లె, ముట్నూరులది కొంతవరకు భావలోకం. భోగరాజుది ఈ వాస్తవ జగత్తు.

కనుక పట్టాభి జీవితంలో సంఘటనలు ఎక్కువ. సంఘర్షణలూ ఎక్కువ.

దానిలో వైవిధ్యం ఎక్కువ. ఉద్యమాలూ, ప్రయోగాలూ, ప్రయత్నాలూ - వీటితో ఆయన మెదడులాగే, ఆయన మాటలాగే ఆయన జీవితంకూడా పందెపుగుర్రం లాగున పరుగెత్తుతుంది.

అది కార్యోత్సవం; తాను విశ్రాంతి కోరదు, దగ్గర చేరినవారికి ఊపి రాడనీయదు.

ఆధుని కాంధ్ర నిర్మాతలు ఇద్దరిలో, స్వభావాన్నిబట్టి చూస్తే, వేంకట రత్నానికి ముట్నూరి సన్నిహితుడు; వీరేశలింగానికి పట్టాభి దగ్గిర వాడు. అంకం పైననూ, ఆలింగనంలోనూ ఒదిగిపోగల అనుగులు వేంకటరత్నం అంతే వాసులు. ఇరుప్రక్కలనూ, వెనువెంటనూ మారు మాటాడక నడిచి పోయే కార్యశూరులు వీరేశలింగం అనుచరులు.

''అసంఖ్యాకు లగు వారి శిష్యులలో నే నొకనిగా కాక ప్రథమశ్రేణి శిష్యునిగా నా జోహారు లర్పించుకొనుచున్నాను'' అని పట్టాభిగారి నర్చిస్తా డీయన.

ఇలాగ ఆ మహాపురుషుల మూర్తులను చూపిస్తూ, ఆ కాలాలను మన మ్రోల పరుస్తూ, ఒక్కసారి నేడు తనచుట్టూ మూగి ఉన్న ఆంధ్రప్రజానీ,

దావిలో యువజనాన్ని పరికించి, తన గురుదేవు డైన కృష్ణారావు గొంతు రవ్వంత కుదుర్చుకొని ఇలాగ ప్రబోధిస్తారు, పాపం, బ్రహ్మయ్యగారు:

"మీ ఆదర్శము ఉన్నత మైనదిగా ఉండాలి. మీ అనుష్ఠానము ధర్మబద్ధ మైనదిగా ఉండాలి. మీ వర్తనము విశుద్ధ మైనదిగా ఉండాలి. మీకు జయము ధ్రువము. చిన్నలు, పెద్దలు, స్త్రీలు, పురుషులు కోపల్లెవారి త్యాగశీలమూ, ముట్నూరివారి విమలవర్తనమూ, భోగరాజువారి కార్యకౌశలమూ అలవరచు కొని, దేశ సౌభాగ్యమును పెంచుదురుగాక!"....

—'జాతి వెలుగులు' 146గ, త్రివేణి ప్రెస్.

BC

SPRA101B155

కృష్ణశాస్త్రి సాహితి

ఇంతవరకూ పుస్తకరూపంలో రాని
వచన, పద్య, గేయ రచనలు
శ్రీ శ్రీ 'ఆస్వాదానికి ఆహ్వానం' తో
ఇంపైన కూర్పుతీర్పులతో వెలువడుతున్నవి!

– ఇప్పుడు అందిస్తున్నవి –

వ్యాసావళి - 4 సంపుటాలు :
కవి పరంపర, కవితా ప్రశస్తి, మహావ్యక్తులు, అమూల్యాభిప్రాయాలు

గేయసంహిత – 2 భాగాలు :
అమృత వీణ, మంగళ కాహళి

– త్వరలో రానున్నవి –

మూగ నయాక (రకరకాల రచనలు) : 1, 2, 3 & 4
సొంత గొడవలు, పాత కథలు, హితులు సన్నిహితులు, ఇష్టాగోష్ఠి

కవితాసంకలనం :
బదరిక

శ్రవ్యనాటికలు - 4 సంపుటాలు :
క్షీరసాగరమథనం, అరుణరథం, విద్యావతి, కొత్త కోవెల

బాలల పాటలు :
పిల్లల రాజ్యం

వెండి తెర పాటలు – 2
గోరింట

రాజహంస ప్రచురణలు
9, జగదాంబాళ్ వీధి, మద్రాసు - 600 017

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	SPRA101B155
పుస్తకం పేరు	కృష్ణశాస్త్రివ్యాసావళి 3
తారీఖు	24 January 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	109
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	1, 121
లేని పేజీలు	no
తయారు చేసినది	Naveen
పేజీలు విడదీసినది	Naveen
స్కాన్ చేసినది	sharmila
పరీక్ష చేసినది	pragathi
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good